




సమాజ హితం – మా అభిమతం

www.arunaprabha.com

# అరుణ ప్రభ

ARUNAPRABHA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

RNI NO. TEL TEL/2023/89778








రంగారెడ్డి - హైదరాబాద్ సంపుటి : 04 సంచిక : 176, పేజిలు : 12, వెల రూ. 5/- సోమవారం -17 - ఆగష్టు - 2026

PUBILSHED FROM RANGAREDDY, HYDERABAD, CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD CHITTOR, VISHAKAPATANAM, SRIKAKULAM, ELLURU, ONGOL, VIJAYAWADA, SPSR NELLORE, PRAKASHM, GUNTUR, KURNOOL, KADAPA


### వరుస సెలవులు.. తిరుమలలో భారీ రద్దీ.. దర్శనానికి సుదీర్ఘ నిరీక్షణ


2లో

- తిరుమలకు పోటెత్తిన భక్తులు
- శ్రీవారి సర్వదర్శనానికి 22 గంటల సమయం
- నిండిపోయిన వైకుంఠం క్యూ కాంప్లెక్స్ కంపార్ట్‌మెంట్లు
- శనివారం 90 వేల మందికి పైగా స్వామివారి దర్శనం

### జాతిపితకు ఐసీసీ నివాళి: గాంధీ జయంతినే 2027 వరల్డ్ కప్ ఆరంభం!


2లో

జాతిపితకు గౌరవంగా

ఐసీసీ, ఆతిథ్య దేశాల కీలక ప్రతిపాదన

దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా సంయుక్త ఆతిథ్యం

మళ్లీ 'సూపర్ సిక్స్' ఫార్మాట్‌తో 14 జట్ల మధ్య టోర్నీ

త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశం

### ట్రంప్‌ను 'ఫుడ్ ట్రక్'తో పోల్చిన ఇరాన్.. హర్మూజ్ జలసంధిపై మాటల యుద్ధం


2లో

- హర్మూజ్ జలసంధిపై ట్రంప్ హెచ్చరికలకు ఇరాన్ గట్టి కౌంటర్
- ముందు సొంత భద్రత చూసుకోవాలంటూ ట్రంప్‌కు ఘాటు సూచన

## ఫామ్‌హౌస్‌లో కాదు.. అసెంబ్లీలోకి రా..


# కేసీఆర్‌కు రేవంత్ రెడ్డి సవాల్

### కేసీఆర్‌కు రేవంత్ అసెంబ్లీ సవాల్

- ఫామ్‌హౌస్‌లో ఉండి విమర్శలు వద్దన్న సీఎం
- రైతుల అంశంపై చర్చకు పిలుపు
- బీఆర్ఎస్, బీజేపీపై విమర్శలు
- సంగారెడ్డిలో స్మార్ట్ రేషన్ కార్డుల ప్రారంభం



హైదరాబాద్: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సవాల్ విసిరారు. రైతుల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన మేలు, బీఆర్ఎస్ హయాంలో జరిగిన మిగతా 2 లో




### వచ్చే వారం నుంచి ఉద్యోగ నోటిఫికేషన్ల జాతర!

- వచ్చే వారం నుంచి వరుసగా ఉద్యోగ నోటిఫికేషన్లు
- పారదర్శకతే లక్ష్యంగా టీజీపీఎస్సీ నియామక ప్రక్రియ
- ప్రతి ఆరు నెలలకు ఒకసారి పోటీ పరీక్షల నిర్వహణకు సర్కార్ ప్లాన్
- ఇప్పటికే 70 వేల ఉద్యోగాల భర్తీ పూర్తి చేశామన్న సీఎం రేవంత్
- వదంతులు నమ్మొద్దని, ప్రిపరేషన్‌పై దృష్టి పెట్టాలని యువతకు సూచన

2లో


2లో

### నెహ్రూ, ఇందిరలను దాటేసిన మోదీ... ఎర్రకోట ప్రసంగాల్లో రికార్డ్

- ఎర్రకోట ప్రసంగాల నిడివిలో ప్రధాని మోదీ కొత్త రికార్డు
- దేశానికి సుదీర్ఘకాలం సేవలందించిన నలుగురు ప్రధానుల్లో అగ్రస్థానం
- 13 ప్రసంగాల్లోనే 1177 నిమిషాలు మాట్లాడిన నరేంద్ర మోదీ
- నెహ్రూ, ఇందిరాల కన్నా తక్కువ ప్రసంగాలు, కానీ రెట్టింపునకు పైగా సమయం


2లో

### హైదరాబాద్-అమరావతి: పక్కపక్కనే హైస్పీడ్ రైల్.. 12 వరుసల ఎక్స్‌ప్రెస్ వే!

- హైదరాబాద్-చెన్నై హైస్పీడ్ రైలు, ఫ్యూచర్ సిటీ-బందరు ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణం
- రెండు ప్రాజెక్టులు ఒకదానికొకటి సమాంతరంగా నిర్మాణం
- రెండు మార్గాలకు కలిపి ఒకేసారి భూసేకరణ చేపట్టేందుకు ప్రణాళిక
- ఫ్యూచర్ సిటీ, అమరావతి, బందరు పోర్టు మధ్య కనెక్టివిటీ బలోపేతం
- ఎడమవైపు రోడ్డు, కుడివైపు రైలు మార్గం ఉండేలా అలైన్‌మెంట్ ఖరారు

## సన్న బియ్యానికి కేంద్రం పూర్తి నిధులిస్తేనే ఫొటో ముద్రిస్తాం

### మోదీ ఫొటో కావాలంటే సన్నబియ్యం డబ్బులివ్వండి: ఉత్తమ్

- స్మార్ట్ రేషన్ కార్డులపై ప్రధాని ఫొటోకు మంత్రి ఉత్తమ్ షరతు
- పేదల రేషన్ కార్డుల విషయంలో రాజకీయాలు వద్దని హితవు
- రాష్ట్రం సన్నబియ్యం ఇస్తుంటే, కేంద్రం దొడ్డు బియ్యమే ఇస్తోందని విమర్శ
- ప్రొటోకాల్ ప్రకారం రేషన్ షాపుల్లో ఇప్పటికే ప్రధాని ఫొటో ఉందని వెల్లడి



హైదరాబాద్: స్మార్ట్ రేషన్ కార్డులపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చిత్రాన్ని ముద్రించాలన్న డిమాండ్‌పై తెలంగాణ పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందించారు. సన్న బియ్యం పథకానికి మిగతా 2 లో

## 2025 నాటి ఓటర్ల జాబితాతోనే స్థానిక ఎన్నికలు

### ఏర్పాట్లు ముమ్మరం చేసిన రాష్ట్ర ఎన్నికల సంఘం

- అక్టోబరు 3న 'సర్' తుది ఓటర్ల జాబితాలు ప్రచురణ
- పుర, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీల్లో ఫొటో గుర్తింపు ఓటర్ల జాబితాల ప్రచురణకు ఏర్పాట్లు
- స్థానిక సంస్థలకు అక్టోబరులో ఎన్నికలు నిర్వహించాలన్న యోచనతో ప్రభుత్వం ఉంది



అమరావతి: స్థానిక సంస్థల ఎన్నికలు ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) తుది ఓటర్ల జాబితాలతో కాకుండా, 2025 నాటి ప్రత్యేక సంక్షిప్త సవరణ (ఎస్ఎస్ఆర్) ఓటర్ల జాబితాల ఆధారంగా మిగతా 2 లో

## నాయకులు రూ.2 వేలు ఇస్తే.. రూ.2 లక్షలు సంపాదించుకుంటారు

### మాకు నీతి ఉంది.. డబ్బులు తీసుకోబోమని చెప్పండి

- ★ ఎన్నికల్లో డబ్బులు తీసుకోవడం మానేయలేమా?
- ★ రోడ్డెక్కితే రెచ్చగొడతారు
- ★ సంకల్పబలంతో ఏదైనా సాధ్యమే
- ★ ప్రతి కుటుంబానికి మూణ్నాలుగు పథకాలు
- ★ 99.5% రుణం చెల్లించేది మీరే
- ★ 'ఎన్ని పనులు చేసినా, పథకాలు అమలు చేసినా.. తాత్కాలిక ప్రయోజనం వస్తే అటు వెళ్లిపోతుంటారు



అమరావతి: 'ఎన్నికల్లో డబ్బులు తీసుకోవడం మనం ఎందుకు మానేయలేం? ఏ రాజకీయ నాయకుడూ ఇంటిలో నుంచి డబ్బులు తీసుకురారు. వాళ్లు ఇచ్చేదంతా లంచాల సొమ్మే. ఎన్నికల్లో రూ.2 వేలు ఇస్తే, దానికి రూ.2 లక్షలు సంపాదించుకుంటారు. అంటే వాళ్లు సంపాదించుకునే దానిలో మీకు చిల్లర విదిలిస్తారు. ఓటు కోసం మీకు రూ.2 వేలు ఇచ్చాక, వీళ్లకోసం ఎందుకు పనిచేయాలి, మిగతా 2 లో



### హస్త కళాకారులకు అందుబాటులో వుడ్ బ్యాంకులు

- ధవళేశ్వరంలో సెంట్రల్ క్రాఫ్ట్ వుడ్ బ్యాంకును ప్రారంభించిన ఉప ముఖ్యమంత్రి
- వర్చువల్‌గా మరో ఆరు కేంద్రాలూ ప్రారంభం
- 5వేల మంది హస్త కళాకారుల కుటుంబాలకు ముడిసరకు సమస్య తీరనుంది
- సెంట్రల్ వుడ్ బ్యాంకులో ప్రస్తుతం 30 క్యూబిక్ మీటర్ల కలప ఉందని, వచ్చే ఐదేళ్ల అవసరాలకు సరిపడా నిల్వలు అందుబాటులో ఉంచుతాం

2లో


2లో

### ప్రాణం ఉన్నంతవరకు బీఆర్ఎస్‌తో కలవను కల్వకుంట్ల కవిత

- షోకాజు నోటీసు లేకుండానే పార్టీ నుంచి పంపించారని ఆవేదన
- రాబోయే ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి వస్తామని ధీమా
- బీసీలకు 50 శాతం రిజర్వేషన్ల కోసం పోరాడతామని ప్రకటన
- కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి రాదని జోస్యం

అరుణ ప్రభ
ARUNAPRABHA TELUGU DAILY
www.arunaprabha.com



## వచ్చే వారం నుంచి ఉద్యోగ నోటిఫికేషన్ల జాతర!

హైదరాబాద్: తెలంగాణలోని నిరుద్యోగ యువతకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియను వేగవంతం చేస్తూ వచ్చే వారం నుంచి వివిధ శాఖల్లోని ఖాళీల భర్తీకి వరుసగా నోటిఫికేషన్లు జారీ చేయనున్నట్లు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) ప్రకటించింది. మరోవైపు ప్రభుత్వ శాఖల్లో ఏర్పడే ఖాళీలను ఎప్పటికప్పుడు భర్తీ చేసేందుకు ప్రతి ఆరు నెలలకు ఒకసారి పోటీ పరీక్షలు నిర్వహిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ రెండు కీలక ప్రకటనలతో ఉద్యోగార్థుల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా టీజీపీఎస్సీ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం ఛైర్మన్ బుర్రా వెంకటేశం మాట్లాడారు. నియామక ప్రక్రియలో పారదర్శకత, జవాబుదారీతనానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తామని ఆయన స్పష్టం చేశారు. చిన్న పొరపాటు జరిగినా వేలాది మంది అభ్యర్థుల భవిష్యత్తుపై ప్రభావం పడుతుందని, అందుకే ప్రతి దశలోనూ అత్యంత జాగ్రత్తగా వ్యవహరిస్తామని తెలిపారు. ప్రశ్నాపత్రాల రూపకల్పన నుంచి మూల్యాంకనం వరకు అన్ని ప్రక్రియల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి, పొరపాట్లకు తావులేని వ్యవస్థను రూపొందిస్తున్నట్లు వివరించారు. ఇదే సమయంలో సంగారెడ్డిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే సుమారు 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసిందని గుర్తుచేశారు. ఇటీవల మరో 10 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇచ్చామన్నారు. ప్రభుత్వ శాఖల్లో ఏర్పడే ఖాళీలను గుర్తించి, ప్రతీ ఆరు నెలలకు ఒకసారి నోటిఫికేషన్ ఇచ్చి పరీక్షలు నిర్వహించేలా పటిష్టమైన విధానాన్ని తీసుకొస్తామని ప్రకటించారు. ఉద్యోగాల భర్తీ బాధ్యత ప్రభుత్వానిదేనని, నిరుద్యోగ యువత ఎలాంటి వదంతులను నమ్మకుండా పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. టీజీపీఎస్సీ, ప్రభుత్వం నుంచి వచ్చిన ఈ స్పష్టమైన హామీలతో ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతలో ఉత్సాహం నెలకొంది.

### వరుస సెలవులు.. తిరుమలలో
## భారీ రద్దీ.. దర్శనానికి సుదీర్ఘ నిరీక్షణ

తిరుపతి: వరుస సెలవుల నేపథ్యంలో తిరుమలలో భక్తుల రద్దీ భారీగా పెరిగింది. శ్రీ వేంకటేశ్వర స్వామివారి దర్శనం కోసం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో తిరుమల గిరులు భక్తజనసందోహంతో కిటకిటలాడుతున్నాయి. ప్రస్తుతం శ్రీవారి సర్వదర్శనం కోసం భక్తులు దాదాపు 22 గంటల పాటు వేచి ఉండాల్సి వస్తోంది. తిరుమలలోని వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని కంపార్ట్‌మెంట్లన్నీ భక్తులతో పూర్తిగా నిండిపోయాయి. దీంతో క్యూ లైన్లు వెలుపలికి కిలోమీటర్ల మేర విస్తరించాయి. రద్దీ పరిస్థితులను టీటీడీ ఉన్నతాధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. క్యూ లైన్లలో గంటల తరబడి వేచి ఉంటున్న భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, పాలు, అన్నప్రసాదాలను నిరంతరాయంగా అందజేస్తున్నారు. శనివారం (ఆగస్టు 15న) ఒక్కరోజే స్వామివారిని 90,293 మంది భక్తులు దర్శించుకున్నారు. వీరిలో 53,090 మంది భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ. 3.81 కోట్లు వచ్చినట్లు టీటీడీ అధికారులు వెల్లడించారు. రానున్న రోజుల్లో రద్దీ మరింత పెరిగే అవకాశం ఉన్నందున, వృద్ధులు, చిన్నపిల్లలతో వచ్చే భక్తులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది.

### ట్రంప్‌ను 'ఫుడ్ ట్రక్'తో పోల్చిన ఇరాన్..
## హార్మూజ్ జలసంధిపై మాటల యుద్ధం

ఢిల్లీ: ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హార్మూజ్ జలసంధిని మూసివేస్తామన్న తమ హెచ్చరికలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలకు ఇరాన్ తీవ్రస్థాయిలో బదులిచ్చింది. ట్రంప్‌ను ఒక 'ఫుడ్ ట్రక్'తో పోలుస్తూ ఎద్దేవా చేయడమే కాకుండా, ముందు ఆయన తన సొంత భద్రత గురించి ఆలోచించుకోవాలని ఘాటుగా వ్యాఖ్యానించింది. ఈ పరిణామం ఇరు దేశాల మధ్య ఇప్పటికే ఉన్న ఉద్రిక్తతలను మరింత పెంచింది. ట్రంప్ విదేశాంగ విధానాలు, హెచ్చరికలు స్థిరంగా ఉండవని, రోడ్డు పక్కన ఉండే ఫుడ్ ట్రక్కులు తమ మెనూను, ప్రదేశాన్ని మార్చినట్లుగానే ఆయన తీరు కూడా ఉంటుందని ఇరాన్ దౌత్య వర్గాలు విమర్శించాయి. స్థిరమైన దౌత్యనీతి లేని నాయకుడిగా అభివర్ణించేందుకే ఈ 'ఫుడ్ ట్రక్' పదాన్ని ప్రయోగించినట్లు అంతర్జాతీయ మీడియా విశ్లేషిస్తోంది. అంతేకాకుండా, అమెరికాలో ట్రంప్ ఎదుర్కొంటున్న రాజకీయ, న్యాయపరమైన సవాళ్లను ప్రస్తావిస్తూ, ఇరాన్‌కు సలహాలిచ్చే ముందు తన భద్రత గురించి చూసుకోవాలని బ్రిటన్ హితవు పలికింది. పర్షియన్ గల్ఫ్, ఒమన్ గల్ఫ్‌ను కలిపే హార్మూజ్ జలసంధి ప్రపంచ వాణిజ్యానికి అత్యంత ముఖ్యమైనది. ప్రపంచ సముద్ర చమురు రవాణాలో 20 శాతానికి పైగా, అంటే రోజుకు సుమారు 21 మిలియన్ బ్యారెళ్ల చమురు ఈ మార్గం గుండానే రవాణా అవుతుంది. తమపై పాశ్చాత్య దేశాలు విధించే ఆంక్షలకు ప్రతిగా ఈ జలసంధిని మూసివేస్తామని ఇరాన్ తరచూ హెచ్చరిస్తుంటుంది. అక్కడ నౌకల స్వేచ్ఛా రవాణాకు ఆటంకం కలిగిస్తే తీవ్ర పరిణామాలు తప్పవని అమెరికా స్పష్టం చేస్తూ వస్తోంది.

## సన్న బియ్యానికి కేంద్రం పూర్తి నిధులిస్తేనే ఫొటో ముద్రిస్తాం

హైదరాబాద్: స్మార్ట్ రేషన్ కార్డులపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చిత్రాన్ని ముద్రించాలన్న డిమాండ్‌పై తెలంగాణ పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందించారు. సన్న బియ్యం పథకానికి కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో నిధులు సమకూరిస్తేనే, కార్డులపై ప్రధాని ఫొటోను ముద్రించే అంశాన్ని పరిశీలిస్తామని ఆయన స్పష్టం చేశారు. పేదల ఆకలి తీర్చే ఈ పథకం విషయంలో అనవసర వివాదాలు సృష్టించవద్దని ఆయన హితవు పలికారు. సూర్యాపేటలో నిన్న మీడియా ప్రతినిధులతో మాట్లాడిన ఉత్తమ్ కుమార్ రెడ్డి.. రేషన్ బియ్యం పంపిణీపై కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులకు సన్న బియ్యం సరఫరా చేసేందుకు రూ. 14.9 కోట్లు ఖర్చు చేస్తోందని, అయితే కేంద్రం నుంచి కేవలం దొడ్డు బియ్యం మాత్రమే సరఫరా అవుతున్నాయని ఆయన తెలిపారు. కొందరు తగినంత ఆర్థిక సహకారం అందించకుండానే రేషన్ బియ్యం పంపిణీపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం పట్ల ఉన్న గౌరవంతో, ప్రోటోకాల్‌కు అనుగుణంగా ఇప్పటికే రేషన్ దుకాణాల్లో ప్రధాని ఫొటోను ప్రదర్శిస్తున్నామని ఉత్తమ్ కుమార్ రెడ్డి గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించిన చిత్రాలను కార్డులపై ముద్రించడానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

### జాతిపితకు ఐసీసీ నివాళి
## గాంధీ జయంతినే 2027 వరల్డ్ కప్ ఆరంభం!

ఢిల్లీ: అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) నిర్వహించనున్న 2027 పురుషుల వన్డే ప్రపంచకప్‌కు సంబంధించి ఒక ఆసక్తికరమైన వార్త వెలుగులోకి వచ్చింది. జాతిపిత మహాత్మా గాంధీకి నివాళిగా, ఈ మెగా టోర్నీని ఆయన జయంతి రోజైన అక్టోబర్ 2న ప్రారంభించాలని ఐసీసీ ప్రాథమికంగా నిర్ణయించింది. దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా సంయుక్తంగా ఆతిథ్యం ఇస్తున్న ఈ టోర్నీని గాంధీ జయంతి రోజున ప్రారంభించడం ద్వారా ఆయనకు ప్రత్యేక గౌరవం ఇవ్వాలని భావిస్తున్నారు. దక్షిణాఫ్రికాలో వర్ణవివక్షకు వ్యతిరేకంగా మహాత్మా గాంధీ చేసిన పోరాటం చారిత్రాత్మకం. ఆ దేశంలో ఆయన 21 సంవత్సరాలు (1893–1914) అక్కడే గడిపిన గాంధీజీ, సత్యాగ్రహ ఉద్యమానికి బీజం వేసింది కూడా అక్కడే. ఈ నేపథ్యంలో, దక్షిణాఫ్రికాలో గాంధీజీ సాగించిన వర్ణవివక్ష వ్యతిరేక పోరాటాన్ని, ఆయన అహింసా సిద్ధాంతాలను ప్రేరణగా తీసుకుని ఆ దేశ జాతిపిత నెల్సన్ మండేలా తదనంతర కాలంలో పోరాటం సాగించిన చారిత్రాత్మక బంధాన్ని స్మరించుకుంటూ.. ప్రపంచకప్‌ను ఆయన జయంతి రోజున ప్రారంభించడం సముచితంగా ఉంటుందని ఆతిథ్య దేశాల క్రికెట్ బోర్డులు భావిస్తున్నాయి. 2027 ప్రపంచకప్ ఫార్మాట్‌లో కీలక మార్పులు చేశారు. గత టోర్నీలో 10 జట్లు పాల్గొనగా, ఈసారి 14 జట్లతో నిర్వహించనున్నారు. ఈ జట్లను ఏడు చొప్పున రెండు గ్రూపులుగా విభజిస్తారు. ప్రతి గ్రూప్ నుంచి టాప్-3లో నిలిచిన జట్లు 'సూపర్ సిక్స్' దశకు అర్హత సాధిస్తాయి. 2003 ప్రపంచకప్ తరహాలో ఈ ఫార్మాట్‌ను మళ్లీ ప్రవేశపెడుతున్నారు. ఈ మెగా టోర్నీకి దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా దేశాలు సంయుక్తంగా ఆతిథ్యం ఇస్తున్నాయి. ఆతిథ్య దేశాలుగా దక్షిణాఫ్రికా, జింబాబ్వేలకు టోర్నీలో నేరుగా ప్రవేశం లభించింది. అయితే, నమీబియా మాత్రం క్వాలిఫయర్స్ ద్వారా అర్హత సాధించాల్సి ఉంటుంది. మొత్తం 54 మ్యాచ్‌లను జోహన్నెస్‌బర్గ్, కేప్‌టౌన్, దర్బన్‌తో పాటు హరారే, విండ్‌హోక్ వంటి ప్రముఖ వేదికల్లో నిర్వహించనున్నారు. ప్రస్తుతం ఈ ప్రతిపాదన చర్చల దశలోనే ఉంది. ప్రసార హక్కులు, మ్యాచ్‌ల షెడ్యూలింగ్ ఖరారైన తర్వాత ఐసీసీ ఎగ్జిక్యూటివ్ బోర్డు సమావేశంలో తుది నిర్ణయం తీసుకోనున్నారు. అక్టోబర్ 2న ప్రారంభమై సుమారు ఏడు వారాల పాటు ఈ టోర్నీ కొనసాగనుంది. ఈ ప్రతిపాదన కార్యరూపం దాల్చితే, క్రికెట్ వేదికగా మహాత్ముడికి ప్రపంచం అందించే గొప్ప గౌరవంగా ఇది నిలిచిపోతుంది.

## ప్రాణం ఉన్నంతవరకు బీఆర్ఎస్‌తో కలవను

### కల్వకుంట్ల కవిత

హైదరాబాద్: తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కల్వకుంట్ల కవిత, బీఆర్ఎస్ పార్టీతో భవిష్యత్తులో కలిసి పనిచేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఒక మీడియా ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆమె, "ప్రాణం ఉన్నంత వరకు బీఆర్ఎస్‌తో కలిసి పనిచేయను" అని సంచలన వ్యాఖ్యలు చేశారు. కుటుంబ సభ్యులతో వ్యక్తిగత సంబంధాలు వేరని, రాజకీయాలు వేరని ఆమె తేల్చి చెప్పారు. అయితే, బీఆర్ఎస్ ను అధికారంలోకి రాకుండా చేయడం తమ సిద్ధాంతం కాదని కూడా అన్నారు. పార్టీ నుంచి తనను బహిష్కరించిన తీరుపై ఆమె తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఎటువంటి షోకాజు నోటీసు ఇవ్వకుండానే తనను పార్టీ నుంచి పంపించేశారని, సస్పెన్షన్‌కు ఏడాది ముందు నుంచే తనను పక్కన పెట్టారని ఆరోపించారు. అయినప్పటికీ, నైతిక విలువలకు కట్టుబడి తానే ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశానని గుర్తుచేశారు. తన తండ్రి కేసీఆర్‌ను తాను ఎన్నడూ ఎదిరించలేదని ఆమె పేర్కొన్నారు. తన నూతన పార్టీకి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని, రాబోయే ఎన్నికల్లో విజయం సాధించి అధికారంలోకి వస్తామని కవిత ధీమా వ్యక్తం చేశారు. "మాది ఆర్ట్ మూవీ కాదు, కమర్షియల్ మూవీ. నేను గెలవకపోతే ఇంకెవరు గెలుస్తారో తెలియదు" అని వ్యాఖ్యానించారు. తన తండ్రి కేసీఆర్ తరహాలోనే తాను కూడా సరికొత్త చరిత్ర సృష్టిస్తానని ధీమాగా చెప్పారు. సామాజిక న్యాయం, లౌకికవాదమే తమ పార్టీ ప్రధాన ఎజెండా అని ఆమె వెల్లడించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలను కేవలం ఓటు బ్యాంకుగానే వాడుకుంటున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీల సంక్షేమాన్ని విస్మరిస్తున్నారని విమర్శించారు. బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు సాధించేందుకు ఢిల్లీ వేదికగా పోరాటం చేస్తామని పిలుపునిచ్చారు. ఇప్పటికే 100 రోజుల్లోనే 42 నియోజకవర్గాల్లో పార్టీ కమిటీల నిర్మాణాన్ని పూర్తి చేశామని ఆమె వివరించారు.

### నెహ్రూ, ఇందిరలను దాటేసిన మోదీ...
## ఎర్రకోట ప్రసంగాల్లో రికార్డ్

ఢిల్లీ: భారత స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగాల విషయంలో ప్రధాని నరేంద్ర మోదీ సరికొత్త రికార్డు సృష్టించారు. దేశానికి సుదీర్ఘకాలం సేవలందించిన నలుగురు ప్రధానమంత్రుల్లో, ఎర్రకోట నుంచి అత్యధిక సమయం ప్రసంగించిన నేతగా ఆయన నిలిచారు. ప్రసంగాల సంఖ్య తక్కువగా ఉన్నప్పటికీ, మొత్తం ప్రసంగ సమయం పరంగా మాజీ ప్రధానులందరి కంటే ఆయన ముందంజలో ఉండటం విశేషం. ప్రధాని మోదీ ఇప్పటివరకు 13 స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగాల్లో ద్వారా మొత్తం 1,177 నిమిషాలు పాటు ప్రసంగించారు. ఇదే క్రమంలో, 16 ప్రసంగాల్లో ఇందిరా గాంధీ 504 నిమిషాలు, 10 ప్రసంగాల్లో మన్మోహన్ సింగ్ 417 నిమిషాలు, 17 ప్రసంగాల్లో జవహర్‌లాల్ నెహ్రూ 400 నిమిషాలు మాత్రమే ప్రసంగించారు. దేశ తొలి ప్రధాని నెహ్రూ, ఇందిరా గాంధీల కంటే మోదీ తక్కువ సార్లు ప్రసంగించినప్పటికీ, వారిద్దరి మొత్తం ప్రసంగ సమయం కంటే రెట్టింపునకు పైగా మాట్లాడారు. మౌలిక సదుపాయాలు, డిజిటల్ కార్యక్రమాలు, మహిళా సాధికారత, యువతకు అవకాశాలు, 2047 నాటికి 'వికసిత భారత్' లక్ష్యం సాధన వంటి అంశాలపై ప్రభుత్వ విజయాలను, భవిష్యత్ ప్రణాళికలను ప్రజలకు వివరంగా తెలియజేయడానికే ప్రధాని నరేంద్ర మోదీ సుదీర్ఘ ప్రసంగాలకు ప్రాధాన్యతనిచ్చారు.

### ఫామ్‌హౌస్‌లో కాదు.. అసెంబ్లీలోకి రా..
## కేసీఆర్‌కు రేవంత్ రెడ్డి సవాల్

హైదరాబాద్: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సవాల్ విసిరారు. రైతుల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన మేలు, బీఆర్ఎస్ హయాంలో జరిగిన అన్యాయాలపై చర్చించేందుకు అసెంబ్లీకి రావాలని అన్నారు. ఫామ్‌హౌస్‌లో ఉండి విమర్శలు చేయడం కాదని, ప్రజల ముందుకు వచ్చి మాట్లాడాలని అన్నారు. సంగారెడ్డిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న రేవంత్ ఈ వ్యాఖ్యలు చేశారు. గతంలో వరి వేస్తే ఉరి అన్న కేసీఆర్ తన ఫామ్‌హౌస్‌లో మాత్రం వరి పండించారని రేవంత్ విమర్శించారు. ఇప్పుడు రైతులకు మేలు చేసే కార్యక్రమాలు చేపడుతుంటే బీఆర్ఎస్ విమర్శలు చేస్తోందన్నారు. రైతుల సంక్షేమంపై నిజమైన చర్చకు సిద్ధమైతే అసెంబ్లీ వేదికగా మాట్లాడుకుందామని సవాల్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై బీఆర్ఎస్, బీజేపీ ప్రశ్నలు లేవనెత్తుతున్నాయని రేవంత్ అన్నారు. ఈ రెండు పార్టీలు ఒకే నాణేనికి బొమ్మా బొరుసులాంటివని వ్యాఖ్యానించారు. పదేళ్లు అధికారంలో ఉన్నా పేదలకు సన్నబియ్యం ఇవ్వాలనే ఆలోచన ఎందుకు చేయలేకపోయారని ప్రశ్నించారు. కాంగ్రెస్ వస్తే కరెంట్ కోతలు వస్తాయని గతంలో బీఆర్ఎస్ ప్రచారం చేసిందని, కానీ ఇప్పుడు రాష్ట్రంలో విద్యుత్ కోతలు లేవని రేవంత్ చెప్పారు. రైతు భరోసా పథకం కింద 32 నెలల్లో రూ.36 వేల కోట్లు 70 లక్షల మంది రైతుల ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ నివేదికల ప్రకారం దేశంలో తక్కువ అప్పులు ఉన్న రైతులు తెలంగాణలోనే ఉన్నారని అన్నారు. బీజేపీ నేతలు ఆ నివేదికలు చదివితే నిజాలు తెలుస్తాయని వ్యాఖ్యానించారు. స్మార్ట్ రేషన్ కార్డులు కేవలం ప్లాస్టిక్ కార్డులు కావని, పేదల ఆత్మగౌరవానికి గుర్తని రేవంత్ చెప్పారు. ఆకలి తీర్చే భరోసానే ఈ కార్డుల ఉద్దేశమని అన్నారు. పేదలకు ఆహార భద్రత కల్పించేందుకు రేషన్ వ్యవస్థను తీసుకొచ్చింది కాంగ్రెస్ పార్టీయేనని పేర్కొన్నారు.

### నాయకులు రూ.2 వేలు ఇస్తే..
## రూ.2 లక్షలు సంపాదించుకుంటారు

అమరావతి: 'ఎన్నికల్లో డబ్బులు తీసుకోవడం మనం ఎందుకు మానేయలేం? ఏ రాజకీయ నాయకుడూ ఇంటిలో నుంచి డబ్బులు తీసుకురారు. వాళ్లు ఇచ్చేదంతా లంచాల సొమ్మే. ఎన్నికల్లో రూ.2 వేలు ఇస్తే, దానికి రూ.2 లక్షలు సంపాదించుకుంటారు. అంటే వాళ్లు సంపాదించుకునే దానిలో మీకు చిల్లర విదిలిస్తారు. ఓటు కోసం మీకు రూ.2 వేలు ఇచ్చాక, వీళ్లకోసం ఎందుకు పనిచేయాలి, అసలు వీళ్ల దగ్గరకు ఎందుకెళ్లాలనే చులకనభావం నేతల్లో వస్తుంది' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. 'ఎన్ని పనులు చేసినా, పథకాలు అమలు చేసినా.. తాత్కాలిక ప్రయోజనం వస్తే అటు వెళ్లిపోతుంటారు. ఎన్నికల్లో పది రూపాయలు ఎక్కువ ఇస్తామంటే వాళ్లకు ఓటేస్తున్నారు. దీనిపై ఆత్మవిమర్శ చేసుకోవాలి. నేతలు డబ్బులు ఇస్తుంటే.. మాకు నీతి ఉందని చెప్పండి. డబ్బులు తీసుకోకుండా ఓటేయండి. మిగిలిన వారిలోనూ దీనిపై అవగాహన కల్పించండి. దీనివల్ల మీకు నాలుగు రెట్లు ఫలితం వస్తుంది' అని తెలిపారు.

'ప్రతిపక్ష పార్టీ వాళ్లు రోడ్డుమీదకు వచ్చారంటే.. గొడవలు చేసి, రెచ్చగొడతారు. రప్పా రప్పా అని, మాకు అధికారం వస్తే నరికేస్తామని పోస్టర్లు ప్రదర్శిస్తారు. ఆడవారిపై సామాజిక మాధ్యమాల్లో అసభ్యంగా పోస్టులు పెడతారు. ఇలాంటి వాళ్లెవరినీ వదిలిపెట్టం. శాంతిభద్రతలు నియంత్రణలో ఉంటేనే పెట్టుబడులు వస్తాయి. అందుకే శాంతిభద్రతలపై మహిళల్లో చైతన్యం రావాలి. ప్రజల్లో అవగాహన కల్పించాలి. కుటుంబసభ్యులు వ్యసనాల బారినపడకుండా చూసుకోవాలి' అని చంద్రబాబు సూచించారు. 'అంబేద్కర్, అబ్దుల్ కలాం, ఎన్టీఆర్.. పేద కుటుంబాల నుంచి వచ్చి ఉన్నతస్థాయికి ఎదిగారు. మారుమూల ప్రాంతం నుంచి వచ్చిన గిరిజన మహిళ ద్రౌపదీ ముర్ము దేశ అధ్యక్షురాలు అయ్యారు. టీ విక్రయించే వాడినని చెప్పే నరేంద్ర మోదీ.. శక్తిమంతుడైన ప్రధాని అయ్యారు. సంకల్పం బలంగా ఉంటే తప్పకుండా ఏదైనా సాధించవచ్చనడానికి వీరే నిదర్శనాలు. మహిళలు వంటింటికే పరిమితం కాకుండా, స్త్రీశక్తి పథకంతో బయటి ప్రపంచాన్ని చూసేందుకు అవకాశం ఏర్పడింది. పదిమందినీ చూశాక మనం అలా ఎందుకు ఎదగలేం అనే ప్రశ్న ఉదయిస్తుంది. అది అభివృద్ధికి దారి తీస్తుంది. కొందరు రోజుకు మూణ్నాలుగు గంటలు రీల్స్ చూసుకుంటూ కూర్చుంటారు. అందులో 2 గంటలు అదే సెల్‌ఫోన్‌లో ఏదైనా విజ్ఞానం పెంచుకుంటే మరింత అభివృద్ధి చెందవచ్చు. ప్రతి ఒక్కరూ 'అను నేను' సంకల్పంతో తమ కుటుంబం, గ్రామం, రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తాననే బాధ్యత తీసుకోవాలి' అని సీఎం దిశానిర్దేశం చేశారు.

### ప్రతి కుటుంబానికి మూణ్నాలుగు పథకాలు

'రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి కనీసం మూణ్నాలుగు పథకాలు అందిస్తున్నాం. 2047 నాటికి ఆర్థిక అసమానతలు తొలగించి, అందరికీ మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించడం లక్ష్యంగా పెట్టుకున్నాం. చేపలుపట్టి ఇస్తుంటే.. వాటిని ఇవ్వని రోజు పస్తు ఉండాలి. దానికి బదులు చేపలు పట్టడం నేర్పిస్తే, వారికి మరింత ఆదాయం వస్తుంది. నేను అదే చేస్తున్నా. ప్రభుత్వ బడుల్లో విద్య మెరుగవుతోంది' అని తెలిపారు.

### 99.5% రుణం చెల్లించేది మీరే

'డ్వాక్రా సంఘాలు పెట్టినప్పుడు ఎక్కువ మంది ఎగతాళి చేశారు. కానీ ఆ ఉద్యమంతో లక్షల కుటుంబాలు బాగుపడ్డాయి. మహిళలకు గుర్తింపు వచ్చింది. కొందరైతే భర్త కంటే ఎక్కువ సంపాదించి, కుటుంబాన్ని పోషిస్తున్నారు. రూ.25 వేల కోట్ల పొదుపు సొమ్ము బ్యాంకుల్లో ఉంది. కొన్ని పెద్ద పరిశ్రమలు కూడా రుణాలు కట్టకుండా ఎగ్గొడతాయి. కానీ 99.5 శాతం రుణాలను చెల్లించే ఏకైక వ్యవస్థ డ్వాక్రా సంఘాలు. ప్రతి కుటుంబానికి ఓ పారిశ్రామికవేత్త, ఒక జిల్లా- ఒక ఉత్పత్తిపై ప్రత్యేక దృష్టి సారించాం. మీ ఉత్పత్తులను దేశ, విదేశాలకు విక్రయించే స్థాయికి ఎదగాలి' అని చంద్రబాబు ఆకాంక్షించారు.

## 2025 నాటి ఓటర్ల జాబితాతోనే స్థానిక ఎన్నికలు

అమరావతి: స్థానిక సంస్థల ఎన్నికలు ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) తుది ఓటర్ల జాబితాలతో కాకుండా, 2025 నాటి ప్రత్యేక సంక్షిప్త సవరణ (ఎస్ఎస్ఆర్) ఓటర్ల జాబితాల ఆధారంగా నిర్వహించనున్నారు. అక్టోబరు 3న 'సర్' తుది ఓటర్ల జాబితాలు ప్రచురించనున్నారు. వాటిని ప్రామాణికంగా తీసుకుని స్థానిక సంస్థల్లో ఓటర్ల జాబితాలు ప్రచురిస్తే ఎన్నికల నిర్వహణలో జాప్యమవుతుందని భావిస్తున్నారు. ఈ కారణంతో 2025 నాటి జాబితాలకే రాష్ట్ర ఎన్నికల సంఘం అనుమతించింది. ఈ మేరకు పుర, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీల్లో ఫొటో గుర్తింపు ఓటర్ల జాబితాల ప్రచురణకు ఏర్పాట్లు చేస్తున్నారు. స్థానిక సంస్థలకు అక్టోబరులో ఎన్నికలు నిర్వహించాలన్న యోచనతో ప్రభుత్వం ఉందన్న సమాచారంతో రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేస్తోంది. బీసీ రిజర్వేషన్లకు సంబంధించి డెడికేటెడ్ కమిషన్ శుక్రవారమే నివేదిక ఇచ్చింది. రిజర్వేషన్లపై ప్రభుత్వం త్వరలో నిర్ణయం తీసుకునే అవకాశాలున్నాయి. కీలకమైన రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తయిందంటే ఎన్నికలు సమీపించినట్లుగానే భావించాలని అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఓటర్ల జాబితాల ప్రచురణ.. మున్సిపాల్టీల్లో వచ్చే నెల 3లోగా, ఇప్పటివరకు జాబితా సిద్ధంచేయని సుమారు యాభై పంచాయతీల్లో ఈ నెల 17లోగా పూర్తి చేయాలని పురపాలక, పట్టణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖలను ఎన్నికల సంఘం ఆదేశించింది. పంచాయతీల్లో పోలింగ్ కేంద్రాల ఎంపిక, వాటికి సంబంధించిన పబ్లికేషన్ ప్రక్రియ కూడా ఈ నెల 21 నుంచి 31లోగా పూర్తి చేయాలని సూచించింది. అదనపు బ్యాలెట్ బాక్సుల కోసం ఇతర రాష్ట్రాలకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఇప్పటికే లేఖలు రాశారు. ఎన్నికల సిబ్బందికి శిక్షణ, ఇతరత్రా ఏర్పాట్లు 30-45 రోజుల్లో పూర్తి చేయాలన్న యోచనతో ఎన్నికల సంఘం ఉంది.

## హస్త కళాకారులకు అందుబాటులో వుడ్ బ్యాంకులు

రాజమహేంద్రవరం: హస్తకళల పరిరక్షణ, ఆయా రంగాలపై ఆధారపడ్డ కళాకారులకు ముడి సరకు కొరత లేకుండా చేయడమే లక్ష్యంగా.. రాజమహేంద్రవరంలోని ధవళేశ్వరం వద్ద అటవీశాఖ ఏర్పాటుచేసిన సెంట్రల్ క్రాఫ్ట్ వుడ్ బ్యాంకును ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రారంభించారు. సతీమణి అన్నా కొణిదెలతో కలిసి ఆయన ఇక్కడకు వచ్చారు. ఏటికొప్పాక, కొండపల్లి బొమ్మలు, మాధవమాల, శెట్టిగుంట కళాకృతులు, బొబ్బిలి వీణల కళాకారులకు కలప అందుబాటులో ఉంచేలా రాష్ట్రంలోని మరో ఆరు క్లస్టర్ల పరిధిలో ఏర్పాటు చేసిన వుడ్ బ్యాంకులను సైతం వర్చువల్‌గా ప్రారంభించారు. వీటి ద్వారా సుమారు 5వేల మంది హస్త కళాకారుల కుటుంబాలకు ముడిసరకు సమస్య తీరనుంది. సెంట్రల్ వుడ్ బ్యాంకులో ప్రస్తుతం 30 క్యూబిక్ మీటర్ల కలప ఉందని, వచ్చే ఐదేళ్ల అవసరాలకు సరిపడా నిల్వలు అందుబాటులో ఉంచుతామని అటవీశాఖ అధికారులు తెలిపారు. అంతకుముందు వుడ్ బ్యాంక్ ప్రాంగణంలో రెండు రుద్రాక్ష మొక్కలను పవన్ కల్యాణ్ నాటారు. కలప దుంగలపై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి ఎక్కడినుంచి సేకరించారు? ఆ వృక్షం వయసు, శాస్త్రీయ నామం తదితర వివరాలు తెలుసుకున్నారు. సెంట్రల్ క్రాఫ్ట్ వుడ్ బ్యాంకు ప్రాంగణంలో వివిధ ప్రాంతాల కళాకారులు ఏర్పాటుచేసిన హస్త కళాకృతులను పవన్ కల్యాణ్ దంపతులు ఆసక్తిగా తిలకించారు. కళాకారులతో మాట్లాడి వాటి ప్రత్యేకతలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పెళ్లి జంట బొమ్మ, వారాహి మాత బొమ్మలను కావాలని అన్నా కొణిదెల అడగడంతో.. పవన్‌కల్యాణ్ వాటిని కొనుగోలు చేసి ఆమెకు ఇచ్చారు. కొండపల్లి కళాకారుడు అగ్గిపెట్టెలో తయారుచేసిన ఆకృతిని చూసి పవన్ దంపతులు ముచ్చటపడ్డారు.

### హైదరాబాద్-అమరావతి: పక్కపక్కనే హైస్పీడ్ రైల్..
## 12 వరుసల ఎక్స్‌ప్రెస్ వే!

హైదరాబాద్-అమరావతి: హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని అమరావతి, బందరు పోర్టులను అనుసంధానించేలా రెండు భారీ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు సమాంతరంగా పరుగులు పెట్టనున్నాయి. హైదరాబాద్-చెన్నై హైస్పీడ్ రైల్వే లైన్, ఫ్యూచర్ సిటీ-బందరు పోర్టు 12 వరుసల గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వేలను పక్కపక్కనే నిర్మించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాథమికంగా అంగీకరించాయి. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, హైదరాబాద్-విజయవాడ ప్రస్తుత జాతీయ రహదారికి ఎడమవైపు ఎక్స్‌ప్రెస్‌వే, కుడివైపు హైస్పీడ్ రైలు మార్గం ఉండేలా అలైన్‌మెంట్ ఖరారు చేశారు.

760 కిలోమీటర్ల హైస్పీడ్ రైలు మార్గం

హైదరాబాద్-అమరావతి-చెన్నై మధ్య ప్రతిపాదించిన ఈ హైస్పీడ్ రైల్వే కారిడార్ మొత్తం పొడవు 760 కిలోమీటర్లు. ఇందులో తెలంగాణ పరిధిలో 180 కిలోమీటర్ల మేర నిర్మాణం జరగనుంది. ఈ మార్గంలో శంషాబాద్, భారత్ ఫ్యూచర్ సిటీ, డ్రై పోర్టు, నాగార్జునసాగర్ (హాలియా), వాడపల్లి వద్ద స్టేషన్లు ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ. 2.24 లక్షల కోట్లు కాగా, దాదాపు 790 హెక్టార్ల భూమి అవసరమని ప్రాథమికంగా నిర్ధారించారు. ఇప్పటికే ఈ మార్గంలో మార్కింగ్ పనులు పూర్తయ్యాయి.

298 కిలోమీటర్ల గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే

హైదరాబాద్ ఔటర్ రింగు రోడ్డు (ఓఆర్ఆర్), రీజినల్ రింగు రోడ్డు (ట్రిపుల్ ఆర్) మధ్యలో ఉన్న ముచ్చర్ల ఫ్యూచర్ సిటీ సమీపంలోని తిప్పారెడ్డిపల్లి వద్ద ఈ 12 వరుసల గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే ప్రారంభం కానుంది. ఇది అమరావతి మీదుగా మచిలీపట్నం-బందరు పోర్టుకు అనుసంధానమవుతుంది. మొత్తం 297.82 కిలోమీటర్ల పొడవున్న ఈ మార్గంలో తెలంగాణ పరిధిలో 118 కిలోమీటర్లు (40 గ్రామాల మీదుగా), ఏపీలో మిగిలిన భాగం (60 గ్రామాల మీదుగా) విస్తరించి ఉంది. ప్రస్తుతం ఈ ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ఈ రెండు భారీ ప్రాజెక్టులకు వేర్వేరుగా కాకుండా ఒకేసారి భూసేకరణ చేపట్టాలని అధికారులు యోచిస్తున్నారు. ఒకే కారిడార్‌లో రోడ్డు, రైలు మార్గాల నిర్మాణం వల్ల భూసేకరణ భారం తగ్గడమే కాకుండా, హైదరాబాద్ ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి, బందరు పోర్టుకు ప్రయాణ, సరుకు రవాణా సమయం గణనీయంగా ఆదా కానుంది.

## మాజీ ప్రధాని వాజ్‌పేయికి మంత్రి నారా లోకేశ్ ఘన నివాళి

అమరావతి: భారత మాజీ ప్రధాని, భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆయనకు ఘన నివాళులు అర్పించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా ఒక ప్రత్యేక పోస్ట్ చేశారు. వాజ్‌పేయి దేశానికి అందించిన సేవలను స్మరించుకుంటూ ఆ మహనీయుని స్మృతికి నివాళులు అర్పిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా లోకేశ్ తన పోస్టులో వాజ్‌పేయి సేవలను కొనియాడారు. "భారత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్ పేయి వర్ధంతి సందర్భంగా ఆ మహనీయుని స్మృతికి ఘననివాళులు అర్పిస్తున్నాను. దేశం ఆర్థికంగా, సాంకేతికంగా, రక్షణపరంగా అభివృద్ధి చెందడంలో వాజ్ పేయి కీలకపాత్ర పోషించారు. దేశ రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేకస్థానం సంపాదించుకున్నారు. భారతరత్న వాజ్ పేయి వర్ధంతి సందర్భంగా దేశానికి వారు అందించిన సేవలను స్మరించుకుందాం" అని లోకేశ్ పేర్కొన్నారు. భారత రాజకీయాల్లో సౌమ్యుడిగా, గొప్ప వక్తగా పేరుగాంచిన వాజ్‌పేయి, దేశ ప్రగతికి వేసిన బాటలను ఈ తరం గుర్తుంచుకోవాలని ఆయన తన సందేశం ద్వారా పిలుపునిచ్చారు.


### ఒకవైపు సైనిక విన్యాసాలు.. మరోవైపు కిమ్‌తో
### స్నేహమంటున్న ట్రంప్.. కొరియా ద్వీపకల్పంలో అసలేం జరుగుతోంది!

అమెరికా: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఉత్తర కొరియా అధినేత కిమ్ జాంగ్ ఉన్ మధ్య సంబంధాలు ఎప్పుడూ ఆసక్తికరంగానే ఉంటాయి. తాజాగా ట్రంప్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్'లో కిమ్‌తో ఉన్న ఒక పాత ఫొటోను పంచుకుని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "ఈ ఫొటోలో మేమిద్దరం సీరియస్‌గా కనబడుతున్నప్పటికీ, మేం నవ్వుతూ దిగిన ఫొటోలు చాలా ఉన్నాయి. కిమ్ జాంగ్ ఉన్, నేను చాలా గొప్పగా కలిసిపోతాం!" అని ట్రంప్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. అయితే, ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేసిన సమయం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఒకవైపు ఆయన కిమ్‌తో స్నేహాన్ని గుర్తుచేసుకుంటుండగా, మరోవైపు కొరియా ద్వీపకల్పంలో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. అమెరికా, దక్షిణ కొరియాలు కలిసి నిర్వహించనున్న సైనిక విన్యాసాలపై ఉత్తర కొరియా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. 'ఉల్చీ ఫ్రీడమ్ షీల్డ్' పేరుతో ఆగస్టు 17 నుంచి 27 వరకు ఈ సైనిక విన్యాసాలు జరగనున్నాయి. డ్రోన్లు, జీపీఎస్ జామింగ్, సైబర్‌టాక్స్‌ను ఎదుర్కోవడం వంటి ఆధునిక యుద్ధ తంత్రాలపై ఇందులో శిక్షణ ఇవ్వనున్నారు. ఈ విన్యాసాలపై ఉత్తర కొరియా విదేశాంగ మంత్రిత్వ శాఖ తీవ్రంగా స్పందించింది. అమెరికా-జపాన్-దక్షిణ కొరియా సైనిక సహకారం ఒక 'అణు కూటమి'గా మారుతోందని ఆరోపించింది. అల్ జజీరా కథనం ప్రకారం.. "కొత్త స్థాయి ముప్పును తాము కొత్త స్థాయి నిరోధక శక్తితో ఎదుర్కొంటామని" ఉత్తర కొరియా అధికారిక వార్తా సంస్థ కేసీఎన్ఏ ద్వారా హెచ్చరించింది. గత ఐదేళ్లలో జరిగిన విన్యాసాల కంటే ఇవి భిన్నమైనవని, ఆధునిక యుద్ధ నైపుణ్యాలను మెరుగుపరిచేందుకే వీటిని నిర్వహిస్తున్నారని ప్యాంగ్యాంగ్ ఆరోపించింది. తమ భద్రతకు ముప్పు వాటిల్లితే ప్రతిస్పందించడం తమ ప్రాథమిక సూత్రమని స్పష్టం చేసింది. ఈ హెచ్చరికల నేపథ్యంలోనే ఆగస్టు 12న ఉత్తర కొరియా ఒక బాలిస్టిక్ క్షిపణిని ప్రయోగించడం గమనార్హం. ఒకవైపు ట్రంప్ పాత స్నేహాన్ని గుర్తుచేసుకుంటుంటే, కొరియా ద్వీపకల్పంలో మాత్రం యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయని అంతర్జాతీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

### బెంగాల్ రాజకీయాల్లో కలకలం.. పార్టీ ఆఫీస్‌లో
### ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించిన మాజీ డిప్యూటీ స్పీకర్

పశ్చిమ బెంగాల్: పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో తీవ్ర విషాదం, కలకలం చోటుచేసుకుంది. తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) సీనియర్ నాయకుడు, రాష్ట్ర అసెంబ్లీ మాజీ డిప్యూటీ స్పీకర్ ఆశిష్ బెనర్జీ (80) అనుమానాస్పద స్థితిలో మరణించారు. బీర్భూమ్ జిల్లా రాంపూర్‌హాట్‌లోని తన నివాసానికి సమీపంలో ఉన్న పార్టీ కార్యాలయంలో ఆయన మృతదేహం ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. ఈ ఘటనతో అధికార టీఎంసీ వర్గాలు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని, పోస్ట్‌మార్టం నిమిత్తం రాంపూర్‌హాట్ మెడికల్ కాలేజీ ఆసుపత్రికి తరలించారు. ఇది ఆత్మహత్యా? లేక దీని వెనుక ఏదైనా కుట్ర ఉందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఆశిష్ బెనర్జీకి బెంగాల్ రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం ఉంది. రాంపూర్‌హాట్ నియోజకవర్గం నుంచి ఆయన ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. మమతా బెనర్జీ ప్రభుత్వంలో విద్య, వ్యవసాయ శాఖల మంత్రిగా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. అనంతరం అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్‌గా కూడా సేవలు అందించారు. అయితే, ఈ ఏడాది మొదట్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన బీజేపీ అభ్యర్థి ధృవ సాహా చేతిలో ఓటమి పాలయ్యారు. ఎన్నికల్లో ఓటమి తర్వాత, జూన్‌లో బీర్భూమ్ జిల్లా టీఎంసీ కోర్ కమిటీ ఛైర్మన్ పదవికి కూడా ఆశిష్ బెనర్జీ రాజీనామా చేశారు. అప్పటి నుంచి ఆయన రాజకీయంగా కొంత ఒత్తిడిలో ఉన్నట్లు తెలుస్తోంది. గతంలో టీఎంసీకి కంచుకోటగా ఉన్న బీర్భూమ్ జిల్లాలో ఇటీవలి ఎన్నికల్లో బీజేపీ అనూహ్యంగా 6 స్థానాలు గెలుచుకోవడం టీఎంసీకి పెద్ద ఎదురుదెబ్బగా మారింది. ఈ రాజకీయ పరిణామాలు కూడా జిల్లా నేతలపై తీవ్ర ఒత్తిడిని పెంచాయి. ఆశిష్ బెనర్జీ మరణవార్త తెలియగానే ఆయన నివాసం వద్దకు పార్టీ కార్యకర్తలు, అభిమానులు భారీగా చేరుకోవడంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోస్ట్‌మార్టం నివేదిక వచ్చిన తర్వాతే మృతికి గల కచ్చితమైన కారణాలు తెలుస్తాయని పోలీసులు వెల్లడించారు.

### క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల
## దరఖాస్తుల గడువు ముగింపు



హైదరాబాద్: హైదరాబాద్ క్యూర్ పరిధిలోని 16 నియోజకవర్గాల్లో ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల స్వీకరణ గడువు ముగిసింది. ఈ నియోజకవర్గాల నుంచి మొత్తం 60,014 దరఖాస్తులు అందినట్లు అధికారులు వెల్లడించారు. అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు ఈ నెల 20వ తేదీ తర్వాత లాటరీ పద్ధతిలో ఇళ్లను కేటాయించనున్నట్లు హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ పి.వి. గౌతం తెలిపారు. మరోవైపు, నగరంలోని మరో నాలుగు నియోజకవర్గాల్లో ఇందిరమ్మ ఇళ్ల కోసం రేపటి నుంచి కొత్తగా దరఖాస్తులను స్వీకరించనున్నారు. ఎల్బీనగర్, గోషామహల్, ముషీరాబాద్, చాంద్రాయణగుట్ట నియోజకవర్గాల ప్రజలు సెప్టెంబర్ 3వ తేదీ వరకు 'మీ సేవ' కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు సూచించారు. ఈ నియోజకవర్గాల లబ్ధిదారుల కోసం నిర్మించనున్న ఇళ్ల ప్రాంతాలను కూడా అధికారులు ఖరారు చేశారు. ఎల్బీనగర్ వాసులకు అమన్ గల్‌లో, గోషామహల్, ముషీరాబాద్ వాసులకు జమిస్తాన్‌పూర్‌లో, చాంద్రాయణగుట్ట నియోజకవర్గ పరిధిలోని వారికి బండ్లగూడలో ఇళ్లను కేటాయించనున్నారు.

అరుణ ప్రభ
ARUNAPRABHA TELUGU DAILY
సోమవారం - 17- ఆగష్టు - 2026

### చిత్తూరు జాతి ఆవులతో ప్రత్యేక అనుబంధం..

# వైరల్ అవుతున్న ప్రధాని మోదీ వీడియో!

తన ఉదయం దినచర్యకు సంబంధించిన వీడియోను పంచుకున్న ప్రధాని మోదీ

అధికారిక నివాసంలో నెమళ్లు, ఆవులకు ఆహారం తినిపిస్తున్న దృశ్యాలు

స్వాతంత్ర్య దినోత్సవం రోజు తాను త్వరగా వెళ్తున్నానని అవి గ్రహించాయన్న ప్రధాని

ప్రధాని వద్ద ఉన్న వాటిలో చిత్తూరు జిల్లాకు చెందిన సూక్ష్మ జాతి ఆవులు

సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ప్రధాని మోదీ వ్యక్తిగత వీడియో





ఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన ఉదయం దినచర్యకు సంబంధించిన కొన్ని ఆసక్తికరమైన దృశ్యాలను సోషల్ మీడియాలో పంచుకున్నారు. తన అధికారిక నివాసంలో నెమళ్లు, సూక్ష్మ జాతి ఆవులతో తాను గడిపిన మనోహరమైన క్షణాలను చూపిస్తూ ఒక వీడియోను పోస్ట్ చేశారు. ప్రస్తుతం ఈ వీడియో నెటిజన్లను ఎంతగానో ఆకట్టుకుంటోంది. స్వాతంత్ర్య దినోత్సవమైన ఆగస్టు 15న ఉదయం ఈ దృశ్యాలను చిత్రీకరించినట్లు తెలుస్తోంది. తాను ఎర్రకోటలో జరిగే వేడుకలకు త్వరగా బయలుదేరుతున్నానని ఆ పక్షులు, పశువులు గ్రహించినట్లున్నాయని, అందుకే తనను కలిసేందుకు అవి ముందుగానే వచ్చాయని ప్రధాని మోదీ తెలిపారు. ఈ వీడియోలో ప్రధాని తన ఉదయం నడక, వ్యాయామంలో భాగంగా నెమళ్లకు గింజలు తినిపించడం, తన నివాసంలోని సూక్ష్మ జాతి ఆవులను ప్రేమగా నిమరడం వంటివి చూడవచ్చు. ఈ వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేస్తూ ప్రధాని ఒక సందేశాన్ని జతచేశారు. "ప్రతిరోజూ ఉదయం నా స్నేహితులకు ఆహారం అందించడం నా దినచర్య. నిన్న ఉదయం నేను ఎర్రకోటకు త్వరగా బయలుదేరుతున్నానని అవి గ్రహించినట్లున్నాయి. అందుకే నేను వెళ్లేముందు నన్ను కలవడానికి వచ్చాయి. ఇది ఎప్పటిలాగే చాలా ప్రత్యేకం!" అని ఆయన పేర్కొన్నారు. లోక్ కల్యాణ్ మార్గ్‌లోని ప్రధాని నివాసంలో ఆయన ఉదయం వేళల్లో వ్యాయామం చేస్తున్నప్పుడు నెమళ్లు ఆయనతో పాటు ఉండటం సాధారణంగా కనిపిస్తుంది. ప్రధాని మోదీ వద్ద అరుదైన, దేశీయ సూక్ష్మ జాతి పశువులు ఉన్నాయి. ముఖ్యంగా వీటిలో ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లాకు చెందిన సూక్ష్మ జాతి ఆవులు కూడా ఉండటం విశేషం. ఈ జాతిని ప్రపంచంలోనే అత్యంత చిన్నవైన, మూపురం కలిగిన పశువుల జాతులలో ఒకటిగా గుర్తిస్తారు. ఇవి కేవలం 70 నుంచి 90 సెంటీమీటర్ల ఎత్తు మాత్రమే ఉంటాయి. గతంలో కూడా ప్రధాని ఈ ఆవులతో గడిపిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ తాజా వీడియో ప్రధాని వ్యక్తిగత జీవితంలోని మరో కోణాన్ని, ప్రకృతి, జీవరాశుల పట్ల ఆయనకున్న ప్రేమను తెలియజేస్తోంది.

### చంద్రగిరిలో ఏనుగుల బీభత్సం..

# రంగంలోకి దిగిన పవన్ కల్యాణ్

చంద్రగిరి సమీపంలో ఏనుగుల సంచారంతో ప్రజలు ఆందోళన

అప్రమత్తంగా ఉండాలని అధికారులకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశం

డ్రోన్లతో నిఘా, రాత్రి పూట గస్తీ పెంచాలని కీలక సూచనలు

పంట నష్టపోయిన రైతులకు తక్షణ పరిహారం అందిస్తామని హామీ

పరిస్థితిని బట్టి హనుమాన్ బృందాలను మోహరించాలని ఆదేశం



తిరుపతి: తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గంలోని ఎర్రవారిపాలెం మరియు సమీప గ్రామాల్లో ఏనుగుల గుంపు సంచారం స్థానికంగా తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. శేషాచలం అటవీ ప్రాంతం నుంచి వచ్చిన ఈ ఏనుగులు రాత్రివేళల్లో పంట పొలాలపై పడి తీవ్ర నష్టాన్ని కలుగజేస్తున్నాయి. ఈ విషయంపై స్పందించిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి పవన్ కల్యాణ్, ప్రజల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని అటవీశాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన చర్యలపై ఆయన అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి కీలక దిశానిర్దేశం చేశారు. ఏనుగుల కదలికలను నిరంతరం పర్యవేక్షించాలని, ఇందుకోసం ఆధునిక టెక్నాలజీని వినియోగించుకోవాలని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. డ్రోన్ల సహాయంతో ఏనుగుల సంచార మార్గాలను గుర్తించి, ఆ సమాచారాన్ని ఎప్పటికప్పుడు సమీప గ్రామాల ప్రజలకు చేరవేయాలని సూచించారు. ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించేందుకు అటవీ, రెవెన్యూ, పోలీసు శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ముఖ్యంగా అటవీ సరిహద్దు గ్రామాల్లో రాత్రివేళల్లో ప్రత్యేక గస్తీ బృందాలను ఏర్పాటు చేసి, ప్రజలు పొలాల వద్దకు వెళ్లకుండా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. స్థానిక సమాచార వ్యవస్థలు, మైకులు, మొబైల్ సందేశాల ద్వారా ప్రజలను నిరంతరం అప్రమత్తం చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ స్పందిస్తూ, "ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించడం మన ప్రథమ కర్తవ్యం. ఏనుగుల వల్ల ఎలాంటి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి. క్షేత్రస్థాయి సిబ్బంది 24 గంటలూ అప్రమత్తంగా ఉంటూ పరిస్థితిని సమీక్షించాలి. అవసరమైతే, ప్రజల భద్రత కోసం ప్రత్యేకంగా శిక్షణ పొందిన 'హనుమాన్' బృందాలను సమస్యాత్మక ప్రాంతాల్లో మోహరించాలి" అని అధికారులకు స్పష్టం చేశారు. ఏనుగుల దాడుల్లో పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని పవన్ కల్యాణ్ భరోసా ఇచ్చారు. పంట నష్టంపై అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికలు రూపొందించిన వెంటనే, అటవీశాఖ నిబంధనల ప్రకారం బాధితులకు తక్షణమే పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజలు కూడా భయాందోళనలకు గురికాకుండా, ధైర్యంగా ఉంటూ అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని, ఏనుగులు కనిపించిన వెంటనే అటవీశాఖ సిబ్బందికి సమాచారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఉప ముఖ్యమంత్రి ఆదేశాలతో అటవీశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో చర్యలు ముమ్మరం చేశారు.

### యూఎస్‌లో ఆగని గన్ కల్చర్..

# పార్కు, యూనివర్సిటీలో కాల్పులు

ఢిల్లీ: అమెరికాలో గన్ కల్చర్ మరోసారి పంజా విసిరింది. నిన్న ఒక్కరోజే కెంటకీ, వర్జీనియా రాష్ట్రాల్లో జరిగిన రెండు వేర్వేరు కాల్పుల ఘటనల్లో ఒకరు మరణించగా, చిన్నారులతో సహా తొమ్మిది మంది గాయపడ్డారు. ఈ వరుస ఘటనలు స్థానికంగా తీవ్ర భయాందోళనలకు కారణమయ్యాయి. వివరాల్లోకి వెళితే.. కెంటకీ రాష్ట్రంలోని లెక్సింగ్‌టన్ నగరంలో ఉన్న చార్లెస్ యంగ్ పార్కులో శనివారం సాయంత్రం దుండగులు కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో ఒకరు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో నలుగురు గాయపడ్డారు. గాయపడిన వారిలో నాలుగేళ్ల చిన్నారి, 14 ఏళ్ల బాలుడు, మరో ఇద్దరు పెద్దలు ఉన్నారని లెక్సింగ్‌టన్ పోలీస్ చీఫ్ లారెన్స్ వెదర్స్ తెలిపారు. వారిని వెంటనే ఆసుపత్రికి తరలించగా, ప్రాణాలకు ఎలాంటి ప్రమాదం లేదని వైద్యులు వెల్లడించారు. ఈ ఘటనతో అప్రమత్తమైన పోలీసులు లెక్సింగ్‌టన్ డౌన్‌టౌన్‌లో భారీ బందోబస్తు ఏర్పాటు చేసి, నిందితుల కోసం గాలింపు చేపట్టారు. అయితే, ఈ ఘటనకు సంబంధించి నిందితుల వివరాలను పోలీసులు ఇంకా వెల్లడించలేదు. ఇదే తరహాలో వర్జీనియా స్టేట్ యూనివర్సిటీలోనూ శనివారం తెల్లవారుజామున కాల్పుల ఘటన చోటుచేసుకుంది. యూనివర్సిటీలోని ఓ రెసిడెన్స్ హాల్ వెలుపల జరిగిన ఈ ఘటనలో ఐదుగురు వ్యక్తులు గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే క్యాంపస్‌ను తాత్కాలికంగా లాక్‌డౌన్ చేశారు. గాయపడిన వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉందని, మిగిలిన వారికి ప్రాణాపాయం లేదని యూనివర్సిటీ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం నుంచి కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ ఘటన విద్యార్థుల్లో ఆందోళన నింపింది. కాగా, కొద్ది రోజుల క్రితం బుధవారం జార్జియాలోని ఓ హైస్కూల్‌లో జరిగిన కాల్పుల్లో ఇద్దరు విద్యార్థులు గాయపడిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో పోలీసులు ఒక అనుమానితుడిని అదుపులోకి తీసుకున్నారు. వరుసగా విద్యాసంస్థలు, బహిరంగ ప్రదేశాల్లో జరుగుతున్న ఈ కాల్పుల ఘటనలు అమెరికాలో తుపాకీ నియంత్రణ చట్టాలపై చర్చను మరోసారి తెరపైకి తెచ్చాయి.

# అక్రమ నిర్మాణాలపై ప్రశ్నిస్తే సమాధానాలు చెప్పరా?

● "ప్రజా సమస్యలపై రాయండి.. అక్రమ నిర్మాణాలపై మమ్మల్ని ప్రశ్నించొద్దు" అన్నట్లు ఏసీపీ వ్యాఖ్యలపై దుమారం

● ప్రైవేటు స్థలం అయినా నిబంధనలు వర్తించవా? అధికారుల తీరుపై విచారణకు స్థానికుల డిమాండ్




శేరిలింగంపల్లి, ఆగస్టు 16 (అరుణ ప్రభ): నల్లగండ్ల హుడా కాలనీలో నివాస ప్రాంతాల మధ్య నిబంధనలకు విరుద్ధంగా వాణిజ్య షెడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయన్న ఫిర్యాదులపై వరుసగా పత్రికా కథనాలు వెలువడుతున్నప్పటికీ సంబంధిత అధికారులు స్పందించడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదే అంశంపై వివరణ కోరిన పత్రికా ప్రతినిధితో శేరిలింగంపల్లి టౌన్‌ప్లానింగ్ విభాగానికి చెందిన అసిస్టెంట్ సిటీ ప్లానర్ (ఏసీపీ) సురేందర్ రెడ్డి మాట్లాడిన తీరుపై కూడా స్థానికంగా చర్చ జరుగుతోంది.

స్థానికుల ఫిర్యాదుల ఆధారంగా నిర్మాణాలపై వాస్తవ పరిస్థితిని తెలుసుకునేందుకు పత్రికా ప్రతినిధి అధికారులను సంప్రదించినట్లు సమాచారం. గతంలో ఇన్‌చార్జ్ ఏసీపీని సంప్రదించగా నిర్మాణాలకు నోటీసులు జారీ చేశామని చెప్పినట్లు ప్రతినిధి పేర్కొన్నారు. అనంతరం ప్రస్తుత ఏసీపీ బాధ్యతలు స్వీకరించిన సమయంలో



టీపీఓ. అక్బర్

వివరణ కోరగా, తాను కొత్తగా బాధ్యతలు చేపట్టానని, విషయాన్ని పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పినట్లు తెలిపారు. అయితే కొద్దిరోజుల అనంతరం నిర్మాణాలు కొనసాగుతున్నాయన్న స్థానికుల ఫిర్యాదుల నేపథ్యంలో మళ్లీ అధికారులను సంప్రదించినట్లు ప్రతినిధి తెలిపారు. సంబంధిత టీపీఓను ప్రశ్నించగా పనులు నిలిపివేశామని చెప్పినప్పటికీ, క్షేత్రస్థాయిలో నిర్మాణ పనులు కొనసాగుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయని పేర్కొన్నారు.

### "అక్రమ నిర్మాణాలపై ప్రశ్నించొద్దు" అన్నారా?

ఇదే విషయంపై ఏసీపీని మరోసారి వివరణ కోరగా, "అక్రమ నిర్మాణాలపై మమ్మల్ని ప్రశ్నించొద్దు.. ఏదైనా ఉంటే ప్రజా సమస్యలపై రాయండి" అనే భావనలో సమాధానం ఇచ్చినట్లు పత్రికా ప్రతినిధి వెల్లడించారు. అలాగే తన పరిధిలో అనేక పనులు ఉన్నాయని, సర్కిల్ మొత్తాన్ని తానే పర్యవేక్షించాల్సి ఉంటుందని అధికారి చెప్పినట్లు తెలిపారు.


అయితే ఈ వ్యాఖ్యలపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు అందిన నిర్మాణాల అంశాన్ని పత్రికలు ప్రస్తావించడం కూడా ప్రజా సమస్యలపైనే కదా? అని వారు ప్రశ్నిస్తున్నారు. నివాస ప్రాంతాల్లో వాణిజ్య కార్యకలాపాలకు అనుగుణంగా నిర్మాణాలు చేపడుతున్నారన్న ఫిర్యాదుల నేపథ్యంలో వాస్తవ పరిస్థితిని అధికారికంగా వెల్లడించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని పేర్కొంటున్నారు.

### ప్రైవేటు స్థలం అంటే నిబంధనలకు మినహాయింపా?

నిర్మాణం జరుగుతున్న స్థలం ప్రైవేటు వ్యక్తికి చెందినదా కాదా అన్నది ఒక అంశమైతే, ఆ స్థలంలో చేపడుతున్న నిర్మాణాలకు సంబంధిత అనుమతులు ఉన్నాయా? అనుమతించిన వినియోగానికి అనుగుణంగానే నిర్మాణం జరుగుతోందా? భవన నిర్మాణ నిబంధనలు పాటిస్తున్నారా? వాణిజ్య కార్యకలాపాలకు అవసరమైన అనుమతులు ఉన్నాయా? అనేవి పరిశీలించాల్సిన అంశాలని స్థానికులు అంటున్నారు. ప్రైవేటు స్థలంలో నిర్మాణం జరుగుతోందనే కారణంతో ప్రభుత్వ నిబంధనలు వర్తించవని భావించడం సరికాదని వారు పేర్కొంటున్నారు. అనుమతులకు విరుద్ధంగా నిర్మాణం జరిగితే సంబంధిత చట్టాలు, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉంటుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

### ఫిర్యాదులు, కథనాలున్నా చర్యలు ఎక్కడ?

నల్లగండ్ల హుడా కాలనీకి చెందిన స్థానికులు, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు ఈ నిర్మాణాలపై సంబంధిత ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసినట్లు చెబుతున్నారు. ఫిర్యాదుల ఆధారంగా పత్రికల్లోనూ వరుసగా కథనాలు ప్రచురితమైనప్పటికీ ఇప్పటివరకు స్పష్టమైన చర్యలు కనిపించడం లేదని వారు ఆవేదన వ్యక్తం


Regd. No. 1049 of 2014
NALLAGANDLA HUDA COLONY RESIDENTIAL WELFARE ASSOCIATION
HUDA WELFARE ASSOCIATION

చేస్తున్నారు. ఇప్పటికే నోటీసులు జారీ చేశామని అధికారులు చెబుతున్నట్లయితే, ఆ నోటీసుల అనంతరం నిర్మాణ పనులు పూర్తిగా నిలిచిపోయాయా? లేదా నిబంధనలకు విరుద్ధంగా పనులు కొనసాగుతున్నాయా? అనే విషయాన్ని క్షేత్రస్థాయిలో అధికారులు తనిఖీ చేసి స్పష్టం చేయాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.

### అధికారుల వ్యవహారశైలిపై విచారణకు స్థానిక ప్రజల డిమాండ్

అక్రమ నిర్మాణాలపై వచ్చిన ఫిర్యాదులపై ఇప్పటివరకు తీసుకున్న చర్యలేమిటి? సంబంధిత నిర్మాణాలకు అనుమతులు ఉన్నాయా? ఉంటే ఏ మేరకు అనుమతులు మంజూరయ్యాయి?



ఏసీపీ. సురేందర్ రెడ్డి

ప్రస్తుతం జరుగుతున్న నిర్మాణాలు ఆ అనుమతుల పరిధిలోనే ఉన్నాయా? అనే అంశాలపై సమగ్ర విచారణ జరపాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

అదేవిధంగా పత్రికా ప్రతినిధి వివరణ కోరిన సందర్భంలో ఏసీపీ చేసినట్లు పేర్కొంటున్న వ్యాఖ్యలపై కూడా ఉన్నతాధికారులు వాస్తవాలను పరిశీలించాలని వారు కోరుతున్నారు. అధికారులపై వ్యక్తిగత ఆరోపణలు చేయడం తమ ఉద్దేశం కాదని, ప్రజల ఫిర్యాదులపై సంబంధిత శాఖ అధికారికంగా స్పందించి వాస్తవ పరిస్థితిని ప్రజలకు తెలియజేయాలన్నదే తమ అభిప్రాయమని స్థానికులు చెబుతున్నారు.

### అధికారుల వివరణతోనే వాస్తవం స్పష్టం

ఈ వ్యవహారంలో ఆరోపణలు, ప్రత్యారోపణలకు బదులుగా సంబంధిత టౌన్‌ప్లానింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి నిర్మాణాలకు సంబంధించిన అనుమతులు, భవన వినియోగం, నిబంధనల అమలు తదితర అంశాలపై అధికారిక వివరాలను వెల్లడించాల్సిన అవసరం ఉంది. నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని, ఉల్లంఘనలు లేవని తేలితే అదే విషయాన్ని స్పష్టంగా ప్రకటించాలని స్థానికులు కోరుతున్నారు. పత్రికా ప్రతినిధితో ఏసీపీ మాట్లాడినట్లు పేర్కొంటున్న వ్యాఖ్యలపై కూడా సంబంధిత ఉన్నతాధికారులు వాస్తవాలను పరిశీలించి తగిన విధంగా స్పందిస్తే వివాదానికి తెరపడే అవకాశం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

# భోగాపురం ఎయిర్‌పోర్ట్ రెడీ..

# అర్ధరాత్రి నుంచి విమాన సర్వీసులు

ఈ అర్ధరాత్రి నుంచి భోగాపురం ఎయిర్‌పోర్ట్ వాణిజ్య సేవలు ప్రారంభం

విశాఖపట్నం ఎయిర్‌పోర్ట్‌లో వాణిజ్య కార్యకలాపాలు పూర్తిగా నిలిపివేత

తొలి రోజు హైదరాబాద్, ఢిల్లీ సహా పలు నగరాలకు 31 విమాన సర్వీసులు

రికార్డు సమయంలో పూర్తయిన ఈ ప్రాజెక్టును ఆగస్టు 1న ప్రధాని మోదీ ప్రారంభించారు

ఉత్తరాంధ్ర ఆర్థికాభివృద్ధిలో ఈ విమానాశ్రయం కీలక పాత్ర పోషిస్తుందని అంచనా



అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం జిల్లా భోగాపురంలో కొత్తగా నిర్మించిన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి వాణిజ్య విమాన సర్వీసులు ఆదివారం అర్ధరాత్రి నుంచి ప్రారంభం కానున్నాయి. దీనితో పాటు, విశాఖపట్నం ఎయిర్‌పోర్ట్‌లోని (ఐఎన్ఎస్ డేగా) సివిల్ ఎన్‌క్లేవ్‌లో వాణిజ్య కార్యకలాపాలు పూర్తిగా నిలిచిపోనున్నాయి. ఈ అర్ధరాత్రి 12:01 గంటల నుంచి భోగాపురం విమానాశ్రయం పూర్తిస్థాయిలో పనిచేస్తుందని పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ఇప్పటికే అధికారికంగా ప్రకటించింది. ఈ నేపథ్యంలో అన్ని విమానయాన సంస్థలు తమ సేవలను విశాఖపట్నం నుంచి భోగాపురానికి మార్చాయి. తొలిరోజే హైదరాబాద్, ఢిల్లీ, ముంబై, చెన్నై, బెంగళూరు, కోల్‌కతా, తిరుపతి వంటి నగరాలకు 31 సర్వీసులు నడపడానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. పాత విశాఖపట్నం ఎయిర్‌పోర్ట్‌కు ఉన్న 'ఘ్గ' ఇంటర్నేషనల్ ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ కోడ్‌ను కూడా భోగాపురం విమానాశ్రయానికి బదిలీ చేశారు. అయితే, జాతీయ అత్యవసర పరిస్థితులు, భారత వైమానిక దళం, ఇతర రక్షణ దళాలు, పోలీసు, ప్రభుత్వ ప్రత్యేక వీఐపీ విమానాల రాకపోకలకు మాత్రం విశాఖ ఎయిర్‌పోర్ట్‌ను వినియోగించనున్నారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ ఆగస్టు 1న ఈ విమానాశ్రయాన్ని లాంఛనంగా ప్రారంభించారు. సుమారు రూ. 4,727 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయం కేవలం 31 నెలల్లోనే పూర్తయి, దేశంలో అత్యంత వేగంగా నిర్మించిన విమానాశ్రయాల్లో ఒకటిగా నిలిచింది. షెడ్యూల్ కంటే దాదాపు ఐదు నెలల ముందే దీని నిర్మాణం పూర్తి కావడం విశేషం. ఈ ఎయిర్‌పోర్ట్‌కు ఇప్పటికే డీజీసీఏ ఏరోడ్రోమ్ లైసెన్స్‌తో పాటు అవసరమైన అన్ని భద్రత, అగ్నిమాపక, పర్యావరణ అనుమతులు లభించాయి. మొదటి దశలో ఏటా 60 లక్షల మంది ప్రయాణికులకు సేవలందించేలా దీన్ని రూపొందించారు. భవిష్యత్తులో దీని సామర్థ్యాన్ని ఏటా 4 కోట్ల మంది ప్రయాణికులకు పెంచేలా మాస్టర్ ప్లాన్ సిద్ధం చేశారు. ఈ ప్రాజెక్టు ఉత్తరాంధ్రలోని పూర్వపు విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో ఆర్థిక వృద్ధి, పర్యాటకం, పారిశ్రామిక పెట్టుబడులు, ఎగుమతులు, లాజిస్టిక్స్, ఏరోస్పేస్, రక్షణ రంగాలను ప్రోత్సహించడంలో కీలక పాత్ర పోషిస్తుందని భావిస్తున్నారు. ఈ సమీకృత ప్రాజెక్టు మొత్తం 2,703.26 ఎకరాల్లో విస్తరించి ఉంది. ఇందులో 2,203.32 ఎకరాలు విమానాశ్రయానికి, 500 ఎకరాలు ఏవియేషన్ హబ్‌కు, 136.63 ఎకరాలు ఏవియేషన్ యూనివర్సిటీ/ఎడ్యుసిటీకి కేటాయించారు. ఎయిర్‌పోర్ట్‌లోని 3,800 మీటర్ల పొడవైన కోడ్-ఇ రన్‌వే బోయింగ్ 777, బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్, ఎయిర్‌బస్ ఘా330, ఘా340 వంటి భారీ విమానాలను సైతం హ్యాండిల్ చేయగలదు. దేశీయ, అంతర్జాతీయ కార్యకలాపాలకు మద్దతుగా అత్యాధునిక ఎయిర్‌ఫీల్డ్ లైటింగ్, నావిగేషన్ వ్యవస్థలను ఇక్కడ ఏర్పాటు చేశారు. ఈ విమానాశ్రయం ప్రారంభంతో ఉత్తరాంధ్ర అభివృద్ధిలో ఒక నూతన అధ్యాయం మొదలైందని చెప్పవచ్చు.

## పరేడ్ గ్రౌండ్ లో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల కళాశాల విద్యార్థుల ప్రదర్శన.



నిజామాబాద్ పోలీస్ పరేడ్ గ్రౌండ్ లో నిర్వహించిన స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో కంజర గురుకుల బాలికలు "భిన్నత్వంలో ఏకత్వం" అనే అంశంపై విద్యార్థినులు ప్రదర్శించిన దేశభక్తి నృత్యం సభికుల నుండి విశేష ప్రశంసలు అందుకుంది. వివిధ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా విద్యార్థినులు చేసిన ప్రదర్శన దేశ సమైక్యతకు ప్రతీకగా నిలిచింది. వీరి అత్యుత్తమ ప్రదర్శనకు బహుమతి నందు కొన్నారు.ఈ




సందర్భంగా ముఖ్య అతిథులుగా విచ్చేసిన ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి , నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి , అడిషనల్ కలెక్టర్ లోకల్ బాడీస్ వి. భుజంగరావు మరియు జిల్లా విద్యాధికారి అశోక్ చేతుల మీదుగా "భిన్నత్వంలో ఏకత్వం" డాన్స్ ప్రదర్శించిన విద్యార్థినులకు ప్రశంసా పత్రాలు అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ విద్యార్థినుల ప్రతిభను అభినందించారు. స్వాతంత్ర స్ఫూర్తిని కొనసాగిస్తూ దేశ సేవలో ముందుండాలని, చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలలో కూడా రాణించాలని విద్యార్థినులకు సూచించారు.ఈ కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని ప్రిన్సిపల్ శ్రీమతి విజయలలిత తెలియజేశారు.

## రచయిత్రి కల్పన దేవసానిని వరించిన "కవిపద్మ జాతీయ ఎక్సలెంట్ అవార్డు"



అఖిల భారతీయ పద్మశాలి సంక్షేమ సంఘం ఒ సురేపల్లి రాములమ్మ మహిళా సంక్షేమ ట్రస్ట్ ఆధ్వర్యంలో "మాతృభూమికి మంగళహారతి - సంస్కృతి, ఐక్యత, జాతీయ స్ఫూర్తితో మాతృదేశానికి నివాళి" సాంస్కృతిక కార్యక్రమం ఆగస్టు 15, 2026న రవీంద్రభారతి, మెయిన్ హాల్ లో ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి ఆర్. కృష్ణయ్య, ఎంపీ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. అధ్యక్షుడు తుమ్మ సత్యనారాయణ అధ్యక్షత వహించారు. డా. దుంపటి అనిత మార్గదర్శకత్వంలో సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.ఈ సందర్భంగా నిజామాబాద్ కు చెందిన మోపాల్ మండలం కంజర గురుకుల ఉపాధ్యాయిని, రచయిత్రి శ్రీమతి కల్పన దేవసాని ని "కవి పద్మ జాతీయ ఎక్సలెన్స్ అవార్డు తో సత్కరించారు. సాహిత్యం మరియు విద్యారంగంలో ఆమె చేస్తున్న సేవలను గుర్తించి ఈ అవార్డు ప్రదానం చేశారు.ఇంతటి గౌరవప్రదమైన అవార్డు అందుకున్న కల్పన దేవసానిని ఆమె పనిచేస్తున్న కంజర ప్రిన్సిపాల్ జి. విజయలిత, సహోద్యోగులు, మిత్రులు మరియు కుటుంబ సభ్యులు అభినందించారు.ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, సామాజిక కార్యకర్తలు, విద్యావేత్తలు పాల్గొన్నారు.

## అట్టహాసంగా 11వ తర్ప పద్మశాలి సంఘ ప్రమాణస్వీకారం.



నిజామాబాదు నగరంలోని పద్మశాలి కల్యాణ మండపంలో ఆదివారం నల్ల హనుమాన్ వీధి పద్మశాలి సంఘం 11వ తర్ప నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం అట్టహాసంగా జరిగింది.తర్ప అధ్యక్షుడు భీమర్తి సురేందర్,ప్రధాన కార్యదర్శి కస్తూరి శ్రీనివాస్,కోశాధికారి సామల అశోక్ తో పాటు మిగిలిన కార్యవర్గంచే నిజామాబాదు నగర పద్మశాలి సంఘం ఇంచార్జి అధ్యక్షుడు కన్న దుబ్బరాజం ప్రమాణస్వీకారం చేయించారు.ఈ సందర్భంగా దుబ్బ రాజం మాట్లాడుతూ పద్మశాలీలు ఐక్యంగా ఉండి అభివృద్ధి చెందాలని సూచించారు.ఐకమత్యమే మహాబలమని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నిజామాబాదు చేనేత సహకార సంఘం అధ్యక్షులు గుజ్జ రాజేశ్వర్,48వ డివిజన్ కార్పోరేటర్ సామల ప్రసన్న సత్యపాల్, పద్మశాలి సంఘం ప్రతినిధులు పుల్గం హన్మాండ్లు,దాసరి నర్సింలు,చౌటి భూమేశ్వర్,పడాల గంగాధర్,గుజ్జేటి వెంకట్ నర్సయ్య,ఎనగందుల మురళి,అవధూత దశరథం,బూస రవి,చౌకె వరప్రసాద్,అంకం లక్ష్మణ్,లక్కోర రాజేందర్,భీమర్తి రవి,చింతల గంగాదాస్,యెర్రగుంట శ్రీనివాస్,రామకృష్ణ,దోర్నాల సంధ్య,తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ వైర్లు గమనించి ప్రజల ప్రాణాలు కాపాడిన హోంగార్డుకు ప్రశంసా పత్రం.



ఎల్లారెడ్డిపేట అరుణప్రభ న్యూస్. సిరిసిల్ల డీఎస్పీ కార్యాలయంలో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న వీర్నపల్లి మండలం ఎర్రగడ్డ తండాకు చెందిన ఇస్లావత్ తేజ నాయక్ తన సమయస్ఫూర్తితో వ్యవహరించి ప్రజల ప్రాణాలకు ప్రమాదం తప్పించినందుకు ప్రశంసా పత్రం అందుకున్నారు.తేజ నాయక్ 2007లో హోంగార్డుగా పోలీసు శాఖలో చేరారు. ప్రస్తుతం సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్రచారి వద్ద విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల అర్ధరాత్రి సమయంలో పెట్రోలింగ్ చేస్తుండగా తాడూరు వెళ్లే మార్గంలోని తంగళ్లపల్లి మూలమలుపు వద్ద విద్యుత్ వైర్లు తెగి రోడ్డుపై పడిపోయిన విషయాన్ని తేజ నాయక్ గుర్తించారు.వెంటనే అప్రమత్తమై అక్కడికి ప్రజలు వెళ్లకుండా చర్యలు తీసుకోవడంతో పాటు విద్యుత్ ప్రమాదం జరగకుండా సంబంధిత అధికారులకు సమాచారం అందించారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పి ప్రజల ప్రాణాలకు ముప్పు తొలగింది.తేజ నాయక్ సమయస్ఫూర్తితో, బాధ్యతాయుతంగా వ్యవహరించిన తీరును పోలీసు అధికారులు అభినందించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఆయనకు ప్రశంసా పత్రాన్ని అందజేసి సత్కరించారు. అట్టి ప్రశంస పత్రాన్ని ప్రభుత్వ విప్ ఆధిశ్రీనివాస్ ,జిల్లా కలెక్టర్ అగ్రవాల్,ఎస్ పి మహేష్ బి గీతే తో ప్రశంసా పత్రం పందుకున్నారు.హోమ్ గార్డు తన సేవలతో పంద్రాగస్టు వేడుకల్లో ప్రశంస పత్రం అందుకున్న సందర్భంగా సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్రచారి అభినందించారు

# అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి బియ్యం, నిత్యావసర సరుకుల పంపిణీ



ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 16 (అరుణప్రభ న్యూస్):పక్షవాతంతో బాధపడుతూ కుటుంబ పోషణకు ఇబ్బందులు ఎదుర్కొంటున్న సింగారం గ్రామానికి చెందిన ఎం.డి. సమీర్ కుటుంబానికి అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం బియ్యం, నిత్యావసర సరుకులను అందజేశారు.సమీర్ పరిస్థితిని మంగోలి శ్రీనివాస్ గౌడ్, అమ్మ ఫౌండేషన్ చైర్మన్ ఆకుల మురళీమోహన్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే స్పందించి తన వంతు సహాయంగా 50 కిలోల నాణ్యమైన బియ్యంతో పాటు కొద్దిరోజులకు సరిపడా నిత్యావసర సరుకులను బాధిత కుటుంబానికి అందజేశారు.ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలుస్తూ అమ్మ ఫౌండేషన్ చేపడుతున్న సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని అభినందించారు. ఫౌండేషన్ చైర్మన్ ఆకుల మురళీమోహన్ గౌడ్‌కు బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఆయనకు భగవంతుడు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు ప్రసాదించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మంగోలి శ్రీనివాస్ గౌడ్, జి. శ్రీనివాస్ గౌడ్, కే. స్వామి, సర్పంచ్ ముత్యాల ప్రమీల బాలరాజ్, మాజీ ఎంపీటీసీ సింగారపు మధు, జి. శ్రీకాంత్ గౌడ్, ఎం. శ్రీనివాస్ గౌడ్, జి. దేవరాజ్ గౌడ్, వాసరవేణి దేవరాజు, ఇందూరి కిషన్, ఘనగోని నాగరాజు గౌడ్, ఇమ్మడి రామచంద్రం, షేక్ ఉస్మాన్, ఘనగోనిబాబి గౌడ్, నాగపురి నాగభూషణం గౌడ్ తదితరులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# సంక్షేమానికి సమగ్ర విధానం దిశగా తెలంగాణ అడుగులు




తెలంగాణ నుంచి ఉపాధి, మెరుగైన భవిష్యత్తు కోసం విదేశాలకు వెళ్తున్న యువత, వలసకార్మికులు, సంక్షేమానికి మరింత పటిష్టమైన విధానాన్ని రూపొందించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు ప్రారంభించిందని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఫిలిప్పీన్స్‌లో సంక్షేమ కోసం అమలు చేస్తున్న విధానాలు, కార్యక్రమాలను అధ్యయనం చేసేందుకు 14 మంది సభ్యులతో సబ్ కమిటీని ఏర్పాటు చేసింది.రిటైర్డ్ అధికారి డా. వినోద్ కుమార్ చైర్మన్‌గా, మంద భీంరెడ్డి వైస్ చైర్మన్‌గా ఉన్న ఈ కమిటీలో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌తో పాటు నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి అలాగే పలువురు ఎమ్మెల్యేలు, వీ×× రంగ నిపుణులు ఈ కమిటీలో సభ్యులుగా ఉన్నారు. కమిటీ ఈ నెల 17 18, 19, 20, 21 తేదీల్లో ఫిలిప్పీన్స్ రాజధాని మనీలా పర్యటించి అక్కడి సంక్షేమ విధానాలను అధ్యయనం చేయనుంది.వీ××లే తెలంగాణ అభివృద్ధిలో భాగస్వాములుఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ నుంచి విదేశాలకు వెళ్తున్న వారిలో అధిక సంఖ్యలో వలసకార్మికులు ఉన్నారని, విదేశాల్లో ఉన్న వీ××లు కూడా మనవాళ్లేనని అన్నారు. వారి భద్రత, సంక్షేమం, ఉపాధి అవకాశాలు, తిరిగి స్వదేశానికి వచ్చిన తర్వాత పునరావాసం వంటి అంశాలకు సమగ్ర విధానం అవసరమని పేర్కొన్నారు.తెలుగు అధిక తలసరి ఆదాయాన్ని రాష్ట్ర అభివృద్ధికి అనుసంధానం చేసేలా ప్రత్యేక వ్యవస్థ ఉండాలని ఆయన అభిప్రాయపడ్డారు. లక్ష తమ సమస్యలను నిర్భయంగా ప్రభుత్వానికి తెలియజేసేలా ప్రత్యేక వేదికను ఏర్పాటు చేయడంతో పాటు, సచివాలయ స్థాయిలో అందుబాటులో ఉండే వ్యవస్థ దిశగా ప్రభుత్వం సాగుతోందన్నారు.విదేశీ ఉపాధికి ముందస్తు శిక్షణయువత విదేశాలకు వెళ్లే ముందే వారికి అవసరమైన నైపుణ్యాలను అందించాలని ఎమ్మెల్యే సూచించారు. ముఖ్యంగా విదేశాల్లో డిమాండ్ ఉన్న రంగాల్లో శిక్షణ, విదేశీ భాషల పరిజ్ఞానం, ఉద్యోగ విధానాలపై అవగాహన కల్పించడం ద్వారా మెరుగైన అవకాశాలు పొందేలా చేయవచ్చన్నారు.ఇమిగ్రేషన్ దశ నుంచే సమగ్ర ప్రణాళిక ఉండాలని, విదేశాలకు వెళ్లిన తర్వాత ఎదురయ్యే న్యాయపరమైన సమస్యలు, ఉపాధి ఇబ్బందులు, ఇతర సమస్యలకు తక్షణ సహాయం అందేలా వ్యవస్థను బలోపేతం చేయనున్నట్లు పేర్కొన్నారు .24 గంటల పర్యవేక్షణ, లీగల్ సెల్, సీసీ కెమెరాల ఆధారంగా ఇంటర్వ్యూ ప్రక్రియ పర్యవేక్షణ వంటి ఆధునిక విధానాలను పరిశీలించనున్నట్లు తెలిపారు.గల్ఫ్‌తో పాటు యూరప్ వైపు దృష్టిప్రస్తుతం విదేశీ ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకే కాకుండా యూరప్‌లోని పలు దేశాలకు కూడా యువతలో ఆసక్తి పెరుగుతోందని భూపతి రెడ్డి పేర్కొన్నారు. ఆయా దేశాల్లో ఉన్న ఉద్యోగ అవకాశాలు, నైపుణ్య అవసరాలను గుర్తించి తెలంగాణ యువతను ముందుగానే సిద్ధం చేయాల్సిన అవసరం ఉందన్నారు.తో అనుసంధానం కోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ఏర్పాటు చేసి పెద్ద సంఖ్యలో సభ్యత్వాలను పెంచడంతో పాటు, వారిని ఆకర్షించే కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. విదేశాల్లో స్థిరపడిన వారు తిరిగి స్వదేశానికి వచ్చినప్పుడు ఉపాధి, పెట్టుబడులు, సామాజిక అనుసంధానం వంటి అంశాల్లో సహకారం అందించే విధానాన్ని కూడా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు.ఇదివరకే ఏపీ పర్యటన ముగించుకున్న అడ్వైజరీ కమిటీ ల సంక్షేమార్గం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని ఏర్పాటు చేసిన తెలంగాణ ప్రభుత్వం అడ్వైజరీ కమిటీ ఇదివరకే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తొలి పర్యటనను విజయవంతంగా నిర్వహించింది. ఇందులో ఆ ప్రభుత్వం ల సంక్షేమానికి అమలు చేస్తున్న కార్యక్రమాలు, విధివిధానాల పై సంస్థలు, అధికారులతో విస్తృతంగా చర్చించారు. ప్రభుత్వం పెద్దలు, నిపుణులతో సమావేశం నిర్వహించి అనేక అంశాలపై చర్చించారు. రాష్ట్రంలో ఇప్పటికే ఉపాధి నైపుణ్య కార్యక్రమాలు తెలంగాణలో నిరుద్యోగులకు ఉపాధి కల్పించే దిశగా ప్రభుత్వం ఇప్పటికే అనేక కార్యక్రమాలు చేపడుతోందని ఎమ్మెల్యే తెలిపారు. యువతకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించేందుకు స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయడంతో పాటు, ××లను అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లుగా అభివృద్ధి చేసి వృత్తిపరమైన శిక్షణ అందిస్తున్నామని చెప్పారు.టాస్క్, టామ్‌కామ్ తదితర సంస్థల ద్వారా యువతకు ఉపాధి అవకాశాలను కల్పించే చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. విదేశీ ఉద్యోగ అవకాశాలకు అనుగుణంగా నైపుణ్యాలను అభివృద్ధి చేయడంపై మరింత దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. భరోసా కల్పించే చర్యలువివిధ కారణాలతో విదేశాల్లో మృతి చెందిన వీ××ల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా అందజేస్తోందని భూపతి రెడ్డి తెలిపారు. వీ××ల సమస్యల పరిష్కారానికి లీగల్ సెల్‌ను మరింత బలోపేతం చేయనున్నట్లు వెల్లడించారు.తెలంగాణలో అమలు చేస్తున్న ప్రవాసి ప్రజావాణి వంటి కార్యక్రమాలపై కూడా ఫిలిప్పీన్స్ పర్యటనలో చర్చించనున్నట్లు తెలిపారు. విదేశాల్లో ఉన్న తెలంగాణ ప్రజలు తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి సులభంగా తీసుకురావడానికి మరింత సమర్థవంతమైన వ్యవస్థను రూపొందించడమే లక్ష్యమన్నారు.అధ్యయన నివేదిక ఆధారంగా ప్రత్యేక పాలసీఫిలిప్పీన్స్ పర్యటనలో లభించే అనుభవాలు, అక్కడ అమలు చేస్తున్న విధానాలపై అధ్యయనం, తెలంగాణ పరిస్థితులపై సమీక్ష ఆధారంగా సమగ్ర నివేదిక రూపొందించనున్నారు. ఈ నివేదిక ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక పాలసీని రూపొందించే అవకాశం ఉంది.ఈ విధానం అమల్లోకి వస్తే విదేశాలకు వెళ్లే యువతకు ముందస్తు నైపుణ్య శిక్షణ నుంచి విదేశాల్లో భద్రత, ఉపాధి, న్యాయ సహాయం, 24 గంటల పర్యవేక్షణ, తిరిగి స్వదేశానికి వచ్చిన తర్వాత పునరావాసం వరకు ఒక సమగ్ర వ్యవస్థ అందుబాటులోకి రానుంది.నిజామాబాద్ జిల్లా వాసులకే అధిక ప్రయోజనాలుతెలంగాణ రాష్ట్రం నుండి అంతర్జాతీయంగా వలస వెళ్తున్న వారిలో నిజామాబాద్ జిల్లా నుండి అధికంగా ఉన్నారు. ఇక్కడి వారు ఎక్కువగా నిర్మాణ రంగం, డ్రైవింగ్ మరియు ఇతర కార్మిక పనుల కోసం గల్ఫ్ దేశాలను ఎంచుకుంటున్నారు.నిజామాబాద్ జిల్లా నుండి ఉపాధి కోసం ప్రతి ఏటా వేలాది మంది విదేశాలకు వెళ్తున్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా గల్ఫ్ దేశాలు (దుబాయ్, సౌదీ అరేబియా, కువైట్, ఖతార్ తదితర) మరియు ఇతర విదేశాల్లో సుమారు 50,000 నుండి 70,000 మందికి పైగా కార్మికులు జీవనం సాగిస్తున్నారు. అధికారిక లెక్కల కంటే అనధికారికంగా టూరిస్ట్ వీసాలపై వెళ్లే వారి సంఖ్య చాలా ఎక్కువగా



ఉండేందుకు ఆస్కారం లేకపోలేదు. ఈ పర్యటన నివేదిక ఆధారంగా త్వరలో రాష్ట్ర ప్రభుత్వం వీ×× పాలసీ రూపొందిస్తే మొదటగా ప్రయోజనం నిజామాబాద్ జిల్లా వారికే కలగనుంది.విదేశీ ఉపాధిని కేవలం వలసగా కాకుండా.. తెలంగాణ యువతకు మెరుగైన అవకాశాలు, వీ××లకు భద్రత, రాష్ట్రానికి ఆర్థికాభివృద్ధి అందించే భాగస్వామ్యంగా మలచడమే ఈ పర్యటన, ప్రతిపాదిత వీ×× పాలసీ ప్రధాన లక్ష్యంగా నిలవనుంది.దీని ద్వారా తెలంగాణ రాష్ట్రంలో యువతకు ఒక కొత్త మార్గదర్శకత్వంగా రానున్న వీ×× పాలసీ మారనుంది. ఉపాధి అవకాశాలు కల్పించడం, విదేశాల్లో బ్లూ కాలర్ ఉద్యోగాలకు ముందస్తుగానే ఇక్కడి నుండి శిక్షణ కల్పించడం , నైపుణ్యాలు పెంపొందించడం తదితర రంగాల్లో ముందడుగులో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు.

# జీవన తరంగాలుస్వీయ ఆవిష్కరణ ఒక సాధనామయ జీవితానికి అక్షర దర్పణం

మనిషి జీవితాన్ని రాయడం ఒక విషయం; తాను జీవించిన జీవితాన్ని నిజాయితీగా, దాపరికం లేకుండా అక్షరాల్లో ఆవిష్కరించడం మరో విషయం. ఆ రెండో సాహసమే ఇంజనీర్ యెర్రం మోహన మురళి రచించిన "జీవన తరంగాలు -- స్వీయ ఆవిష్కరణ".1945లో ఒక సాధారణ కుటుంబంలో జన్మించిన మోహన మురళి బాల్యం నైజాం పాలనా కాలపు సామాజిక, ఆర్థిక పరిస్థితుల మధ్య సాగింది. ఆయన తండ్రి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు. పరిమిత ఆర్థిక వనరుల మధ్యనూ విద్యకు ఇచ్చిన ప్రాధాన్యం కుటుంబ సంస్కారాన్ని తెలియజేస్తే, బాల్యంలోనే మాతృవియోగాన్ని ఎదుర్కొని విద్యాభ్యాసాన్ని కొనసాగించిన తీరు ఆయన పట్టుదలకు నిదర్శనం.మెట్రిక్యులేషన్, పాలిటెక్నిక్ విద్యతో ప్రారంభమైన ఆయన విద్యా ప్రస్థానం ఉద్యోగంలో చేరిన తరువాత కూడా ఆగలేదు. ఉద్యోగ బాధ్యతలతో పాటు బి.టెక్, ఎం.టెక్, కంప్యూటర్ విద్యలో పి.జి. డిప్లొమా సాధించారు. పదవీ విరమణ తరువాత కూడా విద్యార్థి దశకు ముగింపు పలకకుండా సంస్కృతాన్ని అభ్యసించి ఎం.ఏ. పట్టా పొందారు. జీవితాంతం విద్యార్థిగా ఉండాలనే తపన ఈ జీవన ప్రస్థానానికి అత్యంత స్ఫూర్తిదాయకమైన అంతరసూత్రం.విద్యుత్ శాఖలో 38 సంవత్సరాల సుదీర్ఘ సేవా ప్రస్థానం ఈ గ్రంథానికి వెన్నెముక. వివిధ హోదాల్లో నిర్వహించిన బాధ్యతలు, పదోన్నతులు, సాంకేతిక సవాళ్లు, కార్యనిర్వహణలోని అనుభవాలు, సహచరుల సమస్యల పట్ల స్పందన, సంఘ కార్యకలాపాల్లో నాయకత్వం---ఇవన్నీ ఒక నిబద్ధతగల వృత్తిజీవి వ్యక్తిత్వాన్ని ఆవిష్కరిస్తాయి.అదే సమయంలో రచయిత తన వ్యక్తిగత జీవితాన్ని సమాజం నుంచి వేరుచేయలేదు. తెలంగాణ సామాజిక నేపథ్యం, ఉద్యోగ ప్రపంచం, సమకాలీన పరిణామాలు, కుటుంబ




కదులుతూనే ఉంటుంది. బాల్యం, విద్య, వివాహం, ఉద్యోగం, పదోన్నతులు, కుటుంబ బాధ్యతలు, సంఘర్షణలు, ఉన్నత విద్య, పదవీ విరమణ, సాహిత్యాభ్యాసం, ఆధ్యాత్మిక, సమాజసేవ---ప్రతి దశ ఒక ప్రత్యేక తరంగం.ఆ తరంగాలను రచయిత వెనక్కి తిరిగి చూసి, జ్ఞాపకాలను అనుభవాలుగా, అనుభవాలను ఆలోచనలుగా, ఆలోచనలను అక్షరాలుగా మలిచారు.ఈ పుస్తకంలో విస్మయం మాత్రమే కాదు---కనిపించినవి ఉన్నాయి; కనిపించనివి మాత్రమే కాదు---జీవించినవి ఉన్నాయి. అందుకే ఇందులోని సంఘటనలు పాఠకుడికి దూరంగా అనిపించవు; మన చుట్టూ జరిగిన జీవితం మన కళ్లముందు కదులుతున్న అనుభూతిని కలిగిస్తాయి.ముఖ్యంగా శ్రీధరేశ్వర నిజాం వెంకటేశం గారికి గ్రంథాన్ని అంకితం చేయడం రచయితలోని కృతజ్ఞతా సంస్కారానికి ప్రతీక. ఒక ఆత్మీయ మిత్రుడి ప్రోత్సాహం ఈ ఆత్మకథకు ఎలా బీజమైందో గ్రంథ ప్రయాణం హృద్యంగా తెలియజేస్తుంది.జీవన తరంగాలు చదివినప్పుడు మన ముందుకు వచ్చేది కేవలం ఒక ఇంజనీర్ జీవిత కథ కాదు. కష్టాలను అధిగమించిన సాధకుడు, జీవితాంతం విద్యార్థిగా నిలిచిన జ్ఞానాన్వేషి, వృత్తిని ధర్మంగా భావించిన ఇంజనీర్, సాహిత్యాన్ని ఆత్మీయంగా స్వీకరించిన అభ్యాసి, ఆధ్యాత్మికతను అన్వేషించిన సాధకుడు, సమాజాన్ని




బంధాలు, మిత్రత్వాలు, సంఘర్షణలు అన్నీ ఆయన జీవన ప్రవాహంలో సహజంగా కలిసిపోయాయి. అందువల్ల జీవన తరంగాలు ఒక వ్యక్తి ఆత్మకథను దాటి ఒక కాలపు జీవన చిత్రంగా రూపుదిద్దుకుంది.ఈ గ్రంథంలోని విశిష్టతల్లో ఒకటి విద్య నుంచి సాహిత్యానికి, వృత్తి నుంచి ఆధ్యాత్మికతకు, వ్యక్తిగత అభివృద్ధి నుంచి సమాజ సేవకు సాగిన పరిణామం. వేమన, సుమతీ శతకాలు, అన్నమయ్య, త్యాగరాజు, జయదేవుని అష్టపదులు, స్తోత్ర సాహిత్యం వంటి వాటి పట్ల ఆసక్తి; యోగా, నాదోపాసన, ధ్యానం; సంస్కృతాభ్యాసం---ఇవన్నీ రచయితలోని అంతర్ముఖ సాధకుడిని పరిచయం చేస్తాయి.సమాజ సేవ, రిటాక్ ట్రస్టు, "భారత దర్శనం" వంటి కార్యక్రమాలు, రామప్ప వారసత్వంపై శ్రద్ధ కూడా ఆయన జీవితం కేవలం స్వీయ సాధనతో ఆగిపోలేదని తెలియజేస్తాయి. తాను ఎదగడంతో పాటు సమాజానికి తన వంతు ఇవ్వాలనే తపన ఈ జీవన ప్రస్థానానికి మరో విలువైన కోణం.శీర్షికే జీవన తత్త్వం"జీవన తరంగాలు" అనే పేరు గ్రంథానికి అద్భుతంగా సరిపోతుంది. సముద్రపు అలల మాదిరిగా జీవితం కూడా నిరంతరం తన వంతుగా ఆదరించిన సేవాభావ---ఇలా అనేక పార్శ్వాలతో కూడిన సంపూర్ణ వ్యక్తిత్వం.అందుకే ఈ గ్రంథం ఒక స్వీయచరిత్రగా మొదలై స్ఫూర్తి గ్రంథంగా పరిణమిస్తుంది.నేటి వేగవంతమైన జీవితంలో విద్యకు విలువ తగ్గుతున్నప్పుడు, కష్టాలను చూసి వెనక్కి తగ్గుతున్నప్పుడు, పదవీ విరమణను జీవితానికి ముగింపుగా భావిస్తున్నప్పుడు---జీవన తరంగాలు ఒక ముఖ్యమైన సందేశాన్ని అందిస్తుంది."జీవితానికి ముగింపు దశలు ఉండవచ్చు.కానీ నేర్చుకోవాలనే తపనకు ముగింపు ఉండకూడదు."అందుకే నేటి సమాజం తప్పక చదవవలసిన పుస్తకం "జీవన తరంగాలు".ఇది ఒక వ్యక్తి జీవితం గురించి మాత్రమే చెప్పదు---జీవితాన్ని అర్థవంతంగా ఎలా జీవించాలో చెబుతుంది.పుస్తక వివరాలుజీవన తరంగాలు -- స్వీయ ఆవిష్కరణరచయిత: ఇంజనీర్ యెర్రం మోహన మురళివిభాగం: సంస్కృత సాహిత్యాచార్యజననం: 1945స్థిర నివాసం: హనుమకొండతొలి ముద్రణ: 2023మలి ముద్రణ: 2024పుటలు: 311వెల: ?350రచయిత మొబైల్: 9849441447సమీక్షకా పెరుక రాజు జాతీయ కవి, రచయిత, అనువాదకుడు78100 32847

అరుణ ప్రభ
ARUNAPRABHA TELUGU DAILY
సోమవారం - 17- ఆగష్టు - 2026

## ఎల్లారెడ్డి పేట ఎస్సై గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎన్.రమేష్ గౌడ్ ను కలిసి శుభాకాంక్షలు తెలిపిన సీనియర్ జర్నలిస్టులు.




ఎల్లారెడ్డిపేట అరుణప్రభ న్యూస్.రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల ఎస్ ఐ గా గత శనివారం నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన ఎస్ ఐ ఎన్.రమేష్ గౌడ్ ను మండల సీనియర్ జర్నలిస్టులు పోలీస్ స్టేషన్లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎస్ ఐ రమేష్ గౌడ్ ను శాలువాతో సత్కరించారు.ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టులు మండల ప్రజలకు చట్టపరంగా సేవలు అందించాలని కోరారు.జర్నలిస్టులు కోరిన విధంగా మండల ప్రజలకు చట్ట పరంగా న్యాయం అందిస్తానని ఎస్ ఐ రమేష్ గౌడ్ తెలిపారు.మండలంలోని ప్రజలు,జర్నలిస్టులు,అన్ని వర్గాల వారు శాంతి భద్రతలు కాపాడటంలో తమకు సహకరించాలని కోరారు.మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు నిరంతరం శ్రమిస్తామని ఎస్ ఐ సూచించారు.మండలంలో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వ్యక్తులపై కటినంగా వ్యవహరిస్తామన్నారు.గ్రామాలలో దొంగ తనాల నివారణకు పోలీసులు గ్రామాలలో నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించే లా చర్యలు చేపట్ట నున్నట్లు ఎస్ ఐ తెలిపారు. గ్రామాలలో అనుమానాస్పదంగా కనిపించే వ్యక్తుల పట్ల మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని,అనుమానిత వ్యక్తుల సమాచారాన్ని పోలీసులకు అందించాలని ఎస్ ఐ తెలిపారు.ఎస్ ఐ నీ కలిసిన వారిలో సీనియర్ జర్నలిస్టులు కాసు శ్రీనివాస్ రాజు, బండారి బాల్రెడ్డి,బుగ్గ కృష్ణమూర్తి శర్మ, పెంటమ్ శ్రీనివాస్ లు ఉన్నారు.

## మాల మహానాడు మండల అధ్యక్షుడిగా జీలుగు దాసు ఏకగ్రీవ ఎన్నిక

### మాల కుటుంబ సభ్యుల ఐక్యతే లక్ష్యం -- అల్లాడి పౌలు రాజు



అరుణ ప్రభ:-భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలంసారపాక మాల మహానాడు మండల అధ్యక్షుడిగా జీలుగు దాసు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మాల మహానాడు జాతీయ అధ్యక్షులు ఎర్రమల్ల రాములు ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షులు అల్లాడి పౌలు రాజు నూతన మండల కమిటీని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా జీలుగు దాసు మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పగించిన మండల అధ్యక్ష పదవికి పూర్తిగా కట్టుబడి పనిచేస్తానని తెలిపారు. మాల కుటుంబ సభ్యుల్లో ఎవరికైనా సమస్య ఎదురైతే వారి సమస్య పరిష్కారానికి ముందుండి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తనను మండల అధ్యక్షుడిగా ఎన్నుకున్న జాతీయ అధ్యక్షులు ఎర్రమల్ల రాములు, జిల్లా అధ్యక్షులు అల్లాడి పౌలు రాజుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.జిల్లా అధ్యక్షులు అల్లాడి పౌలు రాజు మాట్లాడుతూ ఉమ్మడి భద్రాద్రి-ఖమ్మం జిల్లాలోని పాత కమిటీలను రద్దు చేసినట్లు తెలిపారు. భద్రాద్రి జిల్లాలో ముందుగా మండల అధ్యక్షుల నియామకాలను పూర్తి చేస్తున్నామని, త్వరలో గ్రామ, పట్టణ కమిటీలను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.మాల కుటుంబ సభ్యులందరూ ఐక్యంగా కలిసిమెలిసి ఉండాలని, సంఘం వేసే ప్రతి అడుగు ఆదర్శంగా నిలిచేలా పనిచేయాలని పిలుపునిచ్చారు. కుటుంబ సభ్యుల్లో ఎవరైనా మరణిస్తే వారి కుటుంబానికి సంఘం తరపున అండగా నిలిచి, ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించేలా చర్యలు చేపడతామని అన్నారు. ప్రతి ఒక్కరిలో చైతన్యం తీసుకువస్తూ, అందరినీ కలుపుకొని సంఘాన్ని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు.జీలుగు దాసు మండల అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నిక కావడంతో మాల మహానాడు జిల్లా అధ్యక్షులు అల్లాడి పౌలు రాజు, పినపాక కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు కొట్టే అనిల్ కుమార్, సారపాక పదో వార్డు సభ్యులు పాటి అశోక్ తదితరులు ఆయనను అభినందించారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు సభ్యులు.. పాల్గొన్నారు

## విశ్వ గాయత్రి యజ్ఞ సమితి ఆద్వర్యంలో శ్రావణమాసం సందర్భంగా ఇంటింటా గాయత్రి యజ్ఞ



కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.అందులో భాగంగా ఆదివారం నిజామాబాదు నగరంలోని సాయికృప నగర్లో ఉన్న యెర్రగుంట కృష్ణవేణి వంశీ దంపతుల స్వగృహంలో యజ్ఞ కార్యక్రమం చేశారు. సుదర్శన ముని పౌరోహిత్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విశ్వ గాయత్రి యజ్ఞ సమితి అధ్యక్షురాలు గుజ్జ రాజేశ్వరి మాట్లాడుతూ తమ సమితి ఆద్వర్యంలో ప్రతీ యేటా శ్రావణ మాసంలో ఇంటింటా గాయత్రి యజ్ఞ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.యజ్ఞం వల్ల కాలుష్య నివారణ జరిగి వాతావరణ శుద్ధి జరుగుతుందన్నారు.చెట్లను నరకడం,ప్లాస్టిక్ వాడకం వంటి వాటివల్ల ఎన్నో రోగాలు వస్తున్నాయని వాటి నివారణకు యజ్ఞం ఒక మార్గమని ఆమె పేర్కొన్నారు. యజ్ఞం వల్ల ఇంట్లో పరిసరాల్లో రోగక్రిములు నశించడంతో పాటుపవిత్రత ప్రశాంతత లభిస్తుందని రాజేశ్వరి చెప్పారు.కార్యక్రమం లో విశ్వ గాయత్రి యజ్ఞ సమితి పురోహితులు నక్క అంజయ్య,సుగుణ తదితరులు పాల్గొన్నారు.

## ఏఎంసీ డైరెక్టర్ కుమారుడి వివాహానికి హాజరైన ఎమ్మెల్యే భూపతి రెడ్డి



నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి ఆదివారం నవీపేట రఘుపతి రెడ్డి గార్డెన్ లో జరిగిన ఏఎంసీ డైరెక్టర్ బాగారెడ్డి కుమారుడి వివాహానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను అక్షింతలు వేసి ఆశీర్వదించారు. వైవాహిక జీవితం సంతోషంగా సాగాలని ఆకాంక్షించారు. ఏఎంసి చైర్మన్ ముప్ప గంగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు పొలసాని శ్రీనివాస్, జనార్దన్, మోహన్, అంబర్ సింగ్, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ సర్పంచ్‌ను సన్మానించిన బీఆర్ఎస్ నాయకులు



ఎల్లారెడ్డిపేట, అరుణప్రభ న్యూస్:ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ గ్రామ సర్పంచ్ ఇల్లందుల గీతాంజలి శ్రీనివాస్ రెడ్డి జిల్లా ఉత్తమ పంచాయతీ సర్పంచ్‌గా ఎంపికైన సందర్భంగా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య ఆధ్వర్యంలో నాయకులు ఆమెను ఘనంగా సన్మానించారు.పంద్రాగస్టు వేడుకల సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్, ఎస్పీ చేతుల మీదుగా గీతాంజలి శ్రీనివాస్ రెడ్డి ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ జిల్లా, మండల నాయకులు ఆమెను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.గ్రామ అభివృద్ధికి చేసిన కృషికి గుర్తింపుగా జిల్లా ఉత్తమ పంచాయతీ సర్పంచ్ అవార్డు దక్కడం అభినందనీయమని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 80 వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉద్యోగుల



ప్రశంసాపత్రాలు ప్రధానం కార్యక్రమం భాగంగా నిజామాబాద్ ఇంటలిజెన్స్ ఏఎస్ఐ జీవన్ రెడ్డి కీ ఉత్తమ ప్రశంసా పత్రాల ప్రధానం చేసిన పోలీస్ కమిషనర్ సాయి చైతన్య చేతుల మీదుగా ఉత్తమ అవార్డు అందుకోవడం జరిగింది. అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## స్వీపర్లకు స్కావెంజర్లకు నేరుగా ప్రభుత్వమే వారి అకౌంట్లో వేతనాలు జమ చేయాలి.

ఈరోజు ఏఐటీయూసీ ఆఫీసులో తెలంగాణ స్లీపర్స్ స్కారేంజర్స్ జిల్లా కమిటీ సమావేశము జరిగినది

ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షురాలు వసంత అధ్యక్షతన నిర్వహించడం జరిగినది.




జిల్లా ప్రధాన కార్యదర్శి తోపునూరు చక్రపాణి మాట్లాడుతూ ముఖ్యంగా స్వీపర్లకు స్కావెంజర్లకు నేరుగా ప్రభుత్వమే వారి అకౌంట్లో వేతనాలు జమచేయాలి, అదేవిధంగా ప్రభుత్వము ఒక సింగరేణి సమస్త దగ్గర లాభాలతో ఉన్న సంస్థ నుండి ఆ డబ్బులతోనే ఈ స్కావెంజర్లను నడిపిస్తా ఉన్నది. కాబట్టి ఆ వేతనాలైనా గాని నేరుగా అకౌంట్లకు వస్తేనే బాగుంటదనేది అభిప్రాయం జరిగినది .ముఖ్యంగా గత సంవత్సరం నిజామాబాద్ జిల్లాలో 11 మందికి ఆరునెల వేతనాలు రాలేవు వారితోపాటు ఇప్పుడు ఈ మూడు నెలల నుంచి వేతనాలు పెండింగ్ లో ఉన్నాయి పెండింగ్ వేతనాలు తో పాటు గత సంవత్సరం సంబంధించిన 11 పాఠశాల వేతనాలు వెంటనే విడుదల చేసి ప్రభుత్వము కార్మికులను ఆదుకోవాలని ఈ సమస్యల మీద పాటు వీరిని కార్మికులుగా గుర్తించి స్కావెంజర్లకు ఇవ్వాల్సిన హక్కు వేతనాలు ప్రతి కార్మికుడికి 26 వేల రూపాయలు వేతనం ఇవ్వాలి లేదా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి కానీ ఈ సమస్యల మీద జిల్లా వ్యాప్తంగా ఒక ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించుకుంటున్నాము కాబట్టి ఈ సమస్యల మీద ముందుకెళ్లాలని నిర్ణయంతో సమావేశం నిర్వహించడం జరిగినది. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పి హనుమాన్లు కోశాధికారి ఫిరో అలీ జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## తెలంగాణ రక్షణ సేన పార్టీలోకి భారీగా చేరికలు



ఎల్లారెడ్డిపేట, అరుణప్రభ న్యూస్.సిరిసిల్ల నియోజకవర్గంలోని ముస్తాబాద్ మండలం కొండాపూర్, ఎల్లారెడ్డిపేట మండలంలోని దుమాల గ్రామాలకు చెందిన 50 మందికి పైగా మహిళలు, యువకులు, ప్రజలు ఆదివారం తెలంగాణ రక్షణ సేన పార్టీలో చేరారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి మజీద్ వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా మజీద్ మాట్లాడుతూ.. తెలంగాణ రక్షణ సేన పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. ఉద్యమకారులు, సింగరేణి



కార్మికులు, ఆటో కార్మికులు, నిరుద్యోగుల సమస్యలపై, నేరెళ్ల బాధితులకు న్యాయం చేయాలనే డిమాండ్‌తో కవిత పలు ఉద్యమాలు చేపట్టి సమస్యల పరిష్కారానికి కృషి చేశారని అన్నారు.కవిత ప్రతిపాదిస్తున్న పాంచజన్య పథకాలు, ఉచిత విద్య, ఉచిత వైద్యం, రైతు సంక్షేమం, ఉపాధి అవకాశాలు, సామాజిక న్యాయం వంటి ప్రజా సంక్షేమ విధానాలకు ఆకర్షితులై ప్రజలు స్వచ్ఛందంగా పార్టీలో చేరుతున్నారని పేర్కొన్నారు.50 మందికి పైగా మహిళలు, యువకులు పార్టీలో చేరడం పట్ల మజీద్ హర్షం వ్యక్తం చేశారు. 2029లో తెలంగాణకు కల్వకుంట్ల కవితను ముఖ్యమంత్రిని చేయడమే తమ లక్ష్యమని అన్నారు. కవిత ఆశయాలు, పాంచజన్య సూత్రాలను ప్రతి గ్రామానికి, ప్రతి ఇంటికి తీసుకెళ్లాలని, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో రాజకీయాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. సామాజిక న్యాయం, సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా తెలంగాణ రక్షణ సేన పార్టీని మరింత బలోపేతం చేయాలని కోరారు.కార్యక్రమంలో టీఆర్ఎస్ సీనియర్ నాయకులు, ముస్తాబాద్ మండల నాయకులు మార్వాడి దేవరాజు, కదిరే రేణుక, మల్లవ్వ తదితరులు పాల్గొన్నారు.

## సుద్దపల్లి నూతన గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులను



ఎన్నుకోవడం జరిగింది కమిటీ క్యాషియర్ గా దుంపటి భూమయ్య, ఖాతాదారిగా వడ్డ లక్ష్మన్ ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని శుద్ధపల్లి గ్రామ సర్పంచ్ రూపా సతీష్ రెడ్డి ఉపసర్పంచ్ క్రాంతికుమార్ తెలిపారు.నూతన గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులుగా పానుగంటి లింగయ్య, ఏరా వినోద్ రెడ్డి, నరేష్ , సాయిలు,సాగర్,శంకర్ ,లింగయ్య సత్యనారాయణ,సురేందర్ గౌడ్ సురేష్, వినోద్, గంగాధర్, బుచ్చన్న, ఎన్నుకున్నారు ఈ యొక్క నూతన కమిటీ సభ్యులను సర్పంచ్,ఉపసర్పంచ్ ఘనంగా సన్మానించారు.

## ఎస్.వి. కృష్ణారెడ్డి చేతుల మీదుగా సెంట్రాక్స్ ఇన్ఫో టెక్, ది లెజెండ్స్ పేజ్ పోస్టర్ ఆవిష్కరణ




హైదరాబాద్, ఆగస్టు 15: ప్రముఖ హీరో, దర్శకుడు ఎస్.వి. కృష్ణారెడ్డి శనివారం సెంట్రాక్స్ ఇన్ఫో టెక్ డిజిటల్ మార్కెటింగ్ కంపెనీతో పాటు “ది లెజెండ్స్ పేజ్” పోస్టర్లను అధికారికంగా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యువత ఆలోచనలు, సృజనాత్మకత మరియు సేవా కార్యక్రమాలకు “ది లెజెండ్స్ పేజ్” ఒక వేదికగా నిలుస్తుందని అన్నారు. అలాగే డిజిటల్ రంగంలో సెంట్రాక్స్ ఇన్ఫో టెక్ వినూత్న సేవలతో కొత్త మార్పులకు నాంది పలుకుతుందని అభిప్రాయపడ్డారు.కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ యక్కంటి వెంకటరెడ్డి (వైవీఆర్) మాట్లాడుతూ, యువతకు ఉపయుక్తమైన డిజిటల్ సేవలను అందించడంతో పాటు సామాజిక బాధ్యతతో కూడిన కార్యక్రమాలకు సంస్థ ప్రాధాన్యం ఇస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, సిబ్బంది, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## పేద ప్రజలకు వైద్య సేవలే లక్ష్యం: బొంగునూరి కిషోర్ రెడ్డి



దుండిగల్ ఆగస్టు 16(అరుణ ప్రభ): పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే తన ఏకైక లక్ష్యమని రాష్ట్ర ప్రోటోకాల్ కోఆర్డినేషన్ వైస్ చైర్మన్, బీకేఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు బొంగునూరి కిషోర్ రెడ్డి అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని 296 దుండిగల్ తండా-2 డివిజన్‌లో బీకేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 56వ ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కిషోర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో ఫౌండేషన్ తరఫున ఉచిత వైద్య శిబిరాలను నిరంతరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దుండిగల్ తండా-2తో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు ఈ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.శిబిరంలో వైద్యులు రోగులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సూచనలు అందించారు. స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉచిత వైద్య సేవలను పొందారు.ఈ కార్యక్రమంలో రాజేష్ నాయక్, నర్సింహారెడ్డి, గణేష్ నాయక్, ఆకాష్, కృష్ణ, మహేష్, సందీప్, రిజ్వాన్, బీకేఆర్ టీమ్ సభ్యులు, స్థానిక ప్రజలు, నిర్వాహకులు పాల్గొన్నారు.

## తిమ్మాపూర్‌లో యూరియా లొల్లి. యూరియా కోసం ఉదయం నుంచి సాయంత్రం వరకు రైతుల పడిగాపులు

యాప్ ద్వారా బుక్ చేసుకున్నా అందని యూరియా.. కార్యాలయంలో ఉద్రిక్తత

క్యాలిక్యులేటర్ ధ్వంసం.. ముగ్గురు యువ రైతులను అదుపులోకి తీసుకున్న పోలీసులు.



ఎల్లారెడ్డిపేట అరుణప్రభ న్యూస్:రైతుల పంటలకు అవసరమైన యూరియా కోసం రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం తిమ్మాపూర్ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (సొసైటీ) కార్యాలయం వద్ద ఆదివారం రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులు యూరియా యాప్ ద్వారా ముందుగా బుక్ చేసుకుని, ఎరువుల కోసం తిమ్మాపూర్ సొసైటీ వద్దకు ఉదయం నుంచే చేరుకున్నారు.అయితే ఉదయం నుంచి సాయంత్రం వరకు కార్యాలయం వద్ద వేచి ఉన్నప్పటికీ యూరియా అందకపోవడంతో రైతుల్లో తీవ్ర అసహనం నెలకొంది. యూరియా పంపిణీలో యాప్ కారణంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయని, బుక్ చేసుకున్నప్పటికీ ఎరువు అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.యూరియా కోసం గంటల తరబడి వేచి చూసిన రైతులు చివరకు కార్యాలయంలో ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో కార్యాలయంలో ఉన్న క్యాలిక్యులేటర్ ధ్వంసమైనట్లు సమాచారం. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకున్నారు.ఈ ఘటనకు సంబంధించి ముగ్గురు యువ రైతులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. యూరియా కొరత, యాప్ ద్వారా బుకింగ్‌లో ఎదురవుతున్న సాంకేతిక ఇబ్బందులను వెంటనే పరిష్కరించి, రైతులకు సకాలంలో యూరియా అందించాలని రైతులు కోరుతున్నారు.

# 40 ఏళ్ల రోడ్డు కష్టాలకు చెక్ -- 13వ వార్డులో సీసీ రోడ్లకు శ్రీకారం

**సారపాకను మోడల్ గ్రామపంచాయతీగా తీర్చిదిద్దడమే లక్ష్యం: సర్పంచ్ కిషోర్ శివరాం నాయక్**



సారపాక: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సారపాక మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో అభివృద్ధి పనులకు వేగం పెరిగింది. 13వ వార్డు ప్రగతి విద్యానికేతన్ హైస్కూల్ ప్రాంతంలో ఎన్నో ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని రహదారి సమస్యకు సర్పంచ్ గూగులోత్ కిషోర్ శివరాం నాయక్ చొరవతో పరిష్కారం లభించనుంది. నూతన సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గత 40 ఏళ్లుగా రోడ్డు సౌకర్యానికి నోచుకోని ప్రాంతాలను గుర్తించి, ప్రాధాన్యత క్రమంలో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం అనంతరం అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడం ఆనందంగా ఉందన్నారు. మహాత్మా గాంధీజీ కలలుగన్న స్వరాజ్య స్ఫూర్తితో సారపాక గ్రామపంచాయతీని అభివృద్ధిలో ఆదర్శంగా నిలిచే మోడల్ గ్రామపంచాయతీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. గ్రామ అభివృద్ధికి ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు సమష్టిగా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కన్నెదారి రమేష్ కుమార్, 13వ, 14వ వార్డు సభ్యులు మూలా నవ్య శ్రీరెడ్డి, కొమరం సావిత్రి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పూలపెల్లి సుధాకర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా నేత పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు రాము, ప్రగతి విద్యానికేతన్ కరస్పాండెంట్ సానికొమ్ము చైతన్య రెడ్డి, ప్రగతి బుక్ స్టాల్ అధినేత పత్తి వెంకటరెడ్డి, స్థానిక కాంగ్రెస్ నాయకులు ఓబుల్ రెడ్డి, పోతిరెడ్డి అశోక్ రెడ్డి, రహీం ఖాన్, సదానందం, కృష్ణారెడ్డి, మల్లేష్ రెడ్డి, చందు, పోతిరెడ్డి, సుబ్బారెడ్డి, పందిళ్ళ రాజశేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు

## రూ.60 లక్షలతో రోడ్డు అభివృద్ధి పనులకు శంకుస్థాపన.. కొలన్ హనుమంత్ రెడ్డి



కుత్బుల్లాపూర్, ఆగస్ట్ 16 (అరుణ ప్రభ) కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని 279వ డివిజన్ శ్రీరామ్ నగర్--బి రోడ్డు, మేస్త్రీ నగర్ ప్రాంతాల్లోని 8, 9, 10, 11, 12వ వీధుల్లో రోడ్ల దుస్థితితో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి కొలన్ హనుమంత్ రెడ్డి చొరవతో రోడ్డు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. స్థానికులు తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందించిన హనుమంత్ రెడ్డి, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో సీఎంసీ నిధుల నుంచి రూ.60 లక్షలు మంజూరు చేయించి అభివృద్ధి పనులు చేపట్టేలా చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు కొలన్ హనుమంత్ రెడ్డి సమక్షంలో రోడ్డు అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల మౌలిక వసతుల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రజల సమస్యల పరిష్కారమే తమ ప్రాధాన్యమని, అభివృద్ధి పనుల్లో ఎలాంటి రాజీ ఉండదని పేర్కొన్నారు. రోడ్ల నిర్మాణం పూర్తయిన తర్వాత స్థానిక ప్రజల రాకపోకలు సులభతరం కావడంతో పాటు వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులు కూడా తొలగిపోతాయని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి కాలనీ అభివృద్ధికి అవసరమైన నిధులు తీసుకొచ్చి పనులు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు సిద్ధనోళ్ల సంజీవ్ రెడ్డి, డీసీసీ సెక్రటరీ లాయక్, అజయ్, జమీర్ రహీమ్, కలీమ్, గఫార్, ఖాజా రెహ్మాన్ ఖహీల్, ఎం.డి. ఖలీల్ ఉర్ రెహ్మాన్, హనీఫ్, నవీన్ గౌడ్, యాదగిరి, బుచ్చి రెడ్డి, అంజనేయులు, నరసింహాచారి, విశ్వనాథ్, ప్రభాకర్, అజాజ్, శ్రావణ్, విష్ణువర్ధన్ గౌడ్, కృష్ణ గౌడ్, ప్రభు గౌడ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారం

**ప్రతి సోమవారం ప్రజావాణి ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 వరకు ఎంపీడీవో జమలా రెడ్డి**



అరుణ ప్రభ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సమస్యలను స్థానిక స్థాయిలోనే త్వరితగతిన పరిష్కరించేందుకు తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జి.ఓ.ఎం.ఎస్. నెం.4 మేరకు బూర్గంపహాడ్ మండల పరిషత్ కార్యాలయంలో ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కె. జమలా రెడ్డి తెలిపారు. ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజావాణి కొనసాగుతుందని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల ప్రజలు తమ సమస్యలు, ఫిర్యాదులు, ప్రభుత్వ సేవలకు సంబంధించిన దరఖాస్తులు, వినతిపత్రాలను నేరుగా అధికారులకు సమర్పించవచ్చని తెలిపారు. ప్రజల నుంచి స్వీకరించిన వినతులను సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి, నిబంధనల మేరకు సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటారని వివరించారు. ప్రజావాణికి మండల స్థాయిలోని వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరై సమస్యలను స్వీకరించి పరిష్కారానికి చర్యలు చేపడతారని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, తమ సమస్యలకు సంబంధించిన ఆధారాలతో కూడిన వినతిపత్రాలను నిర్ణీత సమయంలో సమర్పించాలని ఎంపీడీవో జమలా రెడ్డి కోరారు. ప్రజల సమస్యలను వారి వద్దనే విని, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలనే ఉద్దేశంతో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

## జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మికాంత రావు కుమార్తె వివాహ విందుకు హాజరైన సీఎం రేవంత్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ గారు ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి గారు



కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గం బిచ్కుంద మండల కేంద్రంలో జుక్కల్ శాసనసభ్యులు తోట లక్ష్మీకాంత్ రావు గారి కుమార్తె వివాహ విందు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వివాహ విందు కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు, తెలంగాణ రాష్ట్ర పీసీసీ అధ్యక్షులు శ్రీ మహేష్ కుమార్ గౌడ్ గారు లినారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి గారు ముఖ్య అతిథులుగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, ఆనందంగా సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు తదితరులు పాల్గొని నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.



# నేదునూరి పిలుపు సప్తధార! వికసిత భారత్ కు ఆలంభణ కావాలి

(ఎర్రకోట బురుజులపై ఎగిరిన
జండా సాక్షిగా ప్రధానమంత్రి
నరేంద్ర మోడీ చాటిన
నవభారత సంకల్పం .2047
నాటికి వికసిత భారత
లక్ష్యసాధనకు "సప్తదారల"
రూపంలో కొత్త విధానాన్ని
ప్రకటించిన సందర్భంగా
స్పందిస్తూ రాసిన కవిత )

మొదటి ధారబి స్వదేశీ తయారీ
మన దేశంలోనే వస్తువు
తయారీ పెరగాలి
మేకిన్ ఇండియా పేరు
ప్రపంచమంతా మోగాలి

చిన్న వస్తువుల నుండి
పెద్ద యంత్రాల వరకు
భారతీయ ముద్రతో
నవ చరిత్రను రాయాలి
క్వాస్ట్ క్వాలిటీల్లో ప్రపంచ
మార్కెట్ ను శాసించాలి

రెండవ ధారబి రైతు

సంక్షేమం ఆహార ఉత్పత్తులు
పండించే రైతన్నకు అండగా
ఫుడ్ ప్రాసెసింగ్లో విప్లవం
రావాలి
మన మిల్లెట్స్ సుగంధ
ద్రవ్యాలు
పండ్లు ప్రపంచ దేశాల
ఆకలితీర్చే
వైభవం రావాలి.

పోలం నుండి మార్కెట్ దాకా
ప్రగతి పరుగులు తీసి
భారతీయ రుచులు జగమంతా
నిండాలి సరికొత్త ఆహార
సామ్రాజ్యాన్ని నెలకొల్పాలి

మూడవ ధార బిసాంకేతికతఢ
ఆవిష్కరణలు
కంప్యూటర్లు ఏ ఐ క్వాంటమ్
రోబోటిక్స్ రంగాల్లో
దూసుకుపోయే మేధోశక్తి
పెరగాలి
డేటా సెంటర్లలో డిజిటల్
రంగాల్లో
మన యువత ముందడుగు
వేయాలి డిజిటల్ విప్లవానికి
యువత సారథి గా ఎదగాలి

సెమీకండక్టర్ లు తయారీలో
దేశం అగ్రగామిగా నిలవాలి
కొత్త పరిశోధనలతో సరికొత్త
ఆవిష్కరణలు చేస్తూ
ప్రపంచ సాంకేతిక వేదికపై
భారత కీర్తి వెలగాలి

నాల్గవ ధార బిగతి శక్తి
గతి శక్తి అనుసంధానం
ఆధునిక రహదారులు
వేగవంతమైన రైళ్ళు రావాలి
దేశం నలుమూలల రవాణా
సౌకర్యం పెరగాలి
సమయం దూరం తగ్గించే
మౌలిక వసతులతో
ప్రగతి ప్రయాణం వేగంగా
సాగిపోవాలి

ఐదవ ధారబి రక్షణ శక్తి

మన ఆయుధాలు మనమే
తయారు చేసుకోవాలి
రక్షణ రంగంలో దేశం ఆత్మ
నిర్భరత సాధించాలి

ఆధునిక డ్రోన్లు సరికొత్త
సాంకేతిక బలంతో
శత్రువుల గుండెల్లో
వణుకు పుట్టించాలి
సైబర్ సెక్యూరిటీ బలంతో
అజేయ శక్తిగా భారత్
నిలవాలి

ఆరవ ధార బిగ్రీన్డ బ్లూ




ఎకనామి

గ్రీన్ హైడ్రోజెన్ పునరుత్పాదక
ఇంధనంతో పర్యావరణాన్ని
రక్షించాలి ప్రకృతి కాపాడు
కుంటూనే సంపదను పెంచాలి.

గ్రీన్ ఎనర్జీ సోలార్ పవర్ తో
ఇంధన లోటు తీర్చాలి
సముద్రతీరాలను సాగర
సంపదను వాడుకుంటూ
సుస్థిర మైన భవిష్యత్తుకు
పునాదులు వేయాలి

సముద్రతీరల అభివృద్ధి బ్లూ
ఎకనమీ తో సాగర సంపదను
పెంచాలి

ఏడవ దార బిభారత
సంస్కృతి స్టార్ట్ పవర్

యోగ ఆయుర్వేదం
ఆధ్యాత్మికతతో ప్రపంచ
దేశాల ఆరోగ్యం పెంచాలి
మన హస్త కళలు సంస్కృతి
మన కలలు సృజనాత్మకత
సినిమాలు ఆరోగ్య సంరక్షణ
క్రీడలు పర్యాటక రంగంలో
ముందుకు సాగాలి
జగమంతా విస్తరించాలి

భారతీయ జీవన విధానమే
శాంతి సందేశంగా విశ్వమంతా
గుర్తింపు పొందాలి

కోటి మందికి ఏఐ లో శిక్షణ
భారత దేశం కృత్రిమ మేధస్సు
ప్రపంచానికి నాయకత్వం
వహించాలన్న దేశ ప్రధాని
మోడీ ఆకాంక్షలు నెరవేర్చడం
పౌరసమాజం బాధ్యతగా
చేబడుదాం

వికసిత భారత్ లక్ష్య
సాధనా యజ్ఞంలో సంపూర్ణ
భాగస్వాములమౌదాం
భారత్ ను విశ్వ గురువు
స్థాయికి చేర్చుదాం

ఈ ఏడు ధారలు పరస్పరం
ముడివడిన సమష్టి శక్తులు.
ఈ ఏడు దారల కలయికే
వికసిత భారత్ కు
అసలైన ఆలంబన
వికసిత భారత నిర్మాణం
ప్రతి ఒక్కరిసామాజిక
బాధ్యత చేయి చేయి
కలుపుదాం
దేశం కోసం శ్రమిద్దాం

2047నాటికి స్వర్ణ
భారత్ ను ఆవిష్కరిద్దాం
నవ భారత జెండాను
విశ్వశిఖరాన ఎగరేద్దాం.

నేదునూరి కనకయ్య
అధ్యక్షులు తెలంగాణ
ఎకనామిక్ ఫోరం
మాజీ ఎన్ ఎస్ ఎస్ అధికారి
రచయిత కాలమిస్ట్
హైదరాబాద్9440245771



# రాజేంద్రనగర్ డివిజన్ హైదరాబాద్

**ఘణంగా జరిగిన 80 వ స్వాతంత్ర్యదినోత్సవవేడుకలు**

**అమరుల స్పూర్తితో వికసిత భారత్ లక్ష్య సాధనకు ఉద్యమిద్దాం**




నేదునూరి కనకయ్య ప్రముఖ పత్రికా రచయిత కాలమిస్ట్ రాష్ట్ర అధ్యక్షులు తెలంగాణ ఎకనామిక్ ఫోరం ముఖ్య అతిథియువతదేశ స్వాతంత్ర ఫలితాలు సామాన్యుని చెంతకు చేర్చి అవినీతి రహిత నేర రహిత సమాజం రాజ్యాంగ విలువల పరిరక్షణ సామాజిక సమానత్వం మహిళా యువజన సాధికారిత పర్యావరణ రక్షణ రంగాల్లో ఆలోచనా విప్లవం రావాలని సామాజిక ఆర్థిక మార్పు ప్రక్రియలో భాగస్వాములమైఅమరుల స్ఫూర్తితో వికసిత భారత్ లక్ష్య సాధనకు ఉద్యమించడమేస్వతంత్ర్య సమరయోధుల ఆశయాల సాధనకు కృషి చేయడమే నిజమైన నివాళి అని ప్రముఖ పత్రికా రచయిత కాలమిస్ట్ తెలంగాణ ఎకనామిక్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు నేదునూరి కనకయ్య అన్నారు. నేడు అత్తాపూర్ లక్ష్మీనగర్ పార్క్ లో లక్ష్మీ నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అత్తాపూర్ యోగ సెంటర్ వాకర్స్ అసోసియేషన్ఆధ్వర్యంలో 80 వ స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలు ఘణంగా లక్ష్మీ నగర్ పార్కు అధ్యక్షులుఅత్తాపూర్ యోగా సెంటర్ గురువు పి మహేందర్ అధ్యక్షతన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరుగగా ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ ఎకనామిక్



ఫోరం రాష్ట్ర అధ్యక్షులు నేదునూరి కనకయ్య మాట్లాడుతూ భగత్ సింగ్ ధైర్యాన్ని ఆజాద్ నిర్భయత్వాన్ని సుభాస్ చంద్ర బోస్ అచంచల సంకల్ప బలాన్ని యువతతమ మార్గంగా ఎంచుకొని దేశ నిర్మాణంలో యువత చురుకుగా పాల్గొనాలి. ఆత్మగౌరవం దేశభక్తి ధైర్యం త్యాగం న్యాయం కోసం నిలబడే సంకల్పం తోసమాజ మార్పులో తరించాలని పిలుపు నిచ్చారు.

వేడుకలకు అధ్యక్షత వహించిన అత్తాపూర్ యోగ సెంటర్ గురువు పి మహేందర్ మాట్లాడుతూ పౌర సమాజం పేదరికం ఆర్థిక అసమానతలు తగ్గించే కృషిలో క్రియాశీలక భాగస్వాములు కావాలని యోగ ధ్యానము జీవనశైలి అయినపుడు మాత్రమే ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని అన్నారు. జెండా ఆవిష్కరణ అనంతరం ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ వేడుకల్లో దుర్యోధన పాత్ర దారి మురళి కృష్ణ నటన విశేషంగా ఆకట్టుకుంది. చిన్నారులు ప్రదర్శించిన భరత నాట్యంపి మహేందర్ లక్ష్మీ చంద్ర రెడ్డి బృందం ప్రదర్శించిన ఎం ఎల్ ఏ ఏడుకొండలు నాటిక ప్రేక్షకులను అలరించాయి. ఈ వేడుకల్లో ఏం ప్రభాకర్ యు నరసింహారావు తిమ్మారెడ్డి నరసింహా కుమార్ రెడ్డి బోజి రెడ్డిఅత్తాపూర్ యోగా సెంటర్ సభ్యులు హాజరై స్వాతంత్ర సమర యోధులకు నివాళులు అర్పించారుఅత్తాపూర్ లక్ష్మీ నగర్ పార్క్ లో అత్తాపూర్ యోగ సెంటర్ వాకర్స్ అసోసియేషన్ఆధ్వర్యంలో జండా ఆవిష్కరణ వేడుకల్లో పాల్గొన్న తెలంగాణ ఎకనామిక్ ఫోరం అధ్యక్షులు నేదునూరి కనకయ్య నరసింహారావు మహేందర్ మురళి కృష్ణ తదితరులుఇట్లునేదునూరు కనకయ్య అడ్వైసర్అత్తాపూర్ యోగా సెంటర్ అడ్వైసర్అత్తాపూర్9440245771

## వివాహ వేడుకల్లో పాల్గొన్న గౌరవ నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి గారు



నారాయణఖేడ్ నియోజకవర్గంరాయికోడ్ మండల కేంద్ర ఆప్తులు జంబ్గీ వినయ్ కుమార్ గారి కుమార్తె వివాహ వేడుకలు రాయికోడ్ ౦౦ పాటిల్ గార్డెన్ వేదికగా పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేసిన గౌరవ నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి గారు ఈ వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే గారితో పాటు నరసింహ రెడ్డి జణజ మాజీ చైర్మన్,అల్కారి దుర్గయ్య తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు .

## నడిపల్లి తండాలో ఘనంగా తీజ్ పండుగ.

## డిచ్ పల్లి మండలం నడిపల్లి తండాలో ఘనంగా తీజ్ పండుగ



బంజారుల కట్టుబొట్టు సంస్కృతీ సంప్రదాయాలకు తీజ్ పండుగ ప్రతీకగా నిలుస్తున్నది. గిరిజనుల ఆచారాలు, పండుగలు, సాంప్రదాయాలు ప్రత్యేకంగా ఉంటాయి. గిరిజనులు (బంజారులు) నిర్వహించుకునే ప్రతి పండుగకూ ఓ ప్రత్యేకత ఉంటుంది. ప్రతి ఏడాది శ్రావణమాసంలో తీజ్ పండుగను ఘనంగా నిర్వహిస్తారు. గిరిజన సాంప్రదాయ బద్ధంగా నిర్వహించుకునే పండుగల్లో తీజ్‌కు ప్రత్యేక స్థానం ఉంది. బంజారుల సంస్కృతిని కాపాడుతూ ప్రకృతిని ఆరాధించే మొలకల పండుగ సందడి నడిపల్లి తండాలో ఘనంగా నిర్వహించారు.పెండ్లికాని యువతులు తొమ్మిదిరోజులపాటు భక్తిశ్రద్ధలతో మట్టిని, మొలకలను ఆరాధిస్తారు. బంజారా మహిళలు, యువతుల ఆటపాటలు, నృత్యాలు, భక్తిభావంతో తొమ్మిదిరోజులపా టు ఉపవాసాలు ఉండి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు బాగా పడాలని, తండాలు, గ్రామాల్లోని ప్రజలు సుభిక్షంగా ఉండాలని, పశువులకు ఎలాంటి వ్యాధులు సోకవద్దని కోరుతూ పూజిస్తారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న యువతి, యువకులు, తండా పెద్దమనుషులు, నాయక్ కార్ భారీ, సర్పంచ్, ఉప సర్పంచ్ పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో ఘటం కుండ సమర్పణ భౌరంపేట్ బంగారు మైసమ్మ తల్లి బోనాల ఉత్సవాల్లో భక్తుల సందడి



దుండిగల్, ఆగస్ట్ 16 (అరుణ ప్రభ) కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ సర్కిల్ పరిధిలోని భౌరంపేట్ గ్రామంలో శ్రీ శ్రీ శ్రీ భౌరంపేట్ బంగారు మైసమ్మ తల్లి బోనాల ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన ఘటం కుండ సమర్పణ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.శ్రావణ మాస బోనాల సందర్భంగా ఏటా నిర్వహించే సంప్రదాయం ప్రకారం గౌడ కులస్తుల ఇంటి నుంచి ఘటం కుండను ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు మేళతాళాల నడుమ ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చారు. భక్తులు అమ్మవారి నామస్మరణలతో, జైజైధ్వానాలతో గ్రామ వీధుల గుండా ఘటం కుండను తీసుకువెళ్లి ఆలయంలో సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది.అనంతరం ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, గ్రామంలో శాంతి, సౌభాగ్యం, సమృద్ధి వెల్లివిరియాలని భక్తులు అమ్మవారిని ప్రార్థించారు.కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, భక్తులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేశారు.

## ఎంగేజ్మెంట్ వేడుకల్లో పాల్గొన్న గౌరవ నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి గారు పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు గారు



నారాయణఖేడ్ నియోజకవర్గంమానూర్ మండల పరిధిలోని తిమ్మాపూర్ గ్రామ ఆప్తులు కీర్తిశేషులు రాజు గారి కుమారుడు నితేష్ (రాణ= మెడికల్) గారి ఎంగేజ్మెంట్ వేడుకలు బసవ మండపం వేదికగా



పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేసిన గౌరవ నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి గారు పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు గారువారితో పాటు పండరి రెడ్డి మాజీ ఎంపీటీసీ,ప్రభాకర్ రెడ్డి మాజీ సర్పంచ్,దిగంబర్ రావు, సుభాష్ రావు,విష్ణువర్ధన్ రెడ్డి సర్పంచ్, శ్రీనివాస్ రెడ్డి,మారుతి, తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు

## ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ వేడుకల్లో పాల్గొన్న గౌరవ నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి గారు





నారాయణఖేడ్ నియోజకవర్గంమానూర్ మండల పరిధిలోని దోసపల్లి గ్రామానికి చెందిన లబ్ధిదారురాలు శ్రీమతి అపరంజి (భర్త: సుధాకర్) నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ మహోత్సవానికి గౌరవ నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి గారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన నూతన గృహాన్ని ప్రారంభించి, కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... అర్హులైన ప్రతి పేద కుటుంబానికి గూడు కల్పించాలనే సంకల్పంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని పారదర్శకంగా అమలు చేస్తోందని పేర్కొన్నారు. పేదల సంక్షేమం, గ్రామాల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగవంతంగా సాగుతున్నాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో బిరాదర్ దత్తు దోసపల్లి గ్రామ సర్పంచ్,స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## నారాయణఖేడ్ జర్నలిస్టుల సమావేశం నూతన కమిటీ ఎన్నికకు ఏర్పాట్లు



నారాయణఖేడ్‌లో జర్నలిస్టుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సంగారెడ్డి జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు సయ్యద్ ఆసిఫ్, జిల్లా జాయింట్ సెక్రటరీ అబ్దుల్ రౌఫ్, ఈసీ మెంబర్ హసీబ్ పటేల్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సయ్యద్ ఆసిఫ్ మాట్లాడుతూ.. త్వరలో జరగనున్న నూతన కమిటీ ఎన్నికను ఏకగ్రీవంగా నిర్వహించేందుకు జర్నలిస్టులందరూ ఏకతాటిపైకి రావాలని కోరారు. వచ్చే నెల 6వ తేదీ ఆదివారం జరగనున్న నియోజకవర్గ కార్యవర్గ సమావేశాన్ని జర్నలిస్టులందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యవర్గ సమావేశానికి రాష్ట్ర, జిల్లా నాయకులు ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని సూచించారు.జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం కోసం నిరంతరం పోరాడుతున్న ఏకైక యూనియన్ అని సయ్యద్ ఆసిఫ్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు, యూనియన్ బాధ్యులు ఎం.ఏ. అలీమ్, జీవన్ రావు, వెంకటేశం, విఠల్, ఇస్తారీ వెంకటేశం, అశోక్, సత్తార్, జావిద్, సత్యం, భూమయ్య, కౌసర్, నాథేక్, సంజీవ్, బుగుడాల రాములు , రషీద్, సంతోష్, సంగమేశ్వర్ రెడ్డి, సంగప్ప సంజు ని సార్ హబీబ్ అంబాదాస్ మాణిక్ తదితర జర్నలిస్టు మిత్రులు పాల్గొన్నారు.

# అక్రమ నిర్మాణాలపై ప్రశ్నిస్తే సమాధానాలు చెప్పరా?

### "ప్రజా సమస్యలపై రాయండి.. అక్రమ నిర్మాణాలపై మమ్మల్ని ప్రశ్నించొద్దు" అన్నట్లు ఏసీపీ వ్యాఖ్యలపై దుమారం

### ప్రైవేటు స్థలం అయినా నిబంధనలు వర్తించవా? అధికారుల తీరుపై విచారణకు స్థానికుల డిమాండ్

శేరిలింగంపల్లి, ఆగస్టు 16 (అరుణ ప్రభ):నల్లగండ్ల హుడా కాలనీలో నివాస ప్రాంతాల మధ్య నిబంధనలకు విరుద్ధంగా వాణిజ్య షెడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయన్న ఫిర్యాదులపై వరుసగా పత్రికా కథనాలు వెలువడుతున్నప్పటికీ సంబంధిత అధికారులు స్పందించడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదే అంశంపై వివరణ కోరిన పత్రికా ప్రతినిధితో శేరిలింగంపల్లి టౌన్‌ప్లానింగ్ విభాగానికి చెందిన అసిస్టెంట్ సిటీ ప్లానర్ (ఏసీపీ) సురేందర్ రెడ్డి మాట్లాడిన తీరుపై కూడా స్థానికంగా చర్చ జరుగుతోంది.స్థానికుల ఫిర్యాదుల ఆధారంగా నిర్మాణాలపై వాస్తవ పరిస్థితిని తెలుసుకునేందుకు పత్రికా ప్రతినిధి అధికారులను సంప్రదించినట్లు సమాచారం. గతంలో ఇన్‌చార్జ్ ఏసీపీని సంప్రదించగా నిర్మాణాలకు నోటీసులు జారీ చేశామని చెప్పినట్లు ప్రతినిధి పేర్కొన్నారు. అనంతరం ప్రస్తుత ఏసీపీ బాధ్యతలు స్వీకరించిన సమయంలో వివరణ కోరగా, తాను కొత్తగా బాధ్యతలు చేపట్టానని, విషయాన్ని పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పినట్లు తెలిపారు.అయితే కొద్దిరోజుల అనంతరం నిర్మాణాలు కొనసాగుతున్నాయన్న స్థానికుల ఫిర్యాదుల నేపథ్యంలో మళ్లీ అధికారులను సంప్రదించినట్లు ప్రతినిధి తెలిపారు. సంబంధిత టీపీఓను ప్రశ్నించగా పనులు నిలిపివేశామని చెప్పినప్పటికీ, క్షేత్రస్థాయిలో నిర్మాణ పనులు కొనసాగుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయని పేర్కొన్నారు.



టీపీఓ. అక్బర్

### "అక్రమ నిర్మాణాలపై ప్రశ్నించొద్దు" అన్నారా?


ఇదే విషయంపై ఏసీపీని మరోసారి వివరణ కోరగా, "అక్రమ నిర్మాణాలపై మమ్మల్ని ప్రశ్నించొద్దు.. ఏదైనా ఉంటే ప్రజా సమస్యలపై రాయండి" అనే భావనలో సమాధానం ఇచ్చినట్లు పత్రికా ప్రతినిధి వెల్లడించారు. అలాగే తన పరిధిలో అనేక పనులు ఉన్నాయని, సర్కిల్ మొత్తాన్ని తానే పర్యవేక్షించాల్సి ఉంటుందని అధికారి చెప్పినట్లు తెలిపారు.అయితే ఈ వ్యాఖ్యలపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు అందిన నిర్మాణాల అంశాన్ని పత్రికలు ప్రస్తావించడం కూడా ప్రజా సమస్యలపైనే కదా? అని వారు ప్రశ్నిస్తున్నారు. నివాస ప్రాంతాల్లో వాణిజ్య కార్యకలాపాలకు అనుగుణంగా నిర్మాణాలు చేపడుతున్నారన్న ఫిర్యాదుల నేపథ్యంలో వాస్తవ పరిస్థితిని అధికారికంగా వెల్లడించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని పేర్కొంటున్నారు.

### ప్రైవేటు స్థలం అంటే నిబంధనలకు మినహాయింపా?

నిర్మాణం జరుగుతున్న స్థలం ప్రైవేటు వ్యక్తికి చెందినదా కాదా అన్నది ఒక అంశమైతే, ఆ స్థలంలో చేపడుతున్న నిర్మాణాలకు సంబంధిత అనుమతులు ఉన్నాయా? అనుమతించిన వినియోగానికి అనుగుణంగానే నిర్మాణం జరుగుతోందా? భవన నిర్మాణ నిబంధనలు పాటిస్తున్నారా? వాణిజ్య కార్యకలాపాలకు అవసరమైన అనుమతులు ఉన్నాయా? అనేవి పరిశీలించాల్సిన అంశాలని స్థానికులు అంటున్నారు.ప్రైవేటు స్థలంలో నిర్మాణం జరుగుతోందనే కారణంతో ప్రభుత్వ నిబంధనలు వర్తించవని భావించడం సరికాదని వారు పేర్కొంటున్నారు. అనుమతులకు విరుద్ధంగా నిర్మాణం జరిగితే సంబంధిత చట్టాలు, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉంటుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

### ఫిర్యాదులు, కథనాలున్నా చర్యలు ఎక్కడ?

నల్లగండ్ల హుడా కాలనీకి చెందిన స్థానికులు, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు ఈ నిర్మాణాలపై సంబంధిత ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసినట్లు చెబుతున్నారు. ఫిర్యాదుల ఆధారంగా పత్రికల్లోనూ వరుసగా కథనాలు ప్రచురితమైనప్పటికీ ఇప్పటివరకు స్పష్టమైన చర్యలు కనిపించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికే నోటీసులు జారీ చేశామని అధికారులు చెబుతున్నట్లయితే, ఆ నోటీసుల అనంతరం నిర్మాణ పనులు పూర్తిగా నిలిచిపోయాయా? లేదా నిబంధనలకు విరుద్ధంగా పనులు కొనసాగుతున్నాయా? అనే విషయాన్ని క్షేత్రస్థాయిలో అధికారులు తనిఖీ చేసి స్పష్టం చేయాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.



ఏసీపీ. సురేందర్ రెడ్డి


ఆదాబ్ హైదరాబాద్
హుడా 100 ఫీట్ రోడ్డుపై పెరుగుతున్న డ్రైవ్-ఇన్ హోటళ్లు.. కాలనీవాసుల్లో ఆందోళన

పార్కింగ్ సౌకర్యం లేకుండా డ్రైవ్-ఇన్ హోటళ్లు ఏర్పాటు చేస్తే భవిష్యత్తులో సమస్యలు మరింత పెరిగే అవకాశ ముందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఇలాంటి నిర్మాణాలకు సంబంధించి అనుమతులు, పార్కింగ్ నిబంధనలు పాటిస్తున్నారా లేదా అనే విషయాన్ని శేర్లింగంపల్లి సిఏంసి టౌన్ ప్లానింగ్ అధికారులు పరిశీలించాలని, నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే తగిన చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు, నల్లగండ్ల హుడా రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్, శేర్లింగంపల్లి సిఏంసి టౌన్ ప్లానింగ్ వారిని కోరుతున్నారు.


ఎస్.వి.ఆర్ విధుల పేరుతో అక్రమ నిర్మాణాలకు అండా?

ఇతర పత్రికల్లో కథనలు




వరుస కథనాలు

### అధికారుల వ్యవహారశైలిపై విచారణకు స్థానిక ప్రజల డిమాండ్

అక్రమ నిర్మాణాలపై వచ్చిన ఫిర్యాదులపై ఇప్పటివరకు తీసుకున్న చర్యలేమిటి? సంబంధిత నిర్మాణాలకు అనుమతులు ఉన్నాయా? ఉంటే ఏ మేరకు అనుమతులు మంజూరయ్యాయి? ప్రస్తుతం జరుగుతున్న నిర్మాణాలు ఆ అనుమతుల పరిధిలోనే ఉన్నాయా? అనే అంశాలపై సమగ్ర విచారణ జరపాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.అదేవిధంగా పత్రికా ప్రతినిధి వివరణ కోరిన సందర్భంలో ఏసీపీ చేసినట్లు పేర్కొంటున్న వ్యాఖ్యలపై కూడా ఉన్నతాధికారులు వాస్తవాలను పరిశీలించాలని వారు కోరుతున్నారు. అధికారులపై వ్యక్తిగత ఆరోపణలు చేయడం తమ ఉద్దేశం కాదని, ప్రజల ఫిర్యాదులపై సంబంధిత శాఖ అధికారికంగా స్పందించి వాస్తవ పరిస్థితిని ప్రజలకు తెలియజేయాలన్నదే తమ అభిప్రాయమని స్థానికులు చెబుతున్నారు.

### అధికారుల వివరణతోనే వాస్తవం స్పష్టం

ఈ వ్యవహారంలో ఆరోపణలు, ప్రత్యారోపణలకు బదులుగా సంబంధిత టౌన్‌ప్లానింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి నిర్మాణాలకు సంబంధించిన అనుమతులు, భవన వినియోగం, నిబంధనల అమలు తదితర అంశాలపై అధికారిక వివరాలను వెల్లడించాల్సిన అవసరం ఉంది. నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని, ఉల్లంఘనలు లేవని తేలితే అదే విషయాన్ని స్పష్టంగా ప్రకటించాలని స్థానికులు కోరుతున్నారు.పత్రికా ప్రతినిధితో ఏసీపీ మాట్లాడినట్లు పేర్కొంటున్న వ్యాఖ్యలపై కూడా సంబంధిత ఉన్నతాధికారులు వాస్తవాలను పరిశీలించి తగిన



టీపీఓ. అక్బర్

విధంగా స్పందిస్తే వివాదానికి తెరపడే అవకాశం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

# బోడుప్పల్లో దేవాలయ భూములు అన్యాక్రాంతం

రేపటి తరాలకు లేకుండా చేస్తున్న పార్కులు కబ్జాలను కాపాడలేని అధికారులు

దేవాలయ,పార్కు స్థలాల కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలిపార్టీల నాయకులు కబ్జాలు చేస్తే పార్టీల నుంచి సస్పెండ్ చేయాలితిరుమల మెడోస్ లో కబ్జా స్థలాలను పరిశీలించిన ఫెడరేషన్ బృందం

కబ్జాలకు సహకరించిన అధికారులు, నాయకుల పైన చర్యలు ఉంటాయి – బోడుప్పల్ ఫెడరేషన్ చైర్మన్ డాక్టర్ రాపోలు రాములు





ఆగస్టు 16, అరుణ ప్రభ...మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని తిరుమల మెడోస్ కాలనీలోని సర్వే నంబర్ 215లో గల పార్కు, గుండి పోచమ్మ దేవాలయ స్థలాలను అక్రమ కబ్జాలు, రిజిస్ట్రేషన్లపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై కేసులు నమోదు చేయాలని బోడుప్పల్ ఫెడరేషన్ చైర్మన్ డాక్టర్ రాపోలు రాములు డిమాండ్ చేశారు. కబ్జాలకు పాల్పడిన వారు ఏ రాజకీయ పార్టీకి చెందిన వారైనా వారిని పార్టీ నుంచి శాశ్వతంగా సస్పెండ్ చేయాలని కోరారు. ఆదివారంతిరుమల మెడోస్ కాలనీలో ఫెడరేషన్ బృందంతో కలిసి సర్వే నంబర్ 215లోని స్థలాలను ఆయన పరిశీలించారు. పార్కు, దేవాలయానికి కేటాయించిన స్థలాలను కబ్జా చేసి రిజిస్ట్రేషన్లు చేసుకున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న మేడిశెట్టి వెంకటేశ్వర్, ఏ. శ్రీనివాస్ గుప్తా, వారి బంధువులపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. స్థలాల అసలు స్వరూపం, కేటాయింపులు, రిజిస్ట్రేషన్లకు సంబంధించిన రికార్డులను పరిశీలించి నిజానిజాలు వెలుగులోకి తేవాలని అధికారులను కోరారు. ప్రజా ప్రయోజనాలకు కేటాయించిన పార్కు, దేవాలయ స్థలాలను పరిరక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, పార్కులను పరిరక్షించాల్సిన అధికారులు నాయకులే భక్షకులుగా మారారని రాపోలు రాములు అన్నారు. కబ్జాలకు సంబంధించి అధికారుల నిర్లక్ష్యం ఏమైనా ఉందా అనే కోణంలోనూ విచారణ జరపాలని, అక్రమాలు నిర్ధారణ అయితే సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతోపాటు స్థలాలను తిరిగి ప్రజా ప్రయోజనాలకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా బోడుప్పల్ పరిధిలో జరిగే పార్కు స్థలాల కబ్జాలపై ఫెడరేషన్ పోరాడుతుందని, త్వరలోనే తిరుమల మెడల్స్ కాలనీ పార్కులకు కబ్జాలపై న్యాయస్థానాన్ని సంప్రదిస్తామని, ప్రజల ఆస్తులను పరిరక్షిస్తూ కబ్జాకోరులకు శిక్ష పడే వరకు ఫెడరేషన్ కఠిన చర్యలు తీసుకుంటుందని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ వైస్ చైర్మన్ ఏడ్ల శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గడ్డం యాదగిరి, కోశాధికారి బజ్జూరి శ్రీనివాస్‌గుప్తా, మధుసూదన్, వెంకటస్వామి, కాలనీ ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, కాలనీవాసులు కుమారస్వామి, శివశంకర్, సతీష్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పి.హరినాథ్ రెడ్డి జన్మదిన వేడుకలు

శుభాకాంక్షలు తెలిపిన మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, అభిమానులు





బోడుప్పల్, ఆగస్టు 16 (పద్మక్రాంతి):మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పి హరినాథ్ రెడ్డి జన్మదిన వేడుకలు ఆయన నివాసంలో ఘనంగా జరిగాయి. ఈ వేడుకలలో మేడ్చల్ జిల్లా డిసిసి అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు డాక్టర్ రాపోలు రాములు, మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు పోగుల నర్సింహారెడ్డి, మేడిపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి, బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొమ్మక్ కళ్యాణ్, మాజీ కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు, బోడుప్పల్ ఫెడరేషన్ సభ్యులు, ఆంజనేయ నగర్ కాలనీ అసోసియేషన్ సభ్యులు, బంధుమిత్రులు హరినాథ్ రెడ్డిని ఘనంగా సన్మానించి, పుష్పగుచ్ఛం అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండే రాజకీయంగా భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానానికి ఎదగాలని ప్రజలకు మెరుగైన సేవలు చేయాలని వారు ఆకాంక్షించారు.

# స్వాతంత్ర్య దినోత్సవం రోజు మున్సిపల్ కార్మికుల కు సెలవు లేదా!

బోడుప్పల్లో 391వ వారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కు జ్ఞానమాల

అసైన్డ్ భూముల యాజమాన్య హక్కు డిక్లరేషన్ కోసం ధర్నా కరపత్రం విడుదల

తెలంగాణ భూ రక్షణ సమితి ఆధ్వర్యంలో ఆగస్టు 31న ఇంద్ర పార్క్ వద్ద ధర్నా



ఆగస్టు 16 అరుణ ప్రభ.... మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్లో అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి 391వ ఆదివారం జ్ఞానమాల కార్యక్రమం ఘనంగా జరిగింది. తెలంగాణ భూ రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు బుగ్గ మైసయ్య ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా దళితులకు అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కు డిక్లరేషన్ కోసం ఆగస్టు 31 సోమవారం ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద నిర్వహించే సదస్సు కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా నత్తి మైసయ్య మాట్లాడుతూ 80 ఏళ్ల స్వాతంత్ర భారతంలో ఆగస్టు 15 స్వాతంత్ర దినోత్సవం రోజు మున్సిపల్ కార్మికులకు సెలవు ఇవ్వకుండా అధికారులు వారితో పని చేయిస్తున్నారని, అందరితో సమానంగా ఆగస్టు 15 జనవరి 26న స్వచ్ఛ సెలవు దినంగా ప్రకటించాలని అధికారులకు రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశాడు. అదేవిధంగా దళితుల ఆర్థిక అభివృద్ధి కోసం ఇందిరాగాంధీ హయాంలో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం దళితులకు భూములు కేటాయించిందని, నేడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అసైన్డ్ భూముల రైతులకు యాజమాన్య హక్కులు కల్పించాలని తెలంగాణ భూ రక్షణ సమితి ఆధ్వర్యంలో జరిగే సదస్సును విజయవంతం చేయాలని నత్తి మైసయ్య పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గరుగుల యాకయ్య, రాపోలు వెంకటేష్, రఘురూపుల మల్లేష్, రాజేష్ , పవన్,వి రామకృష్ణ, చిల్ల అంజయ్య, జె శ్రీనివాస్, బొట్టు శ్రీనివాస్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ మైరమ్మ అమ్మవారి దేవాలయమును దర్శించుకున్న రమేష్ నాయక్



. అరుణ ప్రభ, దిండి ,ఆగస్టు 16 ,దేవరకొండ నియోజకవర్గం పరిధిలోని దిండి మండలంలోని బురాన్పూర్ గ్రామపంచాయతీ పరిధిలో, కొలువైన బంజారాల ఆరాధ్య దైవం శ్రీ మై రమ్మ అమ్మవారి దేవాలయమును ఆదివారం బి ఆర్ఎస్ దేవరకొండ నియోజకవర్గం నాయకులు వర్త్య రమేష్ నాయక్ దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం ఆలయ కమిటీ సభ్యులు రమేష్ నాయకు ను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో బి ఆర్ఎస్ పార్టీ నాయకులు వెంకటేష్, అరుణ్, గణేష్ ,భాస్కర్, గోపాల్, జయరాం ,కళ్యాణ్, లక్ష్మణ్, నాయక్ ,పాండు ,జైపాల్, కృష్ణ, సేవ్య ,శ్రీనివాస్, చందు, రాజు తదితరులు పాల్గొన్నారు.

# డీఏ ల్యాండ్‌స్కేప్ కాంట్రాక్టర్ గులాంను అభినందించిన సీఎం రేవంత్ రెడ్డి



ఎల్లారెడ్డిపేట, అరుణప్రభ న్యూస్: ములుగు జిల్లా కేంద్రంలో చేపట్టిన నూతన సుందరీకరణ పనుల్లో భాగంగా జంక్షన్లను ఆధునికంగా తీర్చిదిద్దడంతో పాటు ఆకట్టుకునే కళాకృతులను రూపొందించిన డీఏ ల్యాండ్‌స్కేప్ ప్రముఖ కాంట్రాక్టర్ గులాంను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదివారం



అభినందించారు.ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన ప్రముఖ డీఏ ల్యాండ్‌స్కేప్ కాంట్రాక్టర్ అజీజ్ భాయ్ తనయుడు గులాం ములుగు జిల్లా కేంద్రంలో పలు సుందరీకరణ పనులను చేపట్టారు. ఇందులో భాగంగా రూపొందించిన కళాకృతులను సీఎం రేవంత్ రెడ్డి ఆదివారం ప్రారంభించారు.ఈ సందర్భంగా కళాకృతులను పరిశీలించిన సీఎం రేవంత్ రెడ్డి వాటి రూపకల్పన, సుందరీకరణ పనులను ప్రశంసించారు. కళాకృతులు ఆకట్టుకునేలా ఉన్నాయని గులాంను అభినందించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి సీతక్కతో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# తప్పుడు కేసులకు భయపడే ప్రసక్తే లేదు ..!

. వైసీపీ ఇన్చార్జి బూదూరు గురవయ్య



గూడూరు – (అరుణ ప్రభ న్యూస్ ):గూడూరు నియోజకవర్గంలో భూముల ఆక్రమణలపై విచారణ చేయిస్తామని ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామని గూడూరు నియోజకవర్గ వైసిపి ఇన్చార్జి గురవయ్య వెల్లడించారు.గూడూరు పట్టణంలో జరిగిన విలేకరుల సమావేశంలో వైసిపి నియోజకవర్గ ఇంచార్జిగురవయ్య మాట్లాడుతూ మోమిడి గ్రామంలో జరిగిన సమావేశంలో మేము అడిగినవిషయాలకు ఎమ్మెల్యే పొంతన లేకుండా సమాధానమిచ్చారని తెలిపారు. నియోజకవర్గం లో ఎమ్మెల్యే అండతో కొంతమంది పోలీసులు వైసీపీ నాయకులు కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతూ ఇబ్బంది గురి చేస్తున్నారని అన్నారు. క్రిస్ సిటీ , కడివేడు పేదల భూములను టిడిపి నాయకులు, కార్యకర్తలు వారి పేరు మీద నమోదు చేసుకున్నారని భూ అక్రమాలపై ఎమ్మెల్యే విచారణ జరిపిస్తాము అన్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు . కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న అక్రమాలను నిరంతరం ప్రశ్నిస్తూనే ఉంటామని ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదని వెల్లడించారు. ఈ సమావేశంలో అట్లా శ్రీనివాసులు రెడ్డి, మన్యం శ్రీనివాసులు, జనార్ధన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా శిఖర ప్రతిష్ఠా కుంభాభిషేక ఉత్సవాలు



గూడూరు – (అరుణ ప్రభ న్యూస్ ):గూడూరు పట్టణంలోని శ్రీకృష్ణ ధర్మరాజు స్వామి దేవస్థానంలో శిఖర ప్రతిష్ట కుంభాభిషేక ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ దేవస్థానానికి విచ్చేసి స్వామి అమ్మవారిని దర్శించుకున్నారు .గూడూరు పట్టణంలోని శ్రీకృష్ణ ధర్మరాజు స్వామి దేవస్థానంలో కుంబాభిషేక పూజా కార్యక్రమాలు వైభవంగా సాగుతున్నాయి ఎమ్మెల్యే సునీల్ కుమార్ ఆలయానికి విచ్చేశారు. అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యే స్వామి అమ్మవారిని దర్శించి పూజల నిర్వహించారు. ఆలయ చైర్మన్ వాటంబేడు శివకుమార్ ఈవో రవి కృష్ణ ఎమ్మెల్యే ని ఘనంగా సన్మానించి ప్రసాదాలు అందజేశారు. నూతన కార్యాలయ గదిని ఎమ్మెల్యే ప్రారంభించారు ఈ పూజా కార్యక్రమాల్లో బిల్లు చెంచురామయ్య, వాటంబేడు హరికుమార్, అబ్దుల్ రహీం ,సీనియర్ ఆడిటర్ శ్రీ కంటి రామ్మోహన్ రావు చంద్రనిల్ ,తదితరులు పాల్గొన్నారు.

# రక్తదాన శిబిరానికి విశేష స్పందన




ధర్మవరం, ఆగస్టు 16; (అరుణ ప్రభ న్యూస్)పట్టణంలోని సాంస్కృతిక మండలిలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించిందని రోటరీ క్లబ్ అధ్యక్షులు జయసింహ తెలిపారు. రోటరీ క్లబ్, అనంతపురం రెడ్‌క్రాస్ సొసైటీ, ధర్మవరం రక్తబంధం ట్రస్ట్, సాంస్కృతిక మండలి సంయుక్త సహకారంతో ఈ శిబిరాన్ని నిర్వహించినట్లు పేర్కొన్నారు.ఈ సందర్భంగా జయసింహ మాట్లాడుతూ 30 మంది రక్తదాతలు స్వచ్ఛందంగా రక్తదానం చేసి తమ మానవతా విలువలను చాటుకున్నారని తెలిపారు. ఒక్కరు చేసే రక్తదానం పలువురి ప్రాణాలను కాపాడటమే కాకుండా, ఆపదలో ఉన్న వారికి పునర్జన్మను ప్రసాదించినట్లవుతుందని అన్నారు. రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికీ అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో నరేందర్‌రెడ్డి, చంద్రశేఖర్, పెద్దారెడ్డి, సాంస్కృతిక మండలి అధ్యక్షులు ప్రసన్నకుమార్, కార్యదర్శి సోలిగాల వెంకటేశులు, మనోహర్ గుప్తా, రమేష్‌బాబు, నాగభూషణం, బోనాల శివయ్య, హరినాథ్, సుదర్శన్ గుప్తా, కొండయ్య, సురేష్, శ్రీనివాసరెడ్డి, బుగ్గ ప్రేమసాయి, డాక్టర్ రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# హాకీ అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలి




ధర్మవరం, ఆగస్టు 16; (అరుణ ప్రభ న్యూస్)హాకీ క్రీడను మరింత అభివృద్ధి చేసే దిశగా ప్రతి ఒక్కరూ సమష్టిగా ముందడుగు వేయాలని రాష్ట్ర హాకీ అధ్యక్షులు చాణుక్యరాజు పిలుపునిచ్చారు. పట్టణంలోని ఎన్జీవో హోమ్‌లో శ్రీ సత్యసాయి జిల్లా హాకీ ఉపాధ్యక్షులు సూర్యప్రకాష్ ఆధ్వర్యంలో హాకీ క్రీడాభివృద్ధిపై సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా చాణుక్యరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో హాకీ క్రీడకు మరింత ప్రోత్సాహం కల్పించడంతో పాటు క్రీడాకారులకు మెరుగైన అవకాశాలు కల్పించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించినట్లు తెలిపారు. హాకీ ఇండియా నూతన రాజ్యాంగ సవరణలకు మార్గదర్శకంగా ఉండే అంశాలపై కూడా సమావేశంలో విస్తృతంగా చర్చించినట్లు పేర్కొన్నారు.ఈ సమావేశంలో రాష్ట్ర హాకీ కార్యదర్శి హర్షవర్ధన్, డైరెక్టర్ నిరంజన్‌రెడ్డి, 20 జిల్లాల హాకీ అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

# ఎస్సై ఇసాక్ భాషకు ప్రతిష్టాత్మక 'అతి ఉత్కృష్ట' అవార్డు



ధర్మవరం, ఆగస్టు 16; (అరుణ ప్రభ న్యూస్)ధర్మవరం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న ఇసాక్ భాషకు ప్రతిష్టాత్మక 'అతి ఉత్కృష్ట' అవార్డు లభించింది. పుట్టపర్తిలోని సాయి ఆరామంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డును ప్రదానం చేశారు.పోలీసు విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి, విధి నిర్వహణలో విశేష సేవలు అందించినందుకు ఎస్సై ఇసాక్ భాషను ఈ పురస్కారానికి ఎంపిక చేశారు. మంత్రి సవిత చేతుల మీదుగా ఇసాక్ భాష అవార్డును అందుకున్నారు.ఈ సందర్భంగా ఇసాక్ భాషను పోలీసు అధికారులు, సిబ్బంది, పలువురు ప్రముఖులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

# సోమవారం ధర్మవరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ధర్మవరం, ఆగస్టు 16; (అరుణ ప్రభ న్యూస్)శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్, పుట్టపర్తి వారి ఆదేశాల మేరకు ధర్మవరం రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో సోమవారం (ఆగస్టు 17) ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రా+వా) కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ధర్మవరం డివిజన్ పరిధిలోని వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొని ప్రజల నుంచి సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించనున్నారు. రెవెన్యూ, ఇతర శాఖలకు సంబంధించిన సమస్యలు ఉన్న ప్రజలు తమ దరఖాస్తులను సమర్పించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు.ప్రజలు తమ సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం పొందేందుకు ప్రజా సమస్యల పరిష్కార వేదికను వినియోగించుకోవాలని కోరారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం



ధర్మవరం, ఆగస్టు 16; (అరుణ ప్రభ న్యూస్)ధర్మవరం పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓలు రాజేశ్వరి దేవి, గోపాల్ నాయక్ తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొత్తం 27 పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. వీటిలో ఎస్జీటీ 6, హిందీ 7, తెలుగు 10, ఫలితం 1, ఫిజికల్ సైన్స్ 2, ఆంగ్లం 1 పోస్టులు ఉన్నట్లు వివరించారు. స్కూల్ అసిస్టెంట్‌లకు నెలకు రూ.12,500, ఎస్జీటీ టీచర్లకు రూ.10,000 వేతనం చెల్లించనున్నట్లు తెలిపారు.అభ్యర్థుల ఎంపికలో అకడమిక్ అర్హతలకు 75 శాతం, ప్రొఫెషనల్ అర్హతలకు 25 శాతం వెయిటేజీ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా స్థానికతకు కూడా ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు.ఆగస్టు 16 నుంచి 21వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అర్హత కలిగిన నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓలు సూచించారు.

# గౌతు లచ్చన్న ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకోవాలి



ధర్మవరం, ఆగస్టు 16; (అరుణ ప్రభ న్యూస్)ప్రభుత్వ ఆదేశాల మేరకు ధర్మవరం ఆర్డీఓ కార్యాలయంలో సర్దార్ గౌతు లచ్చన్న 117వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆర్డీఓ రాం భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గౌతు లచ్చన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆర్డీఓ రాం భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ గౌతు లచ్చన్న జీవితం, ఆశయాలు, సిద్ధాంతాలు నేటి తరానికి ఆదర్శప్రాయమని అన్నారు. యువత, విద్యార్థులు ఆయన జీవితాన్ని మార్గదర్శకంగా తీసుకుని ముందుకు సాగాలని సూచించారు. లచ్చన్న జీవన విధానం, సిద్ధాంతాలను ప్రజలు, విద్యార్థులకు మరింతగా చేరువయ్యేలా కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం సీనియర్ అసిస్టెంట్ రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ ప్రతిభ పురస్కారం మరింత బాధ్యతను పెంచింది




ధర్మవరం, ఆగస్టు 16; (అరుణ ప్రభ న్యూస్)జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ ప్రతిభ ప్రశంసాపత్రం, అవార్డు అందుకోవడం ఎంతో సంతోషంగా ఉందని ధర్మవరం మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య తెలిపారు. ఈ పురస్కారం తనపై మరింత బాధ్యతను పెంచిందని, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా పుట్టపర్తిలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా వెంకటరమణయ్య ఉత్తమ ప్రతిభ ప్రశంసాపత్రం, అవార్డును అందుకున్నారు.ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయ అధికారులు, సిబ్బంది కమిషనర్ వెంకటరమణయ్యను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

# వాజ్‌పేయి సేవలు చిరస్మరణీయం






ధర్మవరం, ఆగస్టు 16; (అరుణ ప్రభ న్యూస్)భారత మాజీ ప్రధాని, భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతిని పురస్కరించుకుని ధర్మవరం పట్టణ బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. పట్టణ బీజేపీ అధ్యక్షులు జింకా చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి జాతీయ కౌన్సిల్ సభ్యులు అంబటి సతీష్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వాజ్‌పేయి కాంస్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వాజ్‌పేయి భారత రాజకీయాల్లో విలువలు, ప్రజాసేవకు ప్రతీకగా నిలిచిన మహోన్నత నాయకుడని కొనియాడారు. దేశ అభివృద్ధి, జాతీయ భద్రత, మౌలిక వసతుల రంగాల్లో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఆయన దేశభక్తి, నిజాయితీ, ప్రజాసేవా మార్గాలను నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి జింకా ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యక్షులు చెన్న ఆదినారాయణ, పాల్తూరి నాగభూషణాచారి, జిల్లా మైనార్టీ ప్రధాన కార్యదర్శి నబీ రసూల్, జిల్లా నాయకురాలు పోరాళ్ల మహాలక్ష్మి, జిల్లా కార్యవర్గ సభ్యురాలు వరలక్ష్మి, బీరే విజయలక్ష్మి, ఓబీసీ మోర్చా నాయకులు మహేష్ ప్రజాపతి, బండపల్లి రాజు, తట్టే శివరాం తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉత్తమ సేవలకు విద్యుత్ శాఖ ఏఏఓకు పురస్కారం



ధర్మవరం, ఆగస్టు 16; (అరుణ ప్రభ న్యూస్)విద్యుత్ శాఖలో ఉత్తమ సేవలు అందించిన అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ (ఏఏఓ) జె. రామకృష్ణకు ఉత్తమ అవార్డు, ప్రశంసాపత్రం లభించింది. ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా పుట్టపర్తిలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్, మంత్రి సవిత చేతుల మీదుగా ఆయన పురస్కారాన్ని అందుకున్నారు.ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ విద్యుత్‌ను ప్రతి ఒక్కరూ పొదుపుగా వినియోగించాలని సూచించారు. వినియోగదారులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి మరింత కృషి చేస్తానని తెలిపారు.అనంతరం డీఈఈ, వివిధ డివిజన్ల ఏఈలు, లైన్‌మెన్లు, విద్యుత్ శాఖ సిబ్బంది రామకృష్ణను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

## యూటీఎఫ్ పోరాట వీరులకు ఘన సత్కారం



ధర్మవరం, ఆగస్టు 16; (అరుణ ప్రభ న్యూస్)2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ పునరుద్ధరణ కోసం 2023లో శ్రీ సత్యసాయి జిల్లాలో నిరాహార దీక్షలో పాల్గొని కీలక పాత్ర పోషించిన యూటీఎఫ్ నాయకులకు విజయవాడలో ఘన సత్కారం లభించింది.యూటీఎఫ్ రాష్ట్ర కేంద్రం ఆధ్వర్యంలో విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన పోరాట వీరుల విజయోత్సవ సభలో రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రరెడ్డి, పూర్వ ప్రధాన కార్యదర్శి ఎం. సుధాకర్, గౌరవాధ్యక్షులు భూతన్న, సహాధ్యక్షులు జీహెచ్ బాబు, సోమందేపల్లి మండల నాయకులు సోమశేఖర్‌లను గోల్డ్ మెడల్, మెమెంటో, ప్రశంసాపత్రాలతో సత్కరించారు.ఈ పురస్కారాలను పీడీఎఫ్ ఎమ్మెల్సీ గోపీమూర్తి, మాజీ ఎమ్మెల్సీలు బాలసుబ్రహ్మణ్యం, లక్ష్మణరావు, ఐ. వెంకటేశ్వరరావు, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నక్క వెంకటేశ్వరరావు, కేఎస్ఎస్ ప్రసాద్ చేతుల మీదుగా అందజేశారు.ఈ సందర్భంగా యూటీఎఫ్ శ్రీ సత్యసాయి జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ నాయక్ మాట్లాడుతూ యూటీఎఫ్ చేపట్టిన పోరాటాలు, నిరాహార దీక్షల ఫలితంగానే 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ పునరుద్ధరణ సాధ్యమైందన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి భవిష్యత్తులోనూ పోరాట మార్గమే కీలకమని పేర్కొన్నారు.


# ధర్మవరం ఆప్టికల్ వ్యాపారుల ఆవేదన

**ఎమ్మెల్యే, మంత్రి సత్యకుమార్ యాదవ్ చొరవ తీసుకుంటే పరిష్కారం సాధ్యమే**

**మంత్రి సత్యకుమార్ చొరవ పై ఆప్టికల్ వ్యాపారులు ఆశలు**



ధర్మవరం, ఆగస్టు 16; (అరుణ ప్రభ న్యూస్)ధర్మవరం పట్టణంలో ఎన్నో ఏళ్లుగా ఆప్టికల్స్ వ్యాపారాలను నిర్వహిస్తూ కుటుంబాలను పోషించుకుంటున్న చిన్న వ్యాపారుల జీవనోపాధిని కాపాడేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకోవాలని ఆప్టికల్ అసోసియేషన్ ప్రతినిధులు కోరుతున్నారు. పట్టణంలో లెన్స్‌కార్ట్ సంస్థ షోరూమ్ ఏర్పాటుకు జరుగుతున్న ప్రయత్నాలు తమ చిన్న వ్యాపారాలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.చాలా సంవత్సరాలుగా స్థానిక ప్రజలకు కళ్లద్దాలు, లెన్స్‌లు, ఇతర ఆప్టికల్ సేవలను అందిస్తూ జీవనం సాగిస్తున్నామని, తమ వ్యాపారాలపైనే కుటుంబాల ఆర్థిక పరిస్థితి ఆధారపడి ఉందని వ్యాపారులు తెలిపారు. పెద్ద సంస్థలు మార్కెట్‌లోకి వస్తే చిన్న వ్యాపారుల ఆదాయాలు తగ్గి, కుటుంబ పోషణతో పాటు పిల్లల చదువులు కూడా ఇబ్బందులకు గురయ్యే పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు.ఈ సమస్యపై ఇప్పటికే రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్తో పాటు సంబంధిత అధికారులకు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. అయితే ఇప్పటివరకు సమస్యపై స్పష్టమైన స్పందన రాకపోవడం తమను నిరాశకు గురిచేస్తోందన్నారు.స్థానిక చిన్న వ్యాపారుల జీవనోపాధిని దృష్టిలో ఉంచుకుని ధర్మవరం ఎమ్మెల్యే, రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రత్యేకంగా స్పందించి సమస్యను పరిశీలించాలని వారు కోరుతున్నారు. ప్రజల జీవనోపాధికి సంబంధించిన ఈ అంశాన్ని మానవతా దృక్పథంతో పరిశీలించి, లెన్స్‌కార్ట్ ఏర్పాటుపై తగిన నిర్ణయం తీసుకునేలా సంబంధిత అధికారులతో మాట్లాడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.తమ సమస్యను ఎమ్మెల్యే, మంత్రి సత్యకుమార్ యాదవ్ దృష్టికి



తీసుకెళ్లిన నేపథ్యంలో వారి చొరవతో తమకు న్యాయం జరుగుతుందనే ఆశాభావాన్ని ఆప్టికల్ వ్యాపారులు వ్యక్తం చేస్తున్నారు. చిన్న వ్యాపారుల జీవనోపాధిని కాపాడుతూ, సమస్యకు సామరస్యపూర్వక పరిష్కారం చూపాలని కోరుతున్నారు.కార్యక్రమంలో ఆప్టికల్ అసోసియేషన్ అధ్యక్షులు సురేష్, శ్రీకాంత్ రెడ్డి తదితర సభ్యులు పాల్గొన్నారు.

# ధండుమారమ్మ తల్లికి బంగారు బోనం



ధండుమారమ్మ తల్లికి బంగారు బోనం సమర్పించి భక్తిశ్రద్ధలను చాటుకున్నారు. బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ముప్పిడి గోపాల్, జయలక్ష్మి, కళావతి కుటుంబ సభ్యులు రేవతి, సికింద్రాబాద్ గణేష్ టెంపుల్ ట్రస్ట్ బోర్డు మెంబర్ నరేష్ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి బంగారు బోనం సమర్పించారు.అదేవిధంగా కార్ఖణా మహంకాళి అమ్మవారికి, మడ్‌ఫోర్ట్ అమ్మవారికి, సికింద్రాబాద్ సిక్కు విలేజ్‌లోని అమ్మవార్లకు భక్తులు బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో రవి, పరమేష్, కిట్టు, వేణు, సాయి, చిన్న తదితరులు పాల్గొని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని భక్తులు ఆకాంక్షించారు.

## విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేసిన లయన్స్ క్లబ్




ఆల్వాల్: లయన్స్ క్లబ్ ఆఫ్ ఆల్వాల్ ఆధ్వర్యంలో ఆల్వాల్‌లోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకున్నారు.అనంతరం 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఉత్తమ, ద్వితీయ ప్రతిభకు సంబంధించిన నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. అలాగే విద్యార్థులకు మెమెంటోలు అందించి అభినందించారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఆల్వాల్ అధ్యక్షులు డి.వి. సుబ్బారావు, కోశాధికారి ఆర్. రవీంద్రన్‌తో పాటు సభ్యులు పి. సత్యనారాయణరావు, జయంతి, వెంకటరమణ, సునీత తివారీ, భాగ్యలక్ష్మి, పద్మజ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులను ప్రోత్సహించేందుకు లయన్స్ క్లబ్ చేస్తున్న సేవలను పలువురు అభినందించారు.

## ఆలయ అభివృద్ధికి అందరూ భాగస్వాములు కావాలి



ఆల్వాల్: వజ్ర ఎన్‌క్లేవ్‌లోని శ్రీ సుబ్రహ్మణ్య ప్రసన్న ఆంజనేయ స్వామి దేవాలయ అభివృద్ధికి కాలనీ వాసులందరూ భాగస్వాములు కావాలని వజ్ర ఎన్‌క్లేవ్ అసోసియేషన్ ప్రతినిధులు పిలుపునిచ్చారు.ఆలయ అభివృద్ధిలో భాగంగా దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేసి, ఆలయాన్ని మరింత అభివృద్ధి చేయడంతో పాటు నిర్వహణను క్రమబద్ధీకరించడం తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఆలయ పరిశుభ్రతను కాపాడటం, భక్తిశ్రద్ధలతో సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించడం, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి కాలనీ వాసులు తమ వంతు సహకారం అందించాలని, పవిత్రమైన ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మనస్ఫూర్తిగా కోరారు. కార్యక్రమానికి కాలనీ వాసులు హాజరై ఆలయ అభివృద్ధికి తమ సహకారం అందిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏ. మహిపాల్‌రెడ్డి, సిహెచ్. సంతోష్, శ్రీధర్, నాగేశ్వరరావు, టీవీ ప్రవీణ్‌కుమార్, సదాశివరావు, పూర్ణారావు, శ్రీనివాస్, మధుకర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన వదువరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే అమిలినేని

కళ్యణదుర్గం ప్రతినిధి బి గోవిందు ఆగస్టు 16 అనంతపురం పట్టణానికి చెందిన పోట్ల రవి ఆహ్వానం మేరకు కేటీఆర్ ఫంక్షన్ హాల్ నందు జరిగిన వివాహ రిసెప్షన్ వేడుకకు హాజరై నూతన వదువరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు, ఎస్సార్సీ చైర్మన్ ముత్తినేని రాజగోపాల్, దేవినేని వెంకటేష్, మహీధర్ రెడ్డి తదితరులు..

## ఆత్మకూరు ఎంపీపీ హేమలత వివాహ వేడుకకు హాజరైన మాజీ ఎంపీ తలారి రంగయ్య

కళ్యణదుర్గం గోవిందు ఆగస్టు 16ఆత్మకూరు మండల పరిషత్ అధ్యక్షురాలు (ఎంపీపీ) హేమలత వివాహ వేడుక ఆత్మకూరులో ఘనంగా జరిగింది. ఈ శుభకార్యానికి మాజీ ఎంపీ, కళ్యాణదుర్గం సమన్వయకర్త తలారి రంగయ్య హాజరయ్యారు.వివాహ వేడుకలో నూతన వధూవరులు హేమలత, మారుతి కుమార్ దంపతుల వైవాహిక జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆయన ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, వైఎస్ఆర్ సీపీ ముఖ్య నాయకులు మరియు ఎంపీపీ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎంపీ తలారి రంగయ్య

కళ్యణదుర్గం ప్రతినిధి బి గోవిందు ఆగస్టు 16అనంతపురంలోని వాల్మీకి కళ్యాణ మండపంలో జరిగిన పెద్దరికం సాయి, శశికళల వివాహ మహోత్సవానికి మాజీ ఎంపీ, కళ్యాణదుర్గం వైఎస్ఆర్సీపీ సమన్వయకర్త తలారి రంగయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన నూతన వధూవరులను ఆశీర్వదించారు.వివాహ బంధంతో ఒకటైన సాయి, శశికళలు జీవితాంతం సుఖసంతోషాలతో, అన్యోన్యంగా వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు. ఈ వివాహ వేడుకలో వధూవరుల తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు మరియు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## గణపతి, ఆంజనేయస్వామి, మారెమ్మ దేవతల విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న ఎమ్మెల్యే అమిలినేని

ప్రతినిధి బి గోవిందు ఆగస్టు 16అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం నియోజకవర్గం బ్రహ్మసముద్రం మండలం యనకల్లు గ్రామంలో జరుగుతున్న గణపతి, శ్రీ ఆంజనేయ స్వామి, మారెమ్మ, నాగసహిత బొడ్రాయి ప్రతిష్ట కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు, టీడీపీ నాయకులు, పెరవలి పారా విశ్వనాథ్ కి గ్రామ ప్రజలు ఘన స్వాగతం పలుకగా అనంతరం ఆంజనేయ స్వామి ఆలయానికి చేరుకుని ఆంజనేయుడికి, గణపతి, మారెమ్మలకు, ధ్వజస్థంభం, కళషాలకు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు..గ్రామస్థులు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు గారికి, నాయకులకు సన్మానం చేయడం జరిగింది.

# రాంపురం కొట్టాలలో మూగబోయిన కొళాయి

తుగ్గలి ఆగస్టు 16. తుగ్గలి మండల పరిధిలోని రాంపురం కొట్టాల గ్రామంలో గత కొన్ని రోజులుగా తాగునీటి కరువు తాండవిస్తోంది. కుళాయిల్లో చుక్క నీరు రాక గ్రామ ప్రజలు దాహంతో అల్లాడుతున్నామని గ్రామ ప్రజలు తెలిపారు . ప్రజల ప్రాథమిక అవసరమైన తాగునీటి విషయంలో పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం, అలసత్వం స్పష్టంగా కనిపిస్తోంది. సమస్యను పలుమార్లు దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకున్న పాపాన పోలేదు. అధికారుల నిర్వాకం వల్ల మహిళలు, చిన్నారులు వేరే ప్రాంతం నుండి నీళ్లు తెచ్చుకునే దుస్థితి నెలకొంది. ఇది ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది.కాబట్టి సంబంధిత మండల అధికారులు వెంటనే స్పందించి తాగునీటి ఎద్దడిని శాశ్వతంగా పరిష్కరించాలని, ఈ నిర్లక్ష్యానికి కారణమైన అధికారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరిస్తున్నారు.

## రాంపురం కొట్టాల లో తెదేపా ఇంటింటికి సంక్షేమ పథకాల ప్రచారం

తుగ్గలి: ఆగస్ట16కూటమి ప్రభుత్వంలో ప్రతి గడపకు సంక్షేమ పథకం అమలు పరుస్తున్నామని తెదేపా మండల అధ్యక్షుడు తిరుపాల్ నాయుడు, ఉపాధ్యక్షుడు వెంకట్రామ్ చౌదరి, క్లస్టర్ ఇంచార్జ్ ఎద్దుల దొడ్డి శ్రీను వాసు గౌడ్, పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాల కార్యక్రమంలో ఆదివారం స్థానిక తెదేపా నాయకులు తో ఇంటింటికి సంక్షేమ పథకాల ప్రచారం నిర్వహించారు.కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కార్యకర్తలతో కలిసి ప్రతి ఇంటికి వెళ్లి వివరించారు. పత్తికొండ ఎమ్మెల్యే శ్యామ్ కుమార్ నాయకత్వంలో నియోజకవర్గం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని నాయకులు పేర్కొన్నారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిబద్ధతతో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళు తున్నారని కొనియాడారు. యువతకు ఉపాధి, రైతులకు అండ, మహిళలకు భరోసా కల్పిస్తూ కూటమి ప్రభుత్వం సుపరిపాలన అందిస్తోందని తెలిపారు.సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పనిచేస్తూ ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు తెదేపా ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లోనూ ప్రజలు కూటమికి అండగా నిలవాలని కోరారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్ భీమ లింగప్ప చౌదరి, తెదేపా నాయకులు ఇస్మాయిల్, మల్లయ్య, బీసీఎల్ మండల అధ్యక్షుడు సంఘాల కృష్ణ, మాజీ సర్పంచ్ చంద్రన్న,జయరాముడు, మై రాముడు, చక్రపాణి, సుభాష్ చంద్రబోస్, వీరేంద్ర,రాజోలి, అన్నం పల్లి వల్లి, మోదిన్ సాబ్, మస్తాన్, చిన్న కమల్ సాబ్, మాబు,తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో నీటి సమస్య ఎక్కువగా ఉందని పంచాయతీ అధికారులు పలుమార్లు విన్నవించుకున్న స్పందించలేదని గ్రామ ప్రజలు నాయకులకు తెలిపారు. వెంటనే స్పందించిన స్థానిక నాయకులు తెదేపా ఉపాధ్యక్షులు వెంకట్రామ్ చౌదరి, మండల అధ్యక్షుడు తిరుపాల్ నాయుడు, క్లస్టర్ ఇంచార్జ్ శ్రీనివాస్ గౌడ్ సంబంధిత అధికారులకు ఫోన్లో విషయం తెలపగా అధికారులు సానుకూలంగా స్పందించి తాత్కాలికంగా,నీటి ట్యాంకుల ద్వారా నీటినందిస్తామని తెలిపారు. శాశ్వత పరిష్కారం చూపుతామని తెలిపినట్లు వారు తెలిపారు.

## బోరంపల్లిలో రోడ్డు ప్రమాదం.. ఇద్దరికి గాయాలు

కళ్యణదుర్గం ప్రతినిధి బి గోవిందు ఆగస్టు 16కళ్యాణదుర్గం మండలం బోరంపల్లి గ్రామంలోని శ్రీఆంజనేయస్వామి దేవస్థానం సమీపంలో రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది.ఎనుము దూడ ద్విచక్ర వాహనానికి అడ్డుగా రావడంతో వాహనదారులు అదుపుతప్పి కిందపడినట్లు స్థానికులు తెలిపారు. ఈ ఘటనలో ద్విచక్ర వాహనంపై ఉన్న ఇద్దరికీ గాయాలయ్యాయి.ఒకరికి రెండు కాళ్లకు తీవ్ర గాయాలైనట్లు, మరొకరికి కూడా తీవ్రంగా గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. గాయపడిన ఇద్దరూ గోళ్ళ గ్రామానికి చెందిన వారిగా సమాచారం.స్థానికుల సమాచారంతో గాయపడిన ఇద్దరినీ అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం.ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## నూతన వదువరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే అమిలినేని

కళ్యణదుర్గర్ ప్రతినిధి బి గోవిందు ఆగస్టు 16అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం పట్టణానికి చెందిన కట్టా రాజు ఆహ్వానం మేరకు శ్రీ శ్రీ శ్రీనివాస కళ్యాణమంటపంలో జరిగిన వారి కుమారుడు జయంత్ వెడ్స్ మేఘనల వివాహ వేడుకకు హాజరై నూతన వదువరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు ,టీడీపీ నాయకులు..

## మొగల్తూరు డిప్యూటీఎమ్మార్వో సంతకంపోర్జి రి కేసులో నలుగురు అరెస్ట్.

మొగల్తూరు ఆగస్టు 16ప్రతినిధి. మొగల్తూరు మండలం డిప్యూటీ ఎమ్మార్వో సంధకాన్ని పోర్జి రీ చేసి ఆ సంతకంతో భూమి రిజిస్ట్రేషన్ ఉపయోగించిన ఆరోపణలపై నలుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు నరసాపురం రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం నాగరాజు తెలిపారు శనివారం మొగల్తూరు పోలీస్ స్టేషన్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన కేసు వివరాలు వెల్లడించారు సీఐ కథనం ప్రకారం మొగల్తూరు మండలం ఎమ్మార్వో కార్యాలయంలో డిప్యూటీ తాసిల్దారిగా పనిచేస్తున్న దువ్వాని సుగుణ సంధ్య సంతకాన్ని పోర్జి రీ ఆ పత్రాలను ఉపయోగించి మొగల్తూరు రిజిస్ట్రేషన్ కార్యాలయం భూమి రిజిస్ట్రేషన్ చేయించినట్లు ఫిర్యాదు అనింది ఈ మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఈ కేసుతో సంబంధం ఉన్న మొగల్తూరు గ్రామానికి చెందిన జంపా వెంకట నాగ శివ ఆంజనేయులు జంప శ్రీనివాస్ కడల నాగేంద్ర కుమార్ అలియ స్ చైనా నాగేంద్ర ముత్యాలపల్లి గ్రామానికి చెందిన సచివాలయంలో పనిచేస్తున్న బస్వాని రాజ్ కుమార్ ను అరెస్టు చేసినట్లు తెలిపారు ఈ ఈ కేసులో ఉపయోగించినట్లు భావిస్తున్న ఒక కంప్యూటర్ సిపియు మని టర్ ను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వెల్లడించారు అరెస్టు చేసిన నిందితులను తదుపరి న్యాయపరమైన చర్య ల నిమిత్తం కోర్టు ముందు హాజరపరిచినట్లు తెలిపారు తప్పుడు పద్ధతిలో ప్రభుత్వ ధ్రువపత్రాలను పొందడం వాటిని ఈ లావాదేవులకు వినియోగించడం తీవ్రమైన నేరమని సీఐ నాగరాజు హెచ్చరించారు ఇలాంటి నేరాలకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు ఈ సమావేశంలో మొగల్తూరు పోలీస్ స్టేషన్ ఎస్ఐ జి వాసు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

## తుగ్గలి మండలంలో 46 అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టుల భర్తీ

తుగ్గలి: ఆగస్టు 16)తుగ్గలి మండల పాఠశాల విద్యాశాఖలో 2026-27 విద్యా సంవత్సరానికి 46 అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఎంఈఓ ప్రవీణ, ఎంఈఓ -2 రామ వెంకటేశ్వర్లు తెలిపారు. ఇందులో ఎస్ జి టి 35, స్కూల్ అసిస్టెంట్ 11 పోస్టులు ఉన్నాయి. ఎస్ జి టి పోస్టులు 23 స్కూళ్లలో ఉన్నాయి. బొండిమడుగుల, మరెల్ల, రాంపల్లి, ఆర్ఎస్ పెండేకల్, కొతికొండ, గిరిగెట్ల తదితర జడ్.పి.హెచ్.ఎస్ , ఎంపీపీ ఎస్ లలో పోస్టులు ఉన్నాయి. ఎస్ ఏపోస్టులు 11. హిందీ 6, తెలుగు సోషల్ 3, ఇంగ్లీష్ 1, బయో సైన్స్ 1 పోస్టులు జొన్నగిరి, బొండిమడుగుల, రాంపల్లి, పెండేకల్, రామలింగాయపల్లి జడ్పీహెచ్ఎస్ లలో ఉన్నాయి.నెలసరి గౌరవ వేతనం ూ+ులకు ?10,000, ూాలకు ?12,500. నియామకం 01.09.2026 నుండి 30.04.2027 వరకు 8 నెలలు తాత్కాలికం. రాత పరీక్ష లేదు. మెరిట్ ఆధారంగా ఎంపిక. అకడమిక్ 75%, ప్రొఫెషనల్ 25% వెయిటేజీ.టి ఈ టి,కు ప్రాధాన్యం.ఎస్ జి టి,కి డి ఈ ఐ ఈ డి , ూాకి బీఈడీ అర్హత. స్థానికులకు ప్రాధాన్యం.దరఖాస్తులు 16.08.2026 నుండి 21.08.2026 వరకు ఎం ఈ ఓ కార్యాలయం తుగ్గలిలో ఆఫ్‌లైన్‌లో స్వీకరిస్తారు. అర్హులైన అభ్యర్థులు గడువులోగా దరఖాస్తు చేయాలని ఎంఈఓ లు కోరారు.

## ప్రతిభకు ప్రోత్సాహం.. కొవ్వాసు ముక్కయ్య మెమోరియల్ ఆధ్వర్యంలో..

విద్యార్థులకు రూ.18 వేల నగదు బహుమతులు....

)2026 ఎస్ఎస్‌సీ పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించి ఆదర్శంగా నిలిచిన ముగ్గురు గిరిజన విద్యార్థులను శ్రీ కొవ్వాసు ముక్కయ్య (సూరయ్య) మెమోరియల్ ఆధ్వర్యంలో ఘనంగా అభినందించారు. బూసరాజుపల్లి పాఠశాలలో 10వ తరగతి చదివిన ఉహాలక్ష్మి 534 మార్కులతో ప్రథమ స్థానం, సాహిత్య 532 మార్కులతో ద్వితీయ స్థానం సాధించగా, దొరమామిడి పాఠశాలకు చెందిన సరియం అనిల్ కుమార్ 531 మార్కులు సాధించి ప్రతిభ కనబరిచారు.విద్యార్థుల కృషిని అభినందిస్తూ, వారి ఉన్నత విద్యకు ప్రోత్సాహంగా శ్రీ కొవ్వాసు ముక్కయ్య మెమోరియల్ తరఫున ఒక్కొక్కరికి రూ.5,000 చొప్పున మొత్తం రూ.15,000 నగదు బహుమతులు అందజేశారు. అలాగే జైనవారిగూడెం గ్రామానికి చెందిన తాటి హరిణి 500పై బడి మార్కులు సాధించినందుకు ప్రోత్సహిస్తూ రూ.3,000 నగదును అందించినట్లు తెలియపరిచారు. ఈ సందర్భంగా మెమోరియల్ ప్రతినిధులు కొవ్వాసు వెంకటలక్ష్మి, కొవ్వాసు రాము గార్లు కొవ్వాసు సూర్య ప్రకాష్ గారి మెసేజ్ ను చదివి వినిపించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు సాధించిన విజయం వారి కృషి, పట్టుదల, ఆత్మవిశ్వాసానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఈ గుర్తింపు విద్యార్థులకు మరింత ఉన్నత లక్ష్యాలను చేరుకునేలా ప్రోత్సాహం అందిస్తుందని తెలిపారు.విద్యార్థులు ఉన్నత విద్యలోనూ ఇదే పట్టుదల, క్రమశిక్షణతో ముందుకు సాగి, తమ కుటుంబాలకు, ఉపాధ్యాయులకు, చదువుకున్న పాఠశాలలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకున్న తర్వాత తాము చదువుకున్న పాఠశాలల అభివృద్ధికి, తమ గ్రామాల అభివృద్ధికి, పేద విద్యార్థుల విద్యకు తమ వంతు సహకారం అందించాలని కోరారు.అలాగే విద్యార్థులందరూ మంచి అలవాట్లను అలవరచుకొని, కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు.ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉహాలక్ష్మి, సాహిత్య, సరియం అనిల్ కుమార్‌లకు కొవ్వాసు ముక్కయ్య (తండ్రి సూరయ్య) మెమోరియల్ తరఫున హృదయపూర్వక అభినందనలు, ఉజ్వల భవిష్యత్తుకు శుభాకాంక్షలు తెలిపారు.

అరుణ ప్రభ
ARUNAPRABHA TELUGU DAILY
సోమవారం - 17- ఆగస్టు - 2026

## జొన్నగిరి హైస్కూల్ విద్యార్థులకు మాజీ పాఠశాల విద్య కమిటీ చైర్మన్ గుంత రఘు ప్రోత్సాహం



తుగ్గలి ఆగస్టు 16. )తుగ్గలి.జొన్నగిరి హైస్కూల్ లో 2025-26 విద్యా సంవత్సరం 10వ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మాజీ పాఠశాల విద్య కమిటీ చైర్మన్, వైసీపీ సీనియర్ నాయకులు గుంత రఘు,నగదు బహుమతులు అందజేశారు.1వ బహుమతి: =. మమత 2500రూపాయలు2వ బహుమతినా.సాహితి 1500రూపాయలు 3వ బహుమతి +. అనిల్ 1000 రూపాయలువిద్యార్థులను ప్రోత్సహించేందుకు బహుమతులను అందజేసిన గుంత రఘు, తెలిపారు.పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు తల్లిదండ్రులు అభినందించారు.చదువులో వెనుకబడకుండా కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు అందుకోవాలని విద్యార్థులకు సూచించారు.

## ఉప్పర్లపల్లి సహకార కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు.



తుగ్గలి, ఆగస్టు 1): తుగ్గలి మండలం జొన్నగిరిలోని ఉప్పర్లపల్లి సహకార సంఘం కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. సంఘం చైర్మన్ అప్ప వేణు అధ్యక్షతన, సీఈఓ గిడ్డయ్య నేతృత్వంలో కార్యక్రమం నిర్వహించారు. ముందుగా త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి గౌరవ వందనం చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఎందరో మహనీయుల త్యాగఫలమే నేడు మనం స్వేచ్ఛగా జీవిస్తున్నామని, వారి ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. దేశభక్తి, ఐక్యతను పెంపొందించుకుందామని అన్నారు.కార్యక్రమంలో డైరెక్టర్లు భీమ చౌదరి, చిన్న పెద్దయ్య, సంఘం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తాజంగి రిజర్వాయర్ ఉన్నా.. వంతమామిడి పొలాలకు చుక్కనీరు కరువు

పంట నష్టపరిహారం ఎకరాకు రూ.25 వేలు ఇవ్వాలి:

బోనంగి చిన్నయ్య పడాల్.





తాజంగి రిజర్వాయర్ ఉన్నప్పటికీ వంతమామిడి, బాసిం, కొత్తూరు గ్రామాల చివరి ఆయకట్టు గిరిజన రైతులకు ఈ ఏడాది సాగునీరు అందక వరి పొలాలు ఎండిపోతున్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బోనంగి చిన్నయ్య పడాల్ ఆవేదన వ్యక్తం చేశారు.ఆదివారం వంతమామిడి గ్రామంలో నీరు లేక ఎండిపోతున్న పంట పొలాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడిన చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ.. తాజంగి రిజర్వాయర్ ఉన్నా చివరి ఆయకట్టు రైతులకు చుక్కనీరు అందక వరి నాట్లు వేసుకోలేని పరిస్థితి నెలకొందన్నారు. వర్షాల కోసం ఆకాశం వైపు చూస్తున్నామని, అక్కడి నుంచి కూడా ఆశించిన స్థాయిలో వర్షం కురవకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.తాజంగి రిజర్వాయర్‌కు ప్రభుత్వం గతంలో లక్షలాది రూపాయలు వెచ్చించినప్పటికీ ముందస్తు చర్యలు చేపట్టకపోవడంతో మరమ్మతులకు నోచుకోకుండా నీటి వినియోగానికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ఆయన విమర్శించారు. రిజర్వాయర్‌లో నీరు లేకపోవడం, మరోవైపు వర్షాలు కురవకపోవడంతో పంట పొలాలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.కొంతమంది రైతులు దూర ప్రాంతాల నుంచి మోటార్ల ద్వారా నీటిని పొలాలకు తరలించి వరి నాట్లు వేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. అయినప్పటికీ వాతావరణ పరిస్థితులు రైతులకు ఏమాత్రం సహకరించడం లేదన్నారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో ప్రభుత్వం రైతులకు అండగా నిలవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.ప్రభుత్వ అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని పరిశీలించి సమగ్ర సర్వే నిర్వహించాలని చిన్నయ్య పడాల్ డిమాండ్ చేశారు. నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరాకు రూ.25 వేల చొప్పున పంట నష్టపరిహారం తక్షణమే అందించాలని, తాజంగి రిజర్వాయర్ సమస్యలను పరిష్కరించి చివరి ఆయకట్టు రైతులకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

## మధుర జ్ఞాపకాలకు వీడ్కోలు.. ఉత్తరాంధ్ర అభివృద్ధికి సరికొత్త శుభారంభం

నెల్లిమర్ల నియోజకవర్గం ఆగస్ట్ 1)విశాఖపట్నం విమానాశ్రయంతో నాకు ఎంతో మధురమైన, భావోద్వేగభరితమైన అనుబంధం ఉంది. నా కెరీర్ మరియు భవిష్యత్తు కోసం తొలిసారిగా 1989లో అమెరికాకు వెళ్లేందుకు ఇదే విమానాశ్రయం నుంచి నా ప్రయాణాన్ని ప్రారంభించాను. అలాగే, నా ఆప్తులను చివరిసారిగా ఇక్కడి నుంచే పంపిస్తున్న ఈ తరుణంలో ఆ నాటి జ్ఞాపకాలు మళ్లీ కళ్లముందుకు వచ్చాయి.విశాఖపట్నం విమానాశ్రయంలో అనేక సందర్భాల్లో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు ఘన స్వాగతం పలికిన సందర్భాలు కూడా నాకు ప్రత్యేకమైన జ్ఞాపకాలుగా మిగిలిపోయాయి.ఇప్పుడు విశాఖపట్నం విమానాశ్రయంలో వాణిజ్య విమాన సేవలు ముగియడం కొంత బాధ కలిగిస్తున్నప్పటికీ, ఉత్తరాంధ్ర సమగ్ర అభివృద్ధికి సరికొత్త మైలురాయిగా భోగాపురం మండలంలో రూపుదిద్దుకున్న అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం సేవలను ప్రారంభించనుండటం ఎంతో సంతోషకరమైన విషయం.గతంలో ఇదే విమానాశ్రయంలో పవన్ కళ్యాణ్‌కు ఘన స్వాగతం పలికిన మధురమైన సందర్భాలను గుర్తుచేసుకుంటూ, భోగాపురం విమానాశ్రయ కార్యకలాపాలు ప్రారంభమవుతున్న ఈ శుభతరుణంలో ఉత్తరాంధ్ర అభివృద్ధికి నాంది పలుకుతున్న ఈ బృహత్ ప్రాజెక్టును హృదయపూర్వకంగా స్వాగతిస్తున్నాను.అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ఉత్తరాంధ్రకు ఆర్థిక, పారిశ్రామిక, పర్యాటక మరియు ఉపాధి రంగాల్లో మరింత అభివృద్ధిని తీసుకురావాలని, ఈ ప్రాంత ప్రజల భవిష్యత్తుకు కొత్త అవకాశాలకు వేదికగా నిలవాలని ఆకాంక్షిస్తున్నాను.లోకం మాధవి నెల్లిమర్ల జనసేన ఎమ్మెల్యే





## విజయవంతమైన మెగా ఉచిత కంటి ఆపరేషన్ల శిబిరం



కుప్పం,/ ఆగస్టు 16 సాయి మాత సేవ ట్రస్ట్ ఆధ్వర్యంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో బెంగళూరు శంకర కంటి ఆసుపత్రి వారిచే ఆదివారం ప్రభుత్వ బాలుర హైస్కూల్ నందు ఉచిత కంటి ఆపరేషన్ల పరీక్షా శిబిరము నిర్వహించబడినది. ఈ శిబిరానికి దాదాపు 160 మంది కంటి రోగులను పరీక్షించి వీరిలో 49 మందికి కంటి ఆపరేషన్ గాను ఎంపిక చేయడం జరిగింది.. వీరికి సోమవారం బెంగళూరులోని శంకర కంటి ఆసుపత్రిలో ఉచిత కంటి ఆపరేషన్లు నిర్వహించబడును అని సాయి మాత సేవ ట్రస్ట్ వ్యవస్థాపకులు జగదీష్ బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్య సిబ్బంది శివప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.

## 2018 గ్రూప్ - 1 మెయిన్స్ పరీక్ష ఫలితాలలో జరిగిన అవతవకల పై సీబీఐ విచారణ చేయాలి

ఏపీపీఎస్సీని ప్రక్షాళన చేసి కొత్త చైర్మన్, సభ్యులను నియమించాలి

మహంకాళి సుబ్బారావు ఏఐవైయఫ్ జిల్లా అధ్యక్షుడు




నరసరావుపేట: ఆగస్టు-16( కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వ శాఖలలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏఐవైయఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 19 వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా నిరసనలలో భాగంగా పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయల వద్ద నిరసనలు సంబంధించిన ఆదివారం పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో వాల్ పోస్టర్స్ ను యువతతో కలిసి విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐవైయఫ్ జిల్లా అధ్యక్షుడు మహంకాళి సుబ్బారావు మాట్లాడుతూ నరేంద్ర మోడీ ఎన్నికల ముందు సంవత్సరానికి రెండు కోట్లు ఉద్యోగాలు ఇస్తామని నిరుద్యోగులకు హామీ ఇచ్చారని మోడీ ప్రభుత్వం అధికారం చేపట్టి 12 సంవత్సరాలు అయిన కనీసం కోటి ఉద్యోగాలు కూడా ఇవ్వకుండా నిరుద్యోగ యువతను మోసం చేశారని వారు దయబట్టారు. ప్రభుత్వం యువతకు సబ్సిడీ రుణాలు ఇచ్చి పారిశ్రామిక వేత్తలుగా తయారు చేస్తామని చెప్పి నిరుద్యోగ యువతకు గత రెండేళ్లుగా సబ్సిడీ రుణాలు ఇవ్వకుండా మోసం చేశారని వారున్నారు. విద్యార్థులకు నిర్వహించే పోటీ పరీక్షలు సంబంధించిన నీట్ పేపర్ లీకేజ్ కావడం వలన విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. చనిపోయిన విద్యార్థుల కుటుంబాలకు ఎవరు బాధ్యత వహిస్తారని ప్రభుత్వాని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో ఏపీపీఎస్సీ నిర్వహించిన 2018 గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష, ఇంటర్వ్యూ ఫలితాలలో అవతవకలు జరిగాయని ఏపీ హైకోర్టు కు సిట్ రిపోర్ట్ ఇచ్చారు అని మెరిట్ అభ్యర్థులు కాకుండా అడ్డదారులో వచ్చిన వారికి ఉద్యోగాలు ఇచ్చిన ఏపీపీఎస్సీ చైర్మన్, సభ్యులు, అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఏపీపీఎస్సీని పక్షాన చేసి కొత్త చైర్మన్, సభ్యులను నియమించాలని, 2019 నుండి 2024 వరకు ఏపీపీఎస్సీ నిర్వహించిన పరీక్షల పైన సిబిఐ చేత విచారణ చేయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికలలో కూటమి ప్రభుత్వం యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 19 న కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే నిరసన కార్యక్రమంలో యువత భాగ్యస్వామ్యం కావాలని పిలుపు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐయస్యఫ్ జిల్లా అధ్యక్షుడు మేకపోతుల నాగేశ్వరరావు,ఏఐవైయఫ్ నాయకులు రొడ్డా అంజిరెడ్డి,యు.రాజు,సూర్య, హేమంత్, చక్రి పాల్గొన్నారూ.

## టీవీఎస్ ఎక్సెల్ అదుపుతప్పి వ్యక్తికి తీవ్ర గాయాలు



కరీంనగర్ జిల్లా, ఆగస్టు 16 శంకరపట్నం మండలం తాడికల్ గ్రామానికి చెందిన జక్కని వెంకటస్వామి (55) టీవీఎస్ ఎక్సెల్‌పై వెళ్తుండగా ప్రమాదానికి గురయ్యాడు. స్నేహితుడిని కలిసేందుకు తాడికల్‌లోని పెద్దమ్మ గుడి వద్దకు వెళ్లి తిరిగి వస్తుండగా, రాజీవ్ రహదారిపై నూతన బ్రిడ్జి సమీపంలో బండి అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో వెంకటస్వామి రోడ్డుపై పడిపోవడంతో తలకు, ముక్కుకు, పెదవులకు బలమైన గాయాలయ్యాయి.స్థానికులు వెంటనే 108కు సమాచారం అందించారు.ఈఎంటీ గూడూరి సతీష్‌రెడ్డి, పైలట్ ఎల్లా గౌడ్ సంఘటనా స్థలానికి చేరుకుని ప్రథమ చికిత్స అందించారు.అనంతరం క్షతగాత్రుడిని కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## స్మార్ట్ రేషన్ కార్డులపై మోదీ ఫోటో పెట్టాల్సిందే

కాంగ్రెస్ సర్కార్ అనవసర రాజకీయాలు చేస్తే మూల్యం చెల్లించుకోవాల్సిందే: బీజేపీ



కరీంనగర్ జిల్లా ఆగస్టు 16:కొత్త స్మార్ట్ రేషన్ కార్డులపై ప్రధాని నరేంద్ర మోదీ ఫోటోను తప్పనిసరిగా ముద్రించాలని కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావు డిమాండ్ చేశారు. శంకరపట్నంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఎనుగుల అనిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.పేదలకు అందిస్తున్న 5 కిలోల ఉచిత బియ్యంలో కేంద్ర ప్రభుత్వమే ప్రధాన భాగాన్ని అందిస్తోందని తెలిపారు. కేంద్రం అందిస్తున్న సాయాన్ని పక్కనపెట్టి రాష్ట్ర ప్రభుత్వం తమదే అన్నట్లుగా ప్రచారం చేసుకోవడం సరికాదన్నారు. రేషన్, సంక్షేమ పథకాల విషయంలో రాజకీయాలు చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.కార్యక్రమంలో బీజేపీ నాయకులు దండు కొమురయ్య, దొంగల రాములు,దాసారపు నరేందర్,కొయ్యడ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణ్ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు రాజ్యాంగబద్ధ హక్కు కల్పించాలి - సిఐటియు




:కళ్యాణ్ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు రాష్ట్రంలో నిరుపేదలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని, ఈ పథకాలను కొనసాగించడానికి రాష్ట్ర ప్రభుత్వం రాజ్యాంగబద్ధంగా హక్కు కల్పించి అమలు చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పిట్టల అర్జున్అన్నారు.ఆదివారం సిఐటియు మండల కమిటీ సమావేశం బత్తుల శ్రీను అధ్యక్షతన స్థానిక సిఐటియు కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా పిట్టల అర్జున్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల కళ్యాణ్ లక్ష్మి పథకం విషయంలో హైకోర్టు తీర్పు వెలువడిందని అన్నారు. కళ్యాణ్ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు ఇప్పటికే నిలిచిపోవడం వలన పెట్టుకున్న దరఖాస్తులకు పేమెంట్ విడుదల కాక లబ్ధిదారులు అయిన ఆర్థికంగా వెనకబడిన పేద కుటుంబాలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.పేద ప్రజలకు అమలు జరుగుతున్న ఈ పథకాలకు ఆర్థిక భరోసా ఇవ్వాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉన్నదని అన్నారు. వెంటనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించి రాజ్యాంగబద్ధ హక్కు కల్పించి కళ్యాణ్ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను అమలు చేయాలని కోరారు. ఎన్నికల హామీ మేరకు ఈ పథకాలకు డబ్బులు పెంచి తులం బంగారం ఇవ్వాలని, పేదలకు అండగా నిలబడాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ మురహరి రఘు, మండల నాయకులు కవులూరి రామకృష్ణ, సత్యవతి, విక్రమ్, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

# బీసీ జాబితాలోని 139 కులాల ప్రతినిధులు సర్పంచ్ అయ్యే రిజర్వేషన్లు కావాలి

### రాజ్యాంగ సవరణ లేకుండా 34 శాతం రిజర్వేషన్లు ఇస్తామనటం బూటకం




అమరావతి: ఆగస్టు-1ొ6 జిల్లా ప్రతినిధి ఎన్ వై రాజు) స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు ఇచ్చేందుకు కూటమి ప్రభుత్వం రాజీవ్ రంజన్ మిశ్రా డెడికేషన్ కమిటీ ఏర్పాటు చేయడం, మసిపూసి మారేడును నేరేడు చేయడమే. రిజర్వేషన్లు 50 శాతం దాటకూడదనే సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఎస్సీ ఎస్టీల జనాభా 23.41 శాతంగా ఉండటం వల్ల, బీసీలకు 26.59 శాతం రిజర్వేషన్లు మాత్రమే ఇచ్చే అవకాశం ఉంది. 26.59 శాతం రిజర్వేషన్లు ఇచ్చే అవకాశం ఉంటే 34 శాతం ఇస్తామని చెప్పడం బీసీలను మోసగించడమే. రాజ్యాంగ సవరణ లేకుండా బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు ఎలా ఇస్తారో కూటమి పెద్దలు సమాధానం చెప్పాలి. డెడికేషన్ కమిటీ ప్రజల సూచనల్ని పరిగణలోకి తీసుకోలేదు. ప్రభుత్వం కోరుకున్నట్టుగా నివేదిక ఇచ్చింది.గతంలో జరిగిన అన్ని పంచాయతీ ఎన్నికల్లోనూ రిజర్వేషన్ల అమలుకు మండలాన్ని యూనిట్ గా తీసుకున్నారు. ప్రస్తుతం రాజీవ్ రంజన్ మిశ్రా డెడికేషన్ కమిటీ కూడా రిజర్వేషన్ల అమలుకు మండలాన్నే యూనిట్ గా తీసుకోవాలని ప్రతిపాదించింది.2021 లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో, ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 56 మండలాలకు గాను 22 మండలాల్లో షెడ్యూల్డ్ తెగలకు ఒక్క పంచాయతీ కూడా రిజర్వు కాలేదు. బెస్తవారిపేట, కంభం, దొనకొండ, హనుమంతునిపాడు, ఇంకొల్లు, కొనకనమిట్ల, కొమరోలు, కొండపి, కొరిసపాడు, మార్కాపురం, మద్రిపూడి, ఒంగోలు, పెదచెర్లోపల్లి, పొదిలి, రాచర్ల, సంతనూతలపాడు, టంగుటూరు, తర్లుపాడులి తాళ్లూరు, వెలిగండ్ల, వలేటివారిపాలెం, యద్దనపూడి మండలాల్లో షెడ్యూల్డ్ తెగలకు సున్నా పంచాయతీలు వచ్చాయి. ఉమ్మడి శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని 48 మండలాలకు గాను 7 మండలాల్లో బీసీలకు సున్నా (0) పంచాయతీలు వచ్చాయి. ఒక మండలంలో షెడ్యూలు తెగలకు సున్నా (0) పంచాయతీ వచ్చింది. దుత్తలూరు మండలంలో షెడ్యూల్ తెగల జనాభా 2.40 శాతంగా ఉండడంతో, ఈ మండలంలో షెడ్యూలు తెగలకు ఒక్క పంచాయతీ కూడా రాలేదు. గూడూరు, చిల్లకూరు, వాకాడు, చిట్టమూరు, నాయుడుపేట, పెళ్ళకూరు, దొరవారిసత్రం మండలాల్లో బీసీలకు ఒక్క పంచాయతీ కూడా రిజర్వు కాలేదు. 2021 లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో, రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ ఇలాంటి పరిస్థితి తలెత్తింది. రాజీవ్ రంజన్ మిశ్రా కమీషన్ రిజర్వేషన్ల అమలుకు మండలాన్నే యూనిట్ గా తీసుకోవాలని సిఫారసు చేయడం వల్ల, ఎస్సీ ఎస్టీ బీసీలకు 2021 లో జరిగిన నష్టమే 2026 లో కూడా పునరావృతం అవుతుందని కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (సిపిఐ) భావిస్తున్నది.

**రాష్ట్రంలో ఎస్సీ ఎస్టీ బీసీ కులాల జనాభా ఓ జిల్లాలో ఒక్కో తీరుగా ఉన్నది.**

1. శ్రీకాకుళం (9.46%), 2. విజయనగరం (10.57%), 3. విశాఖపట్నం (7.68%), 4. వైయస్సార్ కడప (16.16%), 5. అనంతపురం (14.29%) జిల్లాల్లో షెడ్యూల్డ్ కులాల జనాభా రాష్ట్ర జనాభా సగటు కంటే తక్కువగా ఉండటం వల్ల, ఈ జిల్లాల్లో షెడ్యూల్డ్ కులాలకు పంచాయతీలు తగ్గుతున్నాయి. తదనగుణంగా బీసీలకు ఈ 5 జిల్లాల్లో పంచాయతీలు పెరుగుతున్నాయి. 1. తూర్పుగోదావరి (18.34%), 2. పశ్చిమగోదావరి (29.62%), 3. కృష్ణ (19.28%), 4. గుంటూరు (19.59%), 5. ప్రకాశం (23.19%), 6. నెల్లూరు (22.49%), 7. కర్నూలు (18.21%), 8. చిత్తూరు (18.82%)జిల్లాల్లో షెడ్యూల్డ్ కులాల జనాభా రాష్ట్ర జనాభా సగటు కంటే ఎక్కువగా ఉండటం వల్ల, ఈ 8 జిల్లాలో షెడ్యూల్డ్ కులాలకు ఎక్కువ పంచాయతీలు వస్తున్నాయి. తదనుగుణంగా బీసీల కు పంచాయతీలు గణనీయంగా తగ్గిపోతున్నాయి. కొన్ని మండలాల్లో సున్నా (0) పంచాయతీలు వస్తున్నాయి.ఇక షెడ్యూల్డ్ తెగల విషయానికి వస్తే, 1. విజయనగరం (10.05%), 2. విశాఖపట్నం (14.42%), 3. నెల్లూరు (9.65%) జిల్లాల్లో షెడ్యూల్డ్ తెగల జనాభా శాతం రాష్ట్ర షెడ్యూల్డ్ తెగల జనాభా సగటు కంటే ఎక్కువగా ఉండటంవల్ల, ఈ 3 జిల్లాల్లో షెడ్యూల్డ్ తెగలకు ఎక్కువ పంచాయతీలు వస్తున్నాయి. మిగిలిన 10 జిల్లాల్లో (తూర్పుగోదావరి:4.14%, పశ్చిమగోదావరి: 2.77%, కృష్ణ: 2.83%, గుంటూరు: 5.96%, ప్రకాశం: 4.45%, కడప: 2.94%, కర్నూలు: 3.78%, అనంతపురం: 3.81%, చిత్తూరు: 5.53%) షెడ్యూల్డ్ కులాలకు పంచాయితీలు గణనీయంగా తగ్గిపోతున్నాయి.ఎస్సీ ఎస్టీల జనాభా శాతం ఒక్కో జిల్లాలో ఒక్కో విధంగా ఉండటం వల్ల, ఆ జిల్లాల్లోని మండలాల్లో రిజర్వేషన్ అమలులో సమ న్యాయం అమలు కావటం లేదు. రాజీవ్ రంజన్ మిశ్రా డెడికేషన్ కమిటీ ఈ అంశాన్ని పరిగణలో తీసుకోలేదు. మండలంలో పంచాయతీల సంఖ్య బేసి సంఖ్యగా ఉంటే, రౌండింగ్ బెనిఫిట్ ఎస్సీ ఎస్టీ బీసీలకు ఇవ్వటం లేదు. జనరల్ పూల్ కు ఇస్తున్నారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో 48 మండలాలకు గాను 20 మండలాల్లో బేసి సంఖ్య పంచాయతీలు ఉన్నాయి. ఈ 20 మండలాల్లో రౌండింగ్ బెనిఫిట్ జనరల్ పూల్ కు ఇవ్వటం వల్ల బీసీలకు నష్టం జరిగింది. మిగిలిన అన్ని జిల్లాల్లోనూ ఇలాంటి పరిస్థితి కొనసాగుతున్నది. ఈ అంశాన్ని రాజీవ్ రంజన్ మిశ్రా డెడికేషన్ కమిటీ గుర్తించలేదు. మండలాన్ని యూనిట్గా తీసుకోవడం వల్ల, ఉత్తరాంధ్రలో ఎస్సీలకు పంచాయతీలు తగ్గుతున్నాయి. కోస్తా ఆంధ్రలో బీసీలకు ఎస్టీలకు పంచాయతీలు తగ్గుతున్నాయి. రాయలసీమలో ఎస్సీలకు ఎస్టీలకు బీసీలకు పంచాయతీలు తగ్గుతున్నాయి. ఈ అంశాన్ని కూడా రాజీవ్ రంజన్ మిశ్రా డెడికేషన్ కమిటీ పరిగణలోకి తీసుకోలేదు. అలాగే 2011 సెన్సస్ లో గుర్తించిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ జనాభాను, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ కులాల జనాభాను, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ తెగల జనాభాను రాజీవ్ రంజన్ మిశ్రా డెడికేషన్ కమిటీ పరిగణలోకి తీసుకొని, రిజర్వేషన్ శాతాన్ని లెక్కించినందువల్ల, షెడ్యూల్డ్ కులాలకు 0.5 నుండి 1 శాతం రిజర్వేషన్ కోల్పోతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీ ఎస్టీ బీసీల రిజర్వేషన్ల అమలుకు రాష్ట్రాన్ని యూనిట్ గా తీసుకోవడం వల్ల రాష్ట్ర సగటు 16.41 శాతంగా ఉన్న షెడ్యూల్డ్ కులాలకు ప్రతి 10 పంచాయతీలలో 2 పంచాయతీలు రిజర్వ్ అవుతాయి. రాష్ట్ర సగటు 7 శాతంగా ఉన్న షెడ్యూల్డ్ తెగలకు ప్రతి 10 పంచాయతీలలో 1 పంచాయితీ రిజర్వ్ అవుతుంది. అలాగే బీసీలకు ప్రతి 10 పంచాయతీలలో 2 పంచాయతీలు రిజర్వ్ అవుతాయి. ఈ రకమైన విధానం వల్ల ప్రాంతీయ అసమానతలు తొలగుతాయి, ఎస్సీ ఎస్టీ బీసీల రిజర్వేషన్లలో సమన్యాయం పాటించినట్టు అవుతుంది.రాజీవ్ రంజన్ మిశ్రా డెడికేషన్ కమిటీ రాష్ట్రవ్యాప్తంగా పర్యటించినప్పుడు, రాష్ట్రంలోని వెనుకబడిన తరగతుల ప్రజల్లో అత్యంత వెనుకబడిన కులాల ప్రజలు, అత్యంత వెనుకబడిన కులాల ప్రజలు కూడా పంచాయితీ సర్పంచులుగా వార్డు మెంబర్లుగా ఎన్నికయ్యే రిజర్వేషన్ విధానాన్ని తీసుకురావాలని, గౌరవ వేతనంతో విధులు నిర్వహించే అంగనవాడి ఆయా, అంగనవాడి టీచర్ పోస్టుల భర్తీకి రోస్టర్ కేటాయించినట్టుగానే, గ్రామపంచాయతీ సర్పంచ్, వార్డు మెంబర్ పదవులకు కూడా క్యాస్ట్ రోస్టర్ పాయింట్ ఇవ్వాలని రాష్ట్రంలోని మెజారిటీ ప్రజలు రాజీవ్ రంజన్ మిశ్రా డెడికేషన్ కమిటీని కోరారు. అయితే రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ అత్యంత వెనుకబడిన బీసీ కులాల ప్రజలు పంచాయతీ సర్పంచులుగా వార్డు మెంబర్లుగా ఎంపికయ్యే రిజర్వేషన్ విధానాన్ని సిఫారసు చేయలేదు.1. స్థానిక సంస్థల ఎన్నికల్లో రాష్ట్రాన్ని యూనిట్ గా తీసుకోవాలని కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (సిపిఐ) డిమాండ్ చేస్తున్నది.2. స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన తరగతుల జాబితాలోని ఉన్న 139 కులాల ప్రతినిధులకు సర్పంచ్ అవకాశం వచ్చేలా క్యాస్ట్ సీరియల్ నెంబర్ను రోస్టర్ పాయింట్ గా తీసుకొని రిజర్వేషన్ అమలు చేయాలని కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (సిపిఐ) డిమాండ్ చేస్తున్నది.

# ‘ఆషీకీ 3’ లో శ్రీలీల రీ-ఎంట్రీ!




ట్యాలెంటెడ్ బ్యూటీ శ్రీలీల బాలీవుడ్ కెరీర్ పై ఎంత సీరియస్ గా ఉందో చెప్పాల్సిన పనిలేదు. ఇప్పటికే అమ్మడు రెండు..మూడు ప్రాజెక్ట్ ల్ని లాక్ చేసింది. వాటిలో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతోన్న ‘ఆషీకీ 3’ లో అమ్మడు హీరోయిన్ గా నటిస్తోన్న సంగతి తెలిసిందే. కార్తీక్ ఆర్యన్ హీరోగా అనురాగ్ బసు దర్శకత్వంలో తెరకెక్కుతోన్న రొమాంటిక్ మ్యూజికల్ చిత్రంలో శ్రీలీల పాత్ర ఎంతో కీలమైంది. ఇప్పటికే చిత్రానికి సంబంధించి కొంత భాగం షూటింగ్ పూర్తయింది. అనంతరం యూనిట్ షూటింగ్ కి కొంత బ్రేక్ ఇచ్చింది. ఈ నేపథ్యంలో తాజాగా ముంబై కొత్త షెడ్యూల్‌లో శ్రీలీల తిరిగి షూటింగ్‌లో పాల్గొన్నట్లు సమాచారం. ముంబైలోని ప్రత్యేకంగా వేసిన భారీ సెట్స్‌లో అత్యంత వైభవంగా జరుగుతోంది. ఇందులో కీలకమైన రొమాంటిక్ సన్నివేశాలతో పాటు, కొన్ని మ్యూజికల్ సాంగ్స్ షూటింగ్‌ను యూనిట్ తెరకెక్కిస్తోంది. సెట్స్‌లోకి శ్రీలీల తిరిగి గ్రాండ్‌గా రీ-ఎంట్రీ ఇవ్వడంతో సందడి వాతావరణం నెలకొంది. కార్తీక్ ఆర్యన్ - శ్రీలీల జోడీ చూడచక్కగా ఉందని, ఇద్దరి మధ్య ఆన్-స్క్రీన్ కెమిస్ట్రీ సినిమాకే హైలైట్‌గా నిలుస్తుందని చిత్ర వర్గాలు చెబుతున్నాయి. ఈ చిత్రం లో రొమాన్స్ మాత్రమే కాకుండా అద్భుతమైన సంగీతానికి పెద్దపీట వేసి రూపొందిస్తున్నారు. విజువల్స్ పరంగా, మ్యూజిక్ పరంగా ప్రేక్షకులకు అద్భుతమైన దృశ్యకావ్యంగా సినిమా ఉండబోతుందని ప్రేక్షకులు అంచనా అంచనా వేస్తున్నారు. సినిమాలో పాత్ర కోసం శ్రీలీల ప్రత్యేకంగా నటనలోనూ, లుక్స్ పరంగానూ ఎంతో శ్రద్ధ పెట్టినట్లు తెలుస్తోంది. టాలీవుడ్ లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న శ్రీలీల బాలీవుడ్ బాట పట్టడం అమ్మడి కెరీర్‌లో మరో మైలురాయిగా మారుతోంది. ఇప్పటికే టాలీవుడ్‌లో స్టార్ హీరోల సరసన నటించి మెప్పించిన అమ్మడు హిందీ పరిశ్రమలో కూడా సత్తా చాటేందుకు ఈ సినిమాను బలమైన వేదికగా మలుచుకుంటున్నారు.





# వెంకీ, బాలయ్య, చిరు.. ప్లానింగ్ ఎలా ఉందంటే?



టాలీవుడ్ సీనియర్ హీరోల లైనప్ చూస్తే ఒక క్లియర్ పాటర్న్ కనిపిస్తోంది. కొత్త వాళ్లతో కథా చర్చలు నడుస్తున్నా, వెంటనే సెట్స్ పైకి వెళ్లే సినిమాల విషయంలో మాత్రం తమకు ఆల్రెడీ హిట్ ఇచ్చిన దర్శకులకే మొదటి ప్రాధాన్యత ఇస్తున్నారు. బాలకృష్ణ వీరసింహారెడ్డి తర్వాత మళ్లీ గోపీచంద్ మలినేనితో చీదీఖ111 పట్టాలెక్కించాడు. చిరంజీవి వాల్తేరు వీరయ్య సక్సెస్ ఇచ్చిన బాబీ కొల్లితో మెగా 158 పనులు మొదలుపెట్టాడు. వెంకటేష్ కూడా అనిల్ రావిపూడితో ఎఫ్ 2, ఎఫ్ 3, సంక్రాంతికి వస్తున్నాం తర్వాత మళ్లీ కొత్త సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్నాడు. అయితే సీనియర్ స్టార్స్ కొత్త దర్శకులను పూర్తిగా పక్కన పెట్టేశారని కాదు. చిరంజీవి ఇప్పటికే న్యూ జనరేషన్ డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెలతో అధికారికంగా ప్రాజెక్ట్ అనౌన్స్ చేశాడు. గుడ్ బ్యాడ్ అగ్లీ ఫేమ్ అధిక్ రవిచంద్రన్ బాలకృష్ణను డైరెక్ట్ చేసే ఛాన్స్ ఉందనే ప్రచారం నడుస్తోంది, దీనిపై క్లారిటీ రావాల్సి ఉంది. వెంకటేష్ గతంలో యంగ్ డైరెక్టర్ శైలేష్ కొలనుతో సైంధవ్ చేశాడు. నాగార్జున నా సామి రంగతో విజయ్ బిన్నీకి ఛాన్స్ ఇవ్వడమే కాకుండా, కొత్త వాళ్లు కొత్త కథలతో అన్నపూర్ణ స్టూడియోస్ కి రావాలని ఈ ఆగస్టులోనే ఓపెన్ పిలుపునిచ్చాడు. కొత్త దర్శకుడితో సినిమా అంటే కథ నచ్చడం ఒక్కటే సరిపోదు. సీనియర్ స్టార్‌ను ఎలా ప్రెజెంట్ చేయాలి, థియేటర్లలో అభిమానులు ఏం కోరుకుంటున్నారు అన్న పల్స్ కూడా దర్శకుడికి పట్టుబడాలి. హీరో ఇమేజ్, బాక్సాఫీస్ మార్కెట్, బడ్జెట్ రికవరీ లాంటి లెక్కలు చాలా ఉంటాయి. కొత్త దర్శకుడు మంచి కథ తీసుకొచ్చినా, ఈ కమర్షియల్ హంగులను ఎలా బ్యాలెన్స్ చేస్తాడనే విషయంలో హీరోలకు పూర్తి క్లారిటీ రావాల్సి ఉంటుంది. ఇదే సమయంలో ఆల్రెడీ హిట్ ఇచ్చిన దర్శకుడైతే హీరో బాడీ లాంగ్వేజ్, ఫ్యాన్స్ ఎక్స్‌పెక్టేషన్స్ పై ఒక ఐడియా ఉంటుంది. ఇద్దరి మధ్య ఒక వర్కింగ్ ఈక్వేషన్ ముందే ఉండటం వల్ల కథను సెట్స్ మీదకు తీసుకెళ్లడం కాస్త సులువు కావచ్చు. ఎలాంటి సీన్స్ రాస్తే స్క్రీన్ మీద పేలుతాయి, ఎక్కడ కామెడీ వర్కౌట్ అవుతుంది అన్నది టెస్ట్ చేయాల్సిన అవసరం లేకుండానే ఒక క్లారిటీ ఉంటుంది. అయితే ఈ రిపీట్ కాంబినేషన్లు ఎప్పుడూ హిట్ గ్యారెంటీ ఇవ్వలేవు. గతంలో ఒక పెద్ద హిట్ వచ్చింది కదా అని మళ్లీ కలిస్తే ఆడియన్స్ కచ్చితంగా థియేటర్లకు వచ్చేస్తారనే గ్యారెంటీ సినిమా బిజినెస్‌లో ఉండదు. కాంబినేషన్ క్రేజ్ ఉన్నా, సినిమాలో కంటెంట్ వీక్ అయితే రిస్క్ తప్పదు. గతంలో ఒకే కాంబోలో వచ్చిన కొన్ని సీక్వెల్స్, నెక్స్ట్ ప్రాజెక్టులు తేలిపోయిన సందర్భాలు కూడా ఇండస్ట్రీలో ఉన్నాయి. ఇప్పుడు సీనియర్ హీరోల ప్లానింగ్ చూస్తే తెలిసిన ట్రాక్ రికార్డ్ ఉన్న దర్శకుల వైపు ఒక అడుగు ఎక్కువ వేస్తున్నట్టు కనిపిస్తోంది. కొత్త వాళ్లకు అవకాశాలు లేవని కాదు కానీ, తక్కువ టైమ్‌లో ప్రాజెక్ట్ లాక్ చేయడానికి ప్రూవ్డ్ కాంబినేషన్లే ప్రస్తుతానికి వాళ్లకు ఈజీ ఆప్షన్‌గా మారుతున్నాయి. చివరకు ఏ కాంబినేషన్ అయినా స్క్రీన్ మీద కొత్తదనం చూపిస్తేనే బాక్సాఫీస్ దగ్గర నిలబడుతుంది.




# ‘రాకా’ మీద ఇంత బరువు ఎందుకు?




అల్లు అర్జున్, అట్లీ కాంబినేషన్‌లో వస్తున్న ‘రాకా’ సినిమాకి సంబంధించి బయటకు వచ్చిన కంటెంట్ చాలా తక్కువ. ఏప్రిల్ నెలలో టైటిల్ అనౌన్స్ చేస్తూ బన్నీ కొత్త లుక్ రిలీజ్ చేశారు. అందులో బట్టతల, నెరిసిన గడ్డం, డార్క్ మేకప్ తో బన్నీని చూసి ఫ్యాన్స్ అంతా షాక్ అయ్యారు. ఆ లుక్ సెన్సేషన్ క్రియేట్ చేసింది కానీ, సినిమా స్టోరీ ఏంటి, బన్నీ క్యారెక్టర్ ఎలా ఉండబోతోంది లాంటి ప్రశ్నలకు ఆన్సర్ దొరకలేదు. అందుకే రాబోయే ఫస్ట్ వీడియో మీద అందరి ఫోకస్ పడింది. ఈ సినిమాకు కొత్తగా హైప్ తీసుకురావాల్సిన పనే లేదు. అటు ‘పుష్ప 2’ లాంటి పాన్ ఇండియా హిట్ తర్వాత బన్నీ చేస్తున్న సినిమా. ఇటు ‘జవాన్’ తో బాలీవుడ్ ను షేక్ చేసిన అట్లీ డైరెక్ట్ చేస్తున్న ప్రాజెక్ట్. కాబట్టి క్రేజ్ ఆటోమేటిక్ గా సెట్ అయిపోయింది. ఫస్ట్ లుక్ చూశాక ఇందులో బన్నీది నెగెటివ్ క్యారెక్టరా లేక డార్క్ షేడ్స్ ఉంటాయా అనే క్యూరియాసిటీ జనాల్లో బాగా పెరిగిపోయింది. ఫస్ట్ గ్లింప్స్ లేదా టీజర్ లో కేవలం హీరో ఎలివేషన్ షాట్స్ చూపిస్తే సరిపోదు. అట్లీ ఈ సినిమా కోసం ఎలాంటి ప్రపంచాన్ని సృష్టించాడనేది కనీసం చిన్న హింట్ అయినా ఇవ్వాలి. పైగా రాకా ఒక భారీ సైన్స్ ఫిక్షన్ యాక్షన్ ఫిల్మ్ అని ఇండస్ట్రీలో టాక్ నడుస్తోంది. అంత పెద్ద కాన్సెప్ట్ ఉన్నప్పుడు జస్ట్ పోస్టర్ తో మేజిక్ చేయలేరు. విజువల్స్ పడితేనే సినిమా స్కేల్ ఏంటో జనాలకు కనెక్ట్ అవుతుంది. పుష్పరాజ్ క్యారెక్టర్ జనాల మైండ్ లో ఎంత గట్టిగా ముద్ర వేసిందో అందరికీ తెలుసు. ఆ బాడీ లాంగ్వేజ్ ను బ్రేక్ చేయడం అంత ఈజీ కాదు. రాకా ఫస్ట్ లుక్ దానికి పూర్తి ఆపోజిట్ గా ఉంది. ఇప్పుడు రాబోయే వీడియోలో బన్నీ వాయిస్, నడిచే తీరు, యాటిట్యూడ్ అన్నీ కొత్తగా కనిపిస్తేనే ఆ మార్పు ఆడియన్స్ కు సింక్ అవుతుంది. పుష్ప ఇమేజ్ నుంచి బయటపడటానికి బన్నీకి ఇదే కరెక్ట్ టెస్ట్. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ ఫాస్ట్ గానే జరుగుతోంది. ఆగస్టులోనే ఒక స్పెషల్ గ్లింప్స్ వస్తుందని కొన్నాళ్లుగా ప్రచారం జరుగుతున్నా, మేకర్స్ నుంచి అఫీషియల్ డేట్ రాలేదు. ఇందులో దీపికతో పాటు రష్మిక మందన్న కూడా ఒక పాత్రలో నటిస్తోంది. ఇక రాకా నుంచి నెక్స్ట్ వచ్చే వీడియో యూట్యూబ్ రికార్డుల కోసమే కాదు. అసలు ఆ టైటిల్ కు అర్థం ఏంటి, ఆ షాకింగ్ లుక్ వెనక ఉన్న క్యారెక్టర్ బ్యాక్ గ్రౌండ్ ఏంటి అనే విషయాలపై క్లారిటీ ఇవ్వాలి. ఇప్పటిదాకా రాకా చుట్టూ ఉన్న మిస్టరీ జనాల్లో బాగానే వర్కవుట్ అయింది. ఇక వీడియో వదిలినప్పుడు ఆ క్యూరియాసిటీని ఇంకా పెంచుతారా లేక కథపై ఒక క్లారిటీ ఇస్తారా అనేది చూడాలి.

# రెడ్ ఔట్ ఫిట్ లో హీట్ పెంచేసిన రకుల్..



లేటెస్ట్ అవుట్ ఫిట్ తో ట్రెండీ లుక్ లో కనిపిస్తూ ఫాలోవర్స్ ను పెంచుకుంటున్న నేటితరం హీరోయిన్స్.. అందుకు తగ్గట్టుగానే గ్లామర్ వలకబోస్తూ ప్రేక్షకులను మెప్పిస్తున్నారు. ఇంస్టాగ్రామ్ ఓపెన్ చేస్తే చాలు సెలబ్రిటీల అందాల జాతర అభిమానులకు కన్నుల పండుగగా కనిపిస్తోంది. ఒకరి తర్వాత ఒకరు అందాలను ఆరబోస్తూ షేర్ చేస్తున్న ఫోటోలు విపరీతంగా వైరల్ అవుతున్నాయి. కొంతమంది గ్లామర్ వలక పోస్తే మరి కొంతమంది సాంప్రదాయంగా కనిపిస్తూ ఆకట్టుకుంటున్నారు. ఇక అలా నిత్యం ఫాలోవర్స్ కి చేరువలో ఉంటూ లేటెస్ట్ ఫోటోషూట్స్ తో ప్రేక్షకులను అలరిస్తున్న రకుల్ ప్రీత్ సింగ్ గురించి పరిచయాలు ప్రత్యేకంగా అవసరం లేదు. అందం, అభినయంతో, నటనతో ఆకట్టుకుంటూ ఇటు నిత్యం సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ ఫాలోవర్స్ ను పెంచుకుంటున్న ఈమె.. తాజాగా మరో లేటెస్ట్ అవుట్ ఫిట్ తో ఆడియన్స్ ముందుకు వచ్చింది. ఇంస్టాగ్రామ్ వేదికగా తాజాగా పంచుకున్న ఈ ఫోటోలు యువతను ఫిదా చేస్తున్నాయి. రకుల్ ధరించిన ఈ లేటెస్ట్ రెడ్ కలర్ అవుట్ ఫిట్ విషయానికి వస్తే.. ప్రముఖ డిజైనర్ నీతూ రోహ్రా డిజైన్ చేసిన స్వరోవ్ స్కీ అలంకరణలతో కూడిన ప్రత్యేకమైన ముదురు ఎరుపు రంగు డ్రెస్ ఈమె ధరించింది. షోల్డర్ లెస్ కాలమ్ ఫ్రాక్ ఇది. దీనికి చక్కగా స్వీట్ హార్ట్ నెక్ లైన్ తో లోతైన షీర్ మెష్ ఇన్సర్ట్ తో స్టిచ్ చేశారు. ముఖ్యంగా ఈ డ్రెస్ మొత్తం ఒకే రంగులో విభిన్న ఆకృతులు కలిగిన స్వరోవ్ స్కీ క్రిస్టల్స్ తో చాలా దట్టంగా, నిండుగా డిజైన్ చేశారు. నడుము భాగం వద్ద బిగుతుగా ఉండి.. దీనికి మ్యాచింగ్ గా రెడ్ కలర్ ఫ్యాబ్రిక్ తో బెల్ట్ డిజైన్ చేయగా.. దానికి మధ్యలో ఒక చక్కని బో లాగా డిజైన్ చేశారు. ఈ డ్రెస్ బాటంలో ఫిష్ కట్ ను తలపించేలా డిజైన్ చేశారు. మొత్తానికైతే రకుల్ ప్రీత్ సింగ్ ధరించిన ఈ లేటెస్ట్ అవుట్ ఫిట్ అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటుంది.



# సంక్రాంతికి సంబరాలు



ముగ్గుల పండుగ కోసం ముస్తాబవుతున్న సినిమాలు చాలానే! అవి ఒకొక్కటిగా విడుదల తేదీని ఖరారు చేసుకొంటున్నాయి. ఆ జాబితాలో చేరిన మరో సినిమా... సాయిదుర్గా తేజ్ ‘సంబరాల ఏటిగట్టు’. సంక్రాంతి సందర్భంగా ఈ చిత్రాన్ని జనవరి 12న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్టుగా చిత్రబృందం శనివారం ప్రకటించింది. రోహిత్ కేపీ దర్శకుడిగా పరిచయం అవుతున్న చిత్రమిది. కె.నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి సంయుక్తంగా నిర్మించారు. ఐశ్వర్య లక్ష్మి కథానాయిక. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమా ప్రస్తుతం నిర్మాణానంతర పనుల్ని చేసుకొంటోంది. జగపతిబాబు, సాయికుమార్, శ్రీకాంత్, అనన్య నాగళ్ల తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: వెట్రివేల్ పళనిస్వామి, సంగీతం: బి.అజనీష్ లోక్‌నాథ్, కూర్పు: నవీన్ విజయ్‌కృష్ణ, ప్రొడక్షన్ డిజైన్: గాంధీ నడికుడికర్.

# బాలీవుడ్ నుంచి సౌత్ వరకు...
# జాన్వీ మాస్టర్ ప్లాన్ ఇదేనా?





బాలీవుడ్ భామ జాన్వీ కపూర్ కెరీర్‌ను గమనిస్తే, అది కేవలం ఒక హీరోయిన్ భాషలు మారుస్తున్న జర్నీలా కనిపించదు. ఆమె సెలెక్షన్స్ చూస్తే, సౌత్ ఇండియన్ మార్కెట్ ను లాంగ్ టైమ్ లో టార్గెట్ పెట్టుకున్న స్ట్రాటజీ కనిపిస్తుందనే అభిప్రాయం సినీ వర్గాల్లో వ్యక్తమవుతోంది. తెలుగు సినిమాలతో ప్రారంభమైన ఆమె సౌత్ జర్నీ, ఇప్పుడు తమిళ కంటెంట్ వైపు మళ్లుతున్నట్లు డిస్కషన్ జరుగుతోంది. ఇందులో ముఖ్యంగా ఓటీటీకు ప్రాధాన్యం ఇవ్వడం మరింత ఆసక్తికర అంశంగా మారింది. తెలుగు సినిమాల్లో స్టార్ హీరోల సరసన కనిపించిన జాన్వీ, సౌత్ ఆడియన్స్ కు తన పరిచయాన్ని వేగంగా విస్తరించుకుంది. కమర్షియల్ సినిమాల ద్వారా మాస్ రీచ్ సాధించిన తర్వాత, ఇప్పుడు తమిళంలో లేడీ ఓరియెంటెడ్ కథతో ఓటీటీ ప్రాజెక్ట్ వైపు అడుగులు వేస్తోందన్న ప్రచారం యాదృచ్ఛికంగా చూడలేమనే అభిప్రాయం వినిపిస్తోంది. ఒకవైపు పెద్ద సినిమాలు, మరోవైపు కంటెంట్ డ్రివెన్ పాత్రలు అనే రెండు ట్రాక్‌లపై కెరీర్‌ను నిర్మించుకునే ప్రయత్నంగా దీనిని విశ్లేషిస్తున్నారు. తమిళ ఓటీటీలో గత కొంతకాలంగా లేడీ ఓరియెంటెడ్ స్టోరీలకు మంచి ఆదరణ పెరుగుతోంది. గ్రామీణ నేపథ్యాలు, సామాజిక అంశాలు, అణగారిన వర్గాల జీవితాల చుట్టూ తిరిగే కథలు ఆడియన్స్ లో డిస్కషన్ కు దారి తీస్తున్నాయి. అలాంటి వాతావరణంలో స్టార్ హీరోయిన్ ఒక ఉమెన్ సెంట్రిక్ స్టోరీని ఎంచుకోవడం, కేవలం మార్కెట్ విస్తరణ మాత్రమే కాకుండా నటిగా తన పరిధిని పెంచుకునే ప్రయత్నంగా కూడా కనిపిస్తోంది. మరో ఇంట్రెస్టింగ్ అంశం తమిళ వెబ్ సిరీస్‌లలో పెరుగుతున్న స్టార్ పవర్. ఒకప్పుడు వెబ్ సిరీస్‌లు కొత్త నటులకు అవకాశాల వేదికగా ఉండేవి. ఇప్పుడు పరిస్థితి మారింది. సినిమా స్టార్‌లు కూడా ఓటీటీ ప్రాజెక్ట్‌లను సమాన ప్రాధాన్యంతో చూస్తున్నారు. కారణం పాత్రల బలం, కథలకు లభించే స్వేచ్ఛ, మరియు పాన్ ఇండియా డిజిటల్ ఆడియన్స్. ఈ మార్పు తమిళ కంటెంట్‌కు కొత్త స్థాయిని తీసుకొస్తోంది. ఇది జాన్వీ ఒక్కరి కథ కాదు. కియారా అద్వానీ, దీపికా పదుకొణె, తాప్సీ వంటి హీరోయిన్లు కూడా సౌత్ ప్రాజెక్టులపై ఆసక్తి చూపించడం ఈ ట్రెండ్‌కు సంకేతం. సౌత్ ఇప్పుడు బాలీవుడ్ హీరోయిన్లకు సెకండ్ మార్కెట్ కాదు, మెయిన్ మార్కెట్ గా మారుతున్న సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. తెలుగు తర్వాత తమిళం, కమర్షియల్ సినిమా తర్వాత కంటెంట్ ఓరియెంటెడ్ ఓటీటీ, మాస్ రీచ్ తర్వాత యాక్టింగ్ కు ప్రాధాన్యం ఉన్న పాత్రలు.. ఈ క్రమాన్ని చూస్తే జాన్వీ కపూర్ సౌత్ స్ట్రాటజీ ఒక లాంగ్ టర్మ్ ప్లాన్‌లా కనిపిస్తోంది. బాలీవుడ్‌లో కంటిన్యూ అవుతూనే సౌత్ లో బలమైన స్థానం సంపాదించుకోవడం ఆమె అసలు లక్ష్యమా అనే ప్రశ్న ఇప్పుడు సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.




CORPORATE OFFICE:SNEHALA MEDIA PUBLICATIONS LLP, PLOT NO. 267,HUDA SAI NAGAR COLONY, BESIDE COMMUNITY HALL, VANASTHALIPURAM, RR DIST, HYDERABAD 500070.TG. CELL. 9348313999/8885727777.

Edited, Printed, Published & Owned By GURRAM PAPI REDDY,# H.No.4-57, Thorrur Village, Abdullapurmet Mandal, Turkayamal Municipality, Ranga reddy District.501511. Telangana. Printedat:GARUDA PRINT- ERS,# H.No.2-86/1, PlotNo.23-SP, SyNo.417, Sagar Highway, Ranganaguda Village, Abdullapurmet Mandal, Turkayamjal Municipality, Ranga reddy District.501510.Telangana.Published at: # H.No.4-57, Thorrur Village,Abdullapurmet Mandal, TurkayamalMunicipality, Ranga reddy District. 501511. Telangana...www.arunaprabha.com..email.arunaprabhadaily@gmail.com, RNI NO. TELTEL/2023/89778, Cell No. 9700127889